శ్రీ వేంకటేశ్వర మత్తేభమాలిక

(శ్రీ వేంకటేశ్వర సర్వస్వము)



రచన:

శాంతిశ్రీ "బాత్పకవి"

మల్లిఖార్జుననగరు - రాజమండ్రి - 533105

ప్రథమ ముద్రణ
వైశాఖ బహుళ దశమి
జయవారం (1989)

1,000 కాపీలు

మూల్యము : ఇరువదియైదు రూప్యములు

సర్వహక్కులు :
గ్రంథకర్తవి.

ముద్రణ :
విజయశ్రీ ప్రింటింగ్ వర్క్స్, రాజమండ్రి–1

వస్తుకధనం

విద్వద్విమర్శక శిరోమణి మహాకవి
శివశ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ
విశ్రాంతి ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలాధ్యక్షులు - రాజమండ్రి
శ్రీ శుక్ల శ్రీరామనవమి తే. 14-4-1989

"శాంతిశ్రీ" బౌత్సకవిగారు శ్రీకాకుళ ప్రాంతం నుండీ యీ రాజమహేంద్రవరం వచ్చి స్థిరపడిన తొలి నాళ్లలోనే నేను వీరిని, మిత్రులు శ్రీ తణికెళ్ల శ్రీరామమూర్తిగారి యింటి వద్ద చూడటం తటస్థించింది.

కంచు గీసినట్లున్న ఆ కంఠ ధ్వనిన్నీ, పరిస్ఫుటమై నిర్దుష్టమైన ఆ ఉచ్చారణా, రాగధోరణీ, కథాప్రవచనశైలీ, మంచికవితాశక్తీ, వీటికన్నింటికీ వన్నెతెచ్చే ఆ వినయమూ, మాటా, మర్యాదా, చూచినవెంటనే ఎవరినైనా ఆనుకూలింపజేసికొనే తీరు తాయవిపించింది.

సామాన్యంగా పెళ్ళిళ్ళలోనూ, సమ్మాన సభల్లోనూ, నవరత్నాలూ పంచరత్నాలూ చదువుతూ ఉండడంవల్ల నలుగురిలోనూ "కవి" అనే వాడుక ఏర్పడుతుంది కాని ఆ పద్యాలవల్ల అసలు బండారం తెలుస్తుందీ? ఇందులో మోసపోయే అవకాశమే ఎక్కువఉంటుంది. ఆ పద్యాలనుపట్టి యీయన "అంతంతమాత్రపుకవే" అని యెంతమాత్రమూ అనుకోవటానికి వీల్లేదు.

కవి కావటానికీ, కథకుడు కావటానికీ, అవసరమైన పరికరమూ, సామాగ్రీ, యీయనదగ్గఱ చాలాఉన్నది. ఆ సామగ్రి -"నాస్మాకం శిబికానఽ కాపికటకాద్యాఽలంక్రియా -సత్క్రియా-" అనిభవభూతి చెప్పినట్లు, గండపెండేరమూ, సింహతలాటాలూ వగైరాకాదు.

చిన్నప్పుడే హరికథాపితామహులు- శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారివంటి పెద్దలువద్ద శుశ్రూషచేసే అవకాశం యీయనకు లభించింది. ఆ ప్రాంతంలోని పైతరం పెద్దల సంగీత సాహిత్యప్రజ్ఞావిశేషాలన్నీ కథలూ, గాథలుగా వినియుండటం తటస్థించింది. కవికాదలచినవానికి యిది గొప్పఅవసరం

"వినఁగావలెను పూర్వవిద్వచ్చరిత్రముల్ పడవలె పడరానిపాటులెల్ల-"
ఇత్యాదిగా శ్రీ తిరుపతి వేంకటకవులు చెప్పనేచెప్పారు.

దీనివలన కూపస్థ మండూకంగా ఉండిపోయే ప్రమాదం తప్పిపోతుంది. ఆ పిమ్మట- రసవంతమైన పద్యాలు కొన్నివందలు నోటికి వచ్చి ఉండటంవల్ల తన పద్యాలకీ- ఇతరులపద్యాలకీ ఉన్నతేడా తెలుస్తుంది. దీనివల్ల అసలుకవిత్వంఅంటే యేమిటో తెలియటం మొదలు పెడుతుంది. క్రమంగా - ఈ బాలారిష్టాలన్నీదాటి - ఎదుటివారు అడిగితేనేకాని తనపద్యం వినిపించనిస్థితి యేర్పడుతుంది. నిజమైనకవి కావటానికి కావలసిన ఈ లక్షణాలన్నీ కరువై పోతూవున్న యీ రోజుల్లో బొత్సకవి గారు రచించిన శ్రీ వేంకటేశ్వర మత్తేభమాలిక- 1800 చరణాలకావ్యం మొదటి నుంచీ చివరివరకూ చదివే అవకాశం లభించింది.

ఇది చదువుతున్నంతసేపూ- బారులుతీర్చి వరుసగా నిలబడియున్న 1800 ఏనుఁగు అంబారీలమీద శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణకథావైభవం అంతా ఊరేగింపుగా వస్తున్నట్లే కళ్లకుకట్టింది, కలలో ఏనుఁగుకనిపిస్తే వేంకటేశ్వరస్వామి అనుగ్రహమే అంటారు. ఆ సప్తగిరులు పుట్టుపూర్వోత్తరాలూ, స్వామికి సంబంధించిన అపూర్వములూ, అద్భుతములూ అయిన అనేక గాథలు- ఈ మాలాగర్భంలో ఎంతో అందంగా కూర్చబడి ఉన్నాయి.॥

ఒక విధంగాచూస్తే - ఈ మత్తేభమాలిక "శ్రీ వేంకటేశ్వరకథా విజ్ఞానసర్వస్వం" అని చెప్పవలసిఉంటుంది. ఈ కవికి సమగ్రమైన విషయపరిజ్ఞానం ఉన్నది. కథరుచిగా చెప్పుకొనిపోయే నేర్పుఉన్నది. పండిన లోకానుభవమూ, సంప్రదాయజ్ఞతా, ఉన్నాయి. ధారాళమూ మధురమూ అయినశైలి ఉన్నది. వర్ణనలు ఎంతో క్లుప్తంగా అందంగా ప్రకరణోచితంగా ఉన్నాయి. సంభాషణలు లోకజ్ఞతనీ పాత్రస్వభావాన్నీ కళ్లకు కట్టిస్తున్నాయి.

ఉదాహరణకు- ఈ శుభలేఖ చూడండి.

"శ్రీ వేంకటశైలవాసునకు లోకస్థాన రక్షాకళా-కనదుత్సాహునకున్ బరాత్పరునకున్ గారుణ్య పాథోధికిన్- గుణికిన్ నిర్గుణికిన్ రమావరునకున్ ఘోరామరారాతిజీ-వన సర్వస్వ నిరాకరిష్ణునకు శుంభత్స్వాభవాలంకరి - ష్ణునకున్ జిష్ణునకున్ సహిష్ణునకు రాచూలిన్ మదీయాత్మజా; తను బద్మావతి సర్వసద్గుణవతిన్ దన్వీశిరోరత్నమున్-

జనకోర్వీవర పుత్రికా సన్నుత సన్మద్గేహ సంవర్ధితన్- మనమాహ్లాదము నొందఁగా నొసఁగి గన్యాదానముంజేయ సన్ముని పర్యుల్ తగ నిశ్చయించిరి కడున్మోదంబుతో బంధుమిత్ర నికాయంబుంతోఁ గుటుంబములతో రాగోపచున్నారని యంచును వర్ధంబు నొసంగు చందమున".......

ఇంతటి ప్రశస్తమైన కావ్యాన్ని రచించినకూడా- ఇది శ్రీ వేంకటేశ్వరస్వామి మొక్కుబడికనుకనే కాబోలును: అనువాయితీ తప్పకూడదను కాబట్టి తనకథతానే పరిచరించుకోవడానికి స్వామికీ కొంత మొహమాటంగానే ఉంటుందికాబట్టి శ్రీ బొప్పకవిగారు ఏడుఊళ్లూ తిరిగి తామే అచ్చువేయించి శ్రీ స్వామివారికి సమర్పించడం ఎంతో సముచితంగా ఉంది.

నాఁడు కుబేరునికి వలెనే నేడు మన బొప్పకవిగారికి శాశ్వతంగా ఈ కళ్యాణ కావ్య ఋణానికి వడ్డీ చెల్లిస్తూనే ఉండాలికాఁబోలు - శ్రీ వేంకటేశ్వరస్వామిః అసలుమాట అలాగే నిలిచి ఉంటుంది.

ఇతిశివం

సహృదయ భూమిక

ప్రాచార్య యస్వీ. జోగారావు

శ్రీ వేంకటేశ్వరావతారమును గూర్చి యిప్పటికి యెందరో కవులూ, పండితులూ, వివిధ సాహిత్య ప్రక్రియలలో తమ ప్రతిభా పాండిత్యములనూ, భక్తి ప్రపత్తులనూ ప్రదర్శించుచూ యెన్నియో రచనలను వెలయించి యుండిరి. మరల యీ బొప్పకవిగారి రచనయొక్క అవశ్యకతయేమి అనిపించవచ్చును. దానికి 'మరల నిదేలరామాయణంబన్నచో' అనిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి వక్కాణయే సమాధానము. అంతేకాదు-

'యా నేవశబ్దాన్ వయమాలపామః
యా నేవశార్థాన్ వయముల్లిఖామః
తైరేవ విన్యాస విశేష భవ్యైః
సమ్మోహయన్తే కవయో జగన్తి'

అని పూర్వమెప్పుడో ఒక పరమభావుకపట్టభద్రుడన్నట్లు ఒక విషయమును గూర్చి యెంతమంది కవులెన్ని పర్యాయములు రచనలు సాగించిననూ, వాని రామణీయక రహస్యము శబ్దార్థములకు పరిమితముగాక వాని సంఘటనలలోనూ, వాని విశిష్టమైన విన్యాసములోనూ, ఉండునని ఆ శ్లోకము పరమార్థము.

'రాఘవేశ్వరు చారిత్రము యెందరెన్నిగతులన్ వర్ణించినన్ గ్రాలవే' అని కంకంటి పాపరాజు వక్కాణ. అట్లే శ్రీ బొత్సకవిగారి "శ్రీ వేంకటేశ్వర మత్తేభ మాలికను" గూర్చియును మనము సమాధానము పడవలసి యున్నది.

మాలిక అనఁగా పువ్వులదండ. పూవులదేవుఁడు శ్రీవేంకటేశ్వరుఁడు. ఆయన వనమాలి. యిప్పటికినీ ప్రతిదినమూ ఆయనకు 'తోమాలెసేవ' జరుగుచున్నది. అందుచే వారి చారిత్రమును మాలికలో సంఘటించుట శ్రీ కవిగారు సాభిప్రాయ మర్యాదతో చేసినదని యనఁగదగును. యింక మత్తేభవృత్తమును స్వీకరించుటలోని ఔచిత్యమేమని అనుకొందము. 'మత్తేభమూ' సంస్కృత వృత్తమే. కాని ఆంధ్ర వాఙ్మయమున అందగించినట్లు, సంస్కృత వాఙ్మయమున చందగించలేదు. అదిగాక ఆ గజేంద్రుని ఆ వేంకటేశ్వరస్వామివారు రక్షించెనో అట్లే ఈ బొత్సకవిగారు యీ మత్తేభ చందః సౌందర్యమును పోషించిరి. మత్తేభవృత్తమున మాలిక వ్రాయుట యనఁగా కండగల కవికిగాని సామాన్యకవికి సాధ్యముగానిపని.

కథ జగత్ప్రసిద్ధము. కాని కావ్యమునకు కథకాదు ముఖ్యము, కవితగాని. అందులకే అనాడు కుంతకుఁడు తన వక్రోక్తి జీవితములో నీ విధముగా-

'నిరంతర రసోద్గార। గర్భాః సౌన్దర్య నిర్భరాః
గిరః కవీనాం జీవన్తి। న కథామాత్ర మాశ్రితాః'

ఈ విధముగా ఉద్ఘాటించెను. ఈ శ్లోకము పరమార్థమునే శ్రీ విశ్వనాథవారు తమ రామాయణ కల్పవృక్షములో

"కవి ప్రతిభలోన నుండును కావ్యగీతశ తాంశములయందు
తొంబదియైనపాళ్ళు, ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయి

రెట్లుఁగొప్పది నవకథాద్భుతిని మించి” అని సెలవిచ్చినారు. ఆ పెద్దలసుద్దిని బట్టి చూచినచో శ్రీ బొత్సకవిగారి కావ్యముయొక్క శోభను, కథయొక్క అందమే కాదు, కవితయొక్క చందము గూడా యనుమదింప జేయుచున్నవి. బొత్సకవిగారి కంఠమూ, గంటమూ హరికథాగానము గూర్చిగాని మూర్తిమంతము గూర్చిగాని ఒక్కమాటలో చెప్పమన్నచో ఆయన ఆదిభట్ల నారాయణదాస అంతేవాసి యన్నచో సరిపోవును. వయసులో నాకన్న చిన్నవాడు కావున ఆయన నాశీర్వదించుచున్నాను.

ప్రాచార్య - యస్వీ జోగారావు (సం)
తెలుగు శాఖాధ్యక్షులు
29-4-1989 ఆంధ్రవిశ్వవిద్యాలయము - వాల్తేరు

★

—: వి న తి :—

శ్రీ ధూళిపాళ విజయానందనాథ

మిత్రులు మానసీయులు, శ్రీ బొత్సకవిగారు తమ “వేంకటేశ్వర మత్తేభ మాలికను” కావ్యమును చదువనిచ్చి నా అభిప్రాయమును తెలియగోరిరి. నేనీ కావ్యమును స్థాలీపులాక న్యాయమున చూచి అభిప్రాయ మీయవలెనని భావించితిని. కాని పొత్తమును చేతపట్టినంత అమూలాగ్రముగ చదివిననేగాని విడువబుద్ధి పుట్టలేదు.

కావ్యము విశ్వశ్రేయో మూలమనిరి. ఆలంకారికులు. విశ్వమునకు శ్రేయః పేయములు భగవత్ భక్తి సమున్మేషితములేకదా! అందున ‘కలౌ వేంకట నాయకః’ అను ప్రసిద్ధి. ఈ కబ్బమందలి కావ్యవస్తువు వేంకటేశుని శ్రీ దివ్య విలాస ప్రభాభాసురము, కావ్యమునకు పరమప్రయోజనము ‘శివేతరక్షతి’ భగవల్లీలావిలాస వర్ణనా ప్రధానమైన కబ్బములు మాత్రమే ఆ పనిని చేయగలవనుట నిస్సంశయము. ఈ కవి తన అణకువను, మాతాపితృభక్తిని, కావ్యాదిని సంవిదతిశయముతో ప్రకటించుకొనినారు. ఈ కవితా సామ్రాజ్యములందలి మత్తేభములు, ఘౌంకమూ, ఖింకమూ కలిగి గమకములో హొయలు నొలకబోయుచు, సహృదయ ప్రశంసలనందుకొనుచున్నవి. ఈ కవికవిత సహజగంభీరము, చమత్కార విశి

ష్టము, ప్రసాదమేదురము, ఈ కావ్యమందలి పదపదము భక్తిరసపులకాండమే. ఈ కవిశేఖరుల మత్తేభరాజి యీతని కవితా సామ్రాజ్య వైభవముల ప్రత్యక్ష సాక్షి.

నారాయణుడు సహజముగ జలము నివాసముగా కలవాడు. యీ కవివరుఁడు సకలలోక చింతలనూ మాన్పు ఆ వైకుంఠవాసుని 'ఘనచింతాజలాసిలోపల మునుంగం బారుమండగా' అని సాధికారికముగా పద్మావతీ చింతాజలి రాసినిమగ్నునిచేసి వదిలారు.

వేంకటనాయకుని పతిగాఁగోరిన పద్మావతి "సేవించెద నేటినుండియు భవానీ భర్గులన్" అన్నట్లుగా చెప్పి అనాదినుంచీవచ్చే ఆర్యసముదాచారమును పద్మావతిచేత పాటింపచేసి ఆ తల్లి చేత శివదీక్ష యిప్పించారు కవిమిత్రులు.

'చనియజ్ఞోర్వని స్వర్ణ లాంగలముతో'' అనుమాటతో యీ హాటకకవి ఆకాశ రాజుచేత యాజ్ఞికభూమి సేద్యంచేయించారు. 'వాంఛింపదు మోక్షమైన' అనే మాటతో సేవాభావంలోనే తరించిపోగలమనే తపనను వకుళమ్మ సేవాభావముద్వార నిరూపించి భక్తిలోనే పరవశించిపోయారీమహాకవి.' అంత అంభోజాక్షుడన్నన్, శివుఁడని వన్ భేదములేదని శ్రీశుకులలవారిచేత పలికించి తమకుఁగల అద్వైతసిద్ధిని ఘంటాపథముగా ప్రకటించినారు.

యెన్నని నన్ను వ్రాయమంటారు. యీ కావ్యసాగరములో అమూల్యరత్నాలెన్నెన్నో! వెలికితీసి చూపుదమన్నను స్థలాభావము వలన రెండుమాటలు మాత్రము వ్రాసి కవిరాజుకవితకు అంజలిస్తూ శలవుతీసికొంటాను.

సాహిత్యాచార్య - విద్యావాచస్పతి,
విద్యాలంకార
ధూళిపాళ విజయానందనాథ
విశ్రాంత రీడర్ అలహాబాదు

21-5-89 ధూళిపాళ విజయానందనాథ యూనివర్శిటీ, అలహాబాదు

ఈ గ్రంథ రచయితకు అన్నివిధములా సహకార సంపత్తి అందించిన
వదాన్యులు ప్రముఖ వస్త్రవ్యాపారులు బొమ్మన బ్రదర్స్‌వారు రాజమహేంద్రవరము

శివశ్రీ బొమ్మన సుబ్బారావు,



రామచంద్రరావు,

కృష్ణమూర్తి,



దుర్గాప్రసాదరావుగార్లు

-: అనుభూతి :-

శివశ్రీ బొమ్మన సుబ్బారావు
రాజమండ్రి
తే. 21-4-19:9

ఘనమై, సుందరమై, యలంకృతములై కన్పండు వౌ నేనుగుల్
వనమున్ దీవిని మందమంద గతులన్ భాసిల్లి శోభిల్లెనాన్
మనమున్ పొంగెను చాత్సరాజసుకవీ మత్తేభనాహ్వాళులన్
ఘనుడౌ వేంకటనాథు పెండ్లికి మమున్ గైదండగొంపోవుటన్.

★

అభినందనము

డాక్టరు జొన్నలగడ్డ మృత్యుంజయరావు,
ఎం. ఏ., పిహెచ్. డి

మిత్రులు శ్రీ చాత్రకవిగారు శ్రీ వేంకటేశ్వరస్వామివారి చరిత్రమును పద్యమున నిబంధించుట అభినందనీయము.

అందును దానిని పీ రొకే ఛందస్సున-మత్తేభవృత్తమున రచించుట మఱియు విశేషము. కించిదూనముగ అష్టాదశ శతసంఖ్యాకములయిన పాదములు గలిగి, వీరి యిష్టదైవమగు హనుమంతుని మూర్తివలె విజృంభించిన మాలికయిది, దీనిని దనచే నా భగవానుడగు హనుమానుడే వ్రాయించెనని యీయనయే చెప్పికొనినారు.

'ఆ - హనుమంతుండె గలం దశకండె యిది వ్రాయంజేయు నా చేత; నీ పనిలో నేను నిమిత్తమాత్రుఁడను. విద్వాంసుండనా? నేఁబఠించిన దేదీ? చదువేది? అను మాటలు వీరి భగవద్భక్తికేకాక వినయ సంపదకును నిదర్శనములు.

ఇవ్వి పాదములుగల వృత్తమాలిక నేను గన్నది గాని విన్నదిగాని లేదు.

ఇందలి ప్రకరణోచితములగు వర్ణన లీయన కవితాశక్తిని నిరూపించును. యౌవనవతియగు పద్మావతి సౌందర్యమును వర్ణించిన తీరుఁజూడుఁడు.

'తనరన్ నూతనయౌవనోదయము పద్మాకాంత పాదాబ్జముల్
కనియెన్ బల్లవైభవంబు; కరముల్ కంజాత నాళద్వయం
బును బోలెన్; గళమొప్పె శంఖమువలెన్ బొల్పారె శ్రీకారరీ
తిని వీనుంగవల్లకల్వలగతిన్ దీపించె మన్ జూపు; చ
క్కనయై ముక్కు వొసంగెఁ జంపకపు మొగ్గంబోలి....

ఇట్లుసాగిన యీ వర్ణనమునఁ గ్రొత్తఁదనమేమియులేక పోవచ్చుఁగాక, అయినను నేదో రమణీయత పొందుపడియున్నది. మఱియు 'దేవతానాం రూపం పాదాఙ్గుష్ఠ ప్రభృతి వర్ణ్యతే' అను నియమముగూడఁ బాటింపఁబడినది.

ఇట్లే వసంతవర్ణనముగూడ-

....పికశ్రేణి 'కో'
యనుచుం గూసెను బంచమ స్వరమునన్ 'హా' యంచుఁ బాంధాళి మూర్ఛను మున్గన్; ద్రుమముల్ సుమాన్వితములై రాజిల్లె; రోలంబముల్ తనివారన్ మధుపానముల్ సలిపి మొత్తంబై విహారంబు చేసెను 'ఝంఝుమ్మ'ని గానముల్ సలుపుచున్ ....'కమనీయముగా సాగినది.

వేంకటేశ్వరుఁడు సఖీసమేతయగు పద్మావతీదేవికి గజరాజు వలని భీతిని బోఁగొట్టినప్పుడు వారికిఁ బరస్పరము జరిగిన సంభాషణము చమత్కారముగా సాగినది. చెరికత్తెలు మీదగు నామమేది? నిలయస్థానంబు తానెద్ది? యనియడగ, నతఁడు ఈక్షోణిన్ ననున్ వేయిపేర్లను బేర్కొందురు; మాఱుపేరులను బిల్వం జూచువారుంద్రు; నాకును వాసస్థల మిద్దియంచువేటు వాక్రుత్తున్? సమస్తంబునం-

దును నేనుందు'నని పలుకుట నిజభగవత్త్వమును వ్యంజింపఁజేయుచు వామనుఁడు బలిచక్రవర్తికిఁజెప్పిన సమాధానమును బోలి యతని వచఃప్రౌఢిఁ జాటుచున్నది

'సందేహము గల్గుచోటను మనంబే సత్ప్రమాణం బటంచును వాక్రుత్తురు పెద్దలు' - 'సతాంహి సన్దేహపదేషు వస్తుషు ప్రమాణమన్తఃకరణప్రవృత్తయః' అని కాళిదాసు దుష్యంతుని నోటం బలికించినమాట నీ కవి పద్మావతిచేఁబలికించుట సందర్భానుగుణముగా నున్నది.

యతులకుఁగాని, ప్రాసములకుఁగాని తడవుకొనునట్లు లేక యిందలి శయ్య. సమప్రదేశమున నెట్టి యొడుదొడుకులును లేకుండ సాగు నదీప్రవాహమువలె నిరాడంబరముగ సాగినది.

ఇంత సుందరముగా, ఎంతో ప్రయాసపడి తన చరిత్రమునే సంతరించి తనకే నివేదింపఁబూనిన యీ భక్తుని శ్రీ వేంకటేశ్వరస్వామి కటాక్షింపకుండుట వింతగా నున్నది, వింతయేమున్నది? భగవంతునిలీలలట్లేయుండును. ఏదోరీతిగా నా స్వామి కటాక్షింపఁబట్టియేకదా యీ రచన యిట్లు వెలుఁగుచూడఁగలుగుచున్నది? దేవుడు వరమిచ్చినను బూజరియీడనుట కిది మంచి తార్కాణము.

ఈ మాత్రముగా గటాక్షించుటతో నూరకుండక యీ కవిని పద్మావతీసహిత వేంకటేశ్వరస్వామి యిత్తోధికముగాగరుణించుగాక యని యా దేవుని బ్రార్థించుచున్నాను.

రాజమహేంద్రవరము, — జొన్నలగడ్డ మృత్యుంజయరావు

1-4-1989 - (శుక్ల ఉగాది)

ఉన్నమాట

శ్రీ బొత్సకవిగారు రాజమహేంద్రవరమునఁ బేరువడ్డ ప్రసిద్ధకవులలో నొకరు. కావ్యపఠనమే యీయన ప్రవృత్తి రాచనౌవ్యాసంగమే వృత్తి. ఇతని వేంకటేశ్వర మత్తేభమాలిక యసామాన్యమయినకృతి. ఇతివృత్తము నేకవృత్తమున నిర్వహించుట కష్టసాధ్యమయినపని. తెలుఁగుకావ్యము సహజముగా వివిధచ్ఛందో భేదములన పేక్షించును, ఏకవృత్తము నాశ్రయించి రచన చేయుట యేటికెదురీఁతవంటిది.

ఈయన జీవితలక్షణములలో మెచ్చఁదగిన సద్గుణము లున్నవి. ఆత్మస్తుతి, పరనింద, సన్మానములకై వెంపరలాడుట, మున్నగు కవిమాయల దుర్లక్షణములీయనలో మందునకైనఁ గానరావు. ఈ సాహిత్యజీవి నాదరించుచున్న రాజమహేంద్రవర పురప్రముఖుల సౌజన్యము సర్వథా ప్రశంసనీయము.

"ఉన్నమాటయన్నను లొకెక్కువగుఁగదా!" యన్న సూక్తి యితని పట్ల వర్తించదు ఇది యున్నమాట.

వంతరాం రామకృష్ణారావు
12-5-89
రాజమండ్రి

-: త్రయి :-

బేతవోలు రామబ్రహ్మం (సం)
తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పీఠాధిపతి
రాజమండ్రి, తే 23-6-1989

ఘనుడౌ వేంకట నాయకుండు విలసత్కారుణ్య ధారాధరా
ఘనుఁడీరీతిగ స్వీయవృత్తము వినన్గాంక్షించియే కాశరో
ల్బణమత్తేభగతి ప్రచారముగ మీ వాక్చాతురిం దీర్చెఁగా
దనుచో సాధ్యమటే? యిటీద్యముగఁబద్యశ్రేణి నిర్మించుటల్॥

జనముల్మెచఁగఁ బద్యగద్యములు విస్తారించి వెంకన్న గా
థను గావ్యంబుగ మూసలో నిడిన విద్వన్మూర్తులు న్నారుమి
మ్మును బోలెన్ విరచించినట్టి కవితా మూర్ధన్యులేరయ్య? ప్రా
గ్జని పున్నెంబులపంట మీకిదియు బొత్సశ్రీకవీ! ధీరవీ!
చివనాటన్ గురుఁడాది భట్టకవియాశీర్వాదమందింప నొ
య్యన విప్పారిన మీ కవిత్వనవకల్హారంబు నానాటఁ జి
క్కని సౌగంధ్యము సంతరించుకొని విఖ్యాతింబిపాశించి నేఁ
టను ధన్యంబయి నిల్చెవాయుజుని కంఠంబందు సింగారమై॥

...0...

-: నివేదనము :-

డా. జొన్నలగడ్డ మృత్యుంజయరావు
M. A. PHD
రాజమండ్రి తే 28-6-1989

స్వామీ! వేంకటనాయకా! భవదనల్ప ప్రాభవోదంతమున్
శ్రీమద్బొత్సకవీంద్రుఁడిట్టులసదృక్ సేవామతిం జెప్పి ని
ష్కామాధిక్కిన్ సుకవుల్ నుతింపఁగను మత్తేభంబు నెక్కించెనో
ఝూ మంగాపతి! వానికిం బ్రతిగ మత్తేభంబు లీనెంతువో

మామ ! ప్రేమము మీఱనీకు; ఘనసన్మానంబు, దీర్ఘాయువున్
క్షేమస్థైర్యయశంబులుం గలుగ నాశీర్వాదముంజేత యె
తేమోదంబుగ గ్రాసవాసములకింతే లోటు రాకుండగా
భూమిన్మన్నుటవాలు నద్దెపదివేల్ పుల్లాబ్జపత్రేక్షణా!

—0—

ఓమ్ అంజనేయాయ నమః

ప్రరోచన

రసజ్ఞులారా ! నాయీ "శ్రీ వేంకటేశ్వర మత్తేభమాలికాకృతి" ఒక మహామరి ప్రేరేపణమున జరిగినది. రసహృదయ ససూరిష్ఠులు శివశ్రీ బొమ్మన సుబ్బరాయ కవి మహోదయులు శ్రీవారి దర్శనమునకు నన్నుదీసికొని యేగుట. శ్రీస్వామివారి దర్శనానంతరము వారు శ్రీ వేంకటేశ్వరస్వామివారిపై నొక శతకము వ్రాయ ప్రోత్సహించుట జరిగినది. అప్పుడే ఒక పద్యము వ్రాయుట జరిగినది. అనంత రము మరల వ్రాయలేదు. వారు పదే పదే నన్ను హెచ్చరించుటచేత ఏ లాగో శ్రీవారిపై నూరుపద్యములు వ్రాసినాడను. వాటిని శ్రీ సుబ్బారావుగారికి విన్పింప సంతోషించినారు.

ఒకరోజు రాత్రి భాగమున ఆ పద్యములు చదువుతూ "యందేమి క్రొత్త దనముగలదు ? ఎందరో మహాకవులు శ్రీవారిపై వందలు, వేలు పద్యసుమాంజలు వ్రాసి యర్పింపలేదు. నా రచనలో విశిష్టతగలదా?" అను భావప్రేతణతో ఒక విలక్షణత సంతరించుకొనని క్షీపద్యముగాని, కావ్యముగాని పదుగుర నోళ్ళలోబడి నానదుగదా ! యని అలోచించి నిద్రించితిని.

ఆ మరునాడు శ్రీవారి మహిమతో నాలో నూత్నవికాస మేర్పడి యీ కృతికి శ్రీకారమూ చుట్టితిని అది 1950 సం. ఆత్మానందకవి శతవధాని శ్రీ ఉప్మాక నారా యణమూర్తి (ప్లీడరు పార్వతీపురం) గారు షట్కవిప్రణీత మాలికారామాయణ మున యుద్ధకాండము "న" కారప్రాస మత్తేభమాలికగా వ్రాసినారు. వారు నాచేత

ఎత్తిసాపు వ్రాయించినారు. దానిని అమూలాగ్రముగాచదివి యిటువంటి కావ్యము వ్రాయవలెనని మనసులో ఆనాడే నిర్ణయమైనది. నేటికీ రూపమున సిద్ధించినది కాబోలును.

సుమారు ఎనిమిది పురాణములలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యచరితము గలదు. అన్నిటినీ జదివి కథాక్రమమున నుంచి యీ మత్తేభమాలిక నా ఉపాసనా దేవత శ్రీ హనుమత్ప్రభువు శ్రీవారి చరిత్ర యిట్లు వ్రాయించినారు. ఒకరోజు కళాప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారికి వినిపింప ఎంతో సంతోషించి, నన్నాశీర్వదించి తే 30-8-1988దిని వారి అధ్యక్షతను శ్రీ గౌతమీ గ్రంథాలయములో ఒకకావ్యగానసభ నేర్పాటుచేసిరి. ఆ సభలో శ్రీ శాస్త్రిగారరపూర్వముగా క్రృతిని ప్రశంసించిరి. పెద్దలందరు అభినందించిరి. ముద్రణకు శ్రీ తిరుపతి దేవస్థానమువారినర్థించితిని. వారు దయచూపలేదు. శ్రీవారిదయ యిట్లున్నదని నిరుత్సాహపడక ముద్రణ ప్రారంభించితిని. శ్రీవారి కార్యమునకు లోటుండునా? శ్రీ బొమ్మన కృష్ణమూర్తిగారు, చి॥ బొమ్మన సత్యరాజకుమారుగారు పేవరు సమకూరిరి కవితాపోషకులు, దానవిశారదులు, పెద్దలు శ్రీ దాట్ల బలరామరాజమరాజ మహోదయులు, వారి కుమారులు, శ్రీ సత్యవోలు శేషగిరిరావుగారు, శ్రీ రాజమండ్రి గోదావరీ టింబర్ చాంబరాఫ్ కామర్సువారు మొదలగువారి ఆర్థిక సహాయము సంప్రాప్తించినది. ఈ విధముగా నీకృతి ముద్రణాకృతినందినది.

విద్వద్విమర్శకులూ నాపై ప్రత్యేకాభిమానముగల శివశ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ (ఆంధ్రయువతీ సంస్కృత కళాశాల పూర్వాధ్యక్షులు) గారు తమ అమూల్యాభిప్రాయముతో ఆశీర్వదించిరి. డా. శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు యమ్. ఏ. పిహెచ్‌డి గారు తమ గొప్ప అభిప్రాయము దయచేసిరి. ఒకప్రాంతములో జన్మించి, చిన్ననాటినుండి ఆప్తులగు వ్యాకరణశిరోమణి, వ్యాఖ్యాశమల్లినాథ శ్రీ వంతరాం రామకృష్ణారావుగారి దివ్యాభిప్రాయముగూడ నాకుత్సాహము గూర్చినది.

శ్రీ ధూళిపాళ విజయానందనాథులు ఆశీస్సులూ, ఆచార్య శ్రీ బేతవోలు రామబ్రహ్మముగారి "త్రయి

గ్రంథమునకు ఆర్థికసహాయముచేసిన తమ తమ అమూల్యాభిప్రాయము లందించి నన్ను ఆశీర్వాద ప్రోత్సాహము లొనరించినవారికి శ్రీవారు సర్వవిధముల రక్షణ కల్పింతురుగాక ! రాజమహేంద్రవరమున ముప్పదిరెండు వర్షములనుండి నన్నా దరించుచున్న కవితాపోషకులగు మహోదారులందరికి నా వందన చందనలందించి వీరందఱను శ్రీ వేంకటేశ్వరస్వామివారు రక్షింతురుగాక యని శ్రీవారిని వేడుకొను చున్నాను.

సర్వం శ్రీహనుమదర్పణమస్తు

శ్రీయుతులు కర్రి అప్పారెడ్డి
,, ఆకుల వీరభద్రరావు
,, చందన మోహనరావు
,, ముళ్ళపూడి రామావతారం
,, సత్యవోలు శేషగిరిరావు
,, బి. వి. యస్. శాస్త్రి
,, గాదేపల్లి కుక్కుటేశ్వరరావు
,, శిరిపురపు పరదేశి
,, చింతల గోపాలరావు
,, ఆమంచి రామచంద్రరావు
,, ఆమంచి ఆంజనేయులు
,, సముద్రము అర్జునుడు గార్లకు హనుమదాశీస్సులు కలుగుగాక !

రచయిత—

ది 28-6-89 బుధవారం సా. గం. 6లకు శ్రీ రాజమందిరం గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయములో ఈ కృతి ఆవిష్కరింపబడిన సందర్భమున తీయబడిన ఛాయాచిత్రము



సర్వశ్రీ ధూళిపాళ విజయానందనాథ, వై. సి. తిమ్మారెడ్డి (జైళ్ళ డి. ఐ. జి.), మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి రచయిత శాంతిశ్రీ బొత్సకవి, వి. నరసింహమూర్తి (సి. టి. ఒ) వి. రామకృష్ణారావు, పొన్నలగడ్డ మృత్యుంజయరావు. గాదేపల్లి కుక్కుటేశ్వరరావుగార్లు.

హారికి, సర్వమానస విహారికి, భూమిసుతావ్యధాపహా
హారికి, రావణోపవన హారికి, రాక్షసఘోరసంఘ సం
హారికి, దుష్టసంపదపహారికి, వానర రాడ్వనీఫలా
హారికి, దైత్యనాయక మహాపుర దుర్వనితాప్రహారికిన్.

శీలికి, యోగిమానసకుశేశయ శీతమయూఖ సత్ప్రభా
కేళికి, సత్కవిప్రణుత గీర్నిచయాంచిత దివ్యకావ్య సం
సాలికి, శౌర్య ధైర్యగుణపాళికి, నక్షకుమార రాక్షసో
న్మూలికి, సబ్ధిలంఘన వినూత్న మహత్తరశక్తి శాలికిన్.

న్యాయికి, భూమిజా హృదయనాథ నియంత్రిత దూతకృత్య సం
ధాయికి, రామనామ ఘనతా పరివర్ధిత భక్తిమార్గ ని
ర్మాయికి, యోగిరాజ ఘనమానస మండపమధ్యభాగ సం
స్థాయికి, నంజనా హృదయసారస సంతత సౌఖ్యదాయికిన్॥

క్షుంతకు, కావ్యకల్పన విశార సముద్భవ శబ్దభావదో
షాంతకు, సంగరాగత మహాసురసాయక దుష్టవాహినీ
హాంతకు, "బాత్ససత్కవి" మహోద్భుత వేంకటనాథ కావ్యరా
ణ్మంతకు, సర్వసద్గుణ సముంచిత భక్తచయానుగంతకున్॥

ఓమ్ ఆంజనేయాయనమః

ఇష్టదేవతా ప్రార్థనము

ప్రణుతింతున్ మదిగోష్పదీకృత మహావారాశి! నయ్యంజనా
వనితానందన వర్ధనున్ రిపుచమూప ప్రాణ శోషాహి! భూ
తనయా మానస తాపహారి రఘునాథాధీశ సద్భక్తు నిన్
హనుమంతున్ గుణవంతు వేంకట నగాధ్యక్షోరు చారిత్రమున్
ఘనమత్తేభ సువృత్త మాలికను వేడ్కం గూర్పగా నెంచు నా
పనియందుం గృతకృత్యుఁ జేయుటకునై పద్మావతీ దేవి న
న్నని సాకంగను గేలుమోడ్తు; నటుపై గౌరాంబికన్ వేడు నా
యనిఁ గొల్తున్ దలిదండ్రులన్ విమల భక్త్యావేశముం గాంచి; యా
హనుమంతుండె గలండ తండె యిది వ్రాయం జేయు నా చేత, నీ
పనిలో నేను నిమిత్త మాత్రుఁడను విద్వాంసుండనా? నేఁ బఠిం
చిన దేదీ? చదువేది? యైనను సరే శ్రీ వేంకటేశా! యదే
పనిగాఁ బట్టితి నేఁ గలంబును రచింపన్ నీ చరిత్రంబు నె
ల్లను; విన్పింప సభాస్థలంబులను నెల్లప్పున్; గడున్ భక్తితో
డను బారాయణ చేయ వత్సలత తోడన్ నీవె వ్రాయింతు వం
చును నేఁ బూనితిఁ గాక? సత్కవులకిచ్చో లోపమే? శ్రీనివా
సునిగా వెల్గులు నింపి భక్తుల మనస్సుల్ నిండియున్నట్టి వా
నిని నిన్నాత్మను నిల్పి వ్రాసెదను మన్నింపందగుం దప్పులన్;

శ్వేత వరాహావతారము

వినుమా నీదు కథాక్రమంబును శ్రవఃపేయంబుగాఁ దేల్పెదన్
జననం బందిరి దైత్యు లిద్దఱు మహాశ్చర్యంబుగాఁ గశ్యపుం
డను నవ్వానికి; వారిలోపల హిరణ్యాక్షుండు దుర్వారుఁడై
వనజాతాసన దివ్యదత్తవర గర్వంబొప్ప స్వర్గంబు మీఁ
దను దండెత్త సురౌఘముల్ భయముతో దాగంగ నంభోధికిం
జని తన్మధ్యమునన్ మెలంగుచును బెల్పొం జేరి యాదఃపతిన్
దనతోఁ బోరఁగ రమ్మటన్న నతఁడా దైత్యున్ విలోకించి యా
వనజాతాక్షుని తోడఁ బోరుమనఁగా వైకుంఠునిం గూర్చి తాఁ (25)
జనుచుండంగను దోఁచి నారదుఁడనెన్ "జక్రిం గనన్ గానన్
జనుమా యిప్డు రసాతలంబునకు భూచక్రంబు సంవర్త వే
ళను బాథోధి మునింగిపోవుటను లీలా సూకరాకారుఁడై
వనధిం గ్రుంకి రసాతలాంతరమునన్ వర్తిల్లుచున్నట్టి భూ
మిని బైకెత్తఁగ నేగ నిత్తఱిని లక్ష్మీజాని, వర్షర్తు మే
ఘ నినాదార్భటి ఘుర్ఘురించి మునిసంఘంబుల్ నుతింపన్ సటా
జనితోద్యద్విపులా నిలంబు లెసఁగన్ జంచద్గతిన్ సాగరం
బును జొచ్చెన్ దనదంష్ట్రపైని నిలిపెన్ భూచక్ర; మచ్చోటికిన్
జను" మన్నన్ దితిసూనుఁడేగె నటకున్ జంచద్గదా దండమున్
గొని "యోకి కిటి రూప! యాగుమురా! నీకు న్మూడె నీనాటికిన్
మన మానందరసాబ్ధి వీచికలలోనన్ దేల నిన్గూల్తు" నం
చును నాయాది వరాహరూపు నచటన్ శుంభద్గతిన్ దాఁకనా
తని దుంచెన్ హరి యెల్ల లోకములు మోదం బందఁగా దేవతల్

మునులున్, సన్నుతిఁజేయ దంష్ట్రికొనపైఁ బొల్పారు భూమండలం
బును బూర్వస్థితియందు నిల్పి వినతా పుత్రున్ మదిన్ సంస్మరిం
చిన నాతండరుదేరనిట్టులు వచించెన్ స్వామి యుత్సాహియై:

...o...

గరుడుఁడు వైకుంఠమునఁగల క్రీడాద్రిని భువిని నిల్పుట

"జనము ల్సేవయొనర్చునట్లుగ ధరాచక్రంబుపై వర్తిలన్
మనసయ్యెన్ దెలిదీవి కేగి కొనిరమ్మాయందుఁ గ్రీడాచలం
బును శ్రీనీళలతోడనన్న జలదంబుల్ తూల వైకుంఠ ప
ట్టణమున్ జండ జవంబుతో నరిగి వేడ్కన్ విష్ణు సందేశమున్
వినిపింపంగను వార లెంతయును సంప్రీతిన్ బయల్దేఱ, వా
రిని గ్రీడాద్రి యుతంబుగాఁగను ధరిత్రీసీమకుం దెచ్చి దిం
చెను భూ నీళలు రెండు పార్శ్వముల లక్ష్మీదేవి వక్షంబునన్
దనరన్ శ్వేత వరాహుఁడొప్పెనట భక్తశ్రేణి సేవింపఁగన్

...o...

గరుడుఁడు నిల్పిన క్రీడాద్రి గరుడాద్రి యగుట

వనజాతాక్షుని యాజ్ఞచే గరుడుఁడున్ వైకుంఠమందుండి తె
చ్చెను గ్రీడాద్రినిగాన దానికిని వచ్చెన్ బేరు లోకంబునన్
జను లెన్నన్ "గరుడాద్రి" యంచు; నటుపైఁ జర్చింప నక్కొండ కొ
ప్పెను నామాంతరముల్ స్మరింపఁదగు నా పేరుల్ కడున్ భక్తితో

...o...

గరుడాద్రికి గల నామములు

తనువున్ శ్రీస్త్రీల నోష్టాంగి భక్తులను నీథాత్రీ ధన్యంబిద్ది కా
వునఁజేసెఁదెను మున్ను "శ్రీగిరి" యనన్ బొల్చారు జ్ఞానంబు ని
చ్చును గానన్ దగ "జ్ఞాన శైల" మనఁగా శుద్ధంబులౌ తీర్థముల్
తనరన్ "తీర్థగిరీంద్ర-పుష్కరగిరీంద్ర" ఖ్యాతి నార్జించెఁ బ్రో
చెను మున్నా వృషభాసురుం గనుకఁగాంచెన్ బేరు విఖ్యాతమై
తనరంగా "వృషభాద్రి" యంచు నటుపైఁ దానొప్పె "స్వర్ణాద్రి" గాఁ
గను స్వర్ణాశ్రియమౌచు బూర్వమెప్పుడో తా నేదేవుఁడో కొండు పా
ల్చెను "నారాయణ" నామధేయుఁడిచటన్ జేసెన్ దపం బెంతో ని
ష్ఠను నారాయణు మెచ్చఁజేసె నిట్టులౌటన్ గాంచె నారాయణా
ఖ్యను, "వైకుంఠనగం" బనంగ దగె బుణ్యాత్ముల్ కడున్ నిల్చుటన్
కనకాక్షున్ బరిమార్చి యెంతయును వేడ్కన్ విష్ణుఁడిందుండుటన్
ఘనమౌ "శ్రీ నరసింహ నామమున" వెల్గంజాలె; నీ పర్వతం
బున "శ్రీ యంజన" ఘోరరీతిగ దపంబుం జేసి యద్దాననే
హనుమంతుంగన "నంజనాద్రి" యను విఖ్యాతాభిధానంబుగ
లైను; నీ కొండ వరాహమూర్తికిని బాళింగూర్చుటం జేసి యొ
ప్పెను నామంబది "శ్రీ వరాహగిరి" గా; విష్ణుండు శ్రీ లక్ష్మితో
డను నానందము నిర్యహార్యమ్మున గాఢప్రక్రియం గాంచ నొ
ప్పెను "నానందగిరీంద్ర" నామమున; శ్రీ విష్ణుండు క్రీడించుటన్
గని "క్రీడాచలనామ" మౌ గరుడుఁడు న్గల్యాణ మొప్పారఁ దె
చ్చెను గానన్ "గరుడాచలం" బనఁగ దాఁ జెల్లెంగ దాయున్నై; శే
షసిరూపంబున సుందరంబుగను నిచ్చో నుంట "శేషాద్రి" గాఁ (75)
దనరెన్; "వేంకటతీతినా" జనెడు నుత్పత్త్యర్థ మొప్పంగఁ దాఁ
గనిమెన్ "వేంకటశైలనామము" చెలంగన్ శోభనాకారతన్

గ్గణుతింపంబడె "శోభనాద్రి" యన; మోక్షంబిచ్చు భక్తాళికిన్
గనుకన్ గల్గెను "మోక్ష పర్వత" మనంగా బేరు; "గోవింద" యం
చును భక్తాళి నినాదముల్ సలుపు నీక్ష్మాశీధరం బెక్కు వే
ళను "గోవిందసమాఖ్య" గల్గుటకు మూలంబద్ది యే; కష్టపా
ట్లను బోగొట్టుచు దివ్యమంగళము తెల్లంగూర్చెడుంగాన దా
గనె నామంబును "దివ్యమంగళ మహాగ్రావంబనంగా భువిన్;

...o...

బ్రహ్మ నారదుని విష్ణునికటకు నంపుట

పనజాతాసను డొక్కనాడు మదిలో భావించి లోకస్థితిన్
గనివీణాధరుని నిట్లుగాననియె "నో కంజాక్ష భక్తా! ధరన్
మనుజుల్ గౌరవ దూరులై కడు నసన్మార్గంబు లంబట్టి వే
డ్కను దైవ ప్రతికూల వాదనల మూర్ఖత్వమ్ముతో గాల యా
పనలన్ జేయుచు హేతువాదులగుచున్ బ్రాల్మాలి జీవింత్రు, వా
రిని వారింప సమర్థులెవ్వరు? ధరిత్రిం గల్గు నీ మానవుల్
పెను దుష్కర్మల భూమిదేవికిని వేర్వేరాబ్ధలం గోర్తు రెం
దును, గానంగను విష్ణుడొక్కడె సమర్థుండౌనుగావంగ గ
న్నన వైకుంఠపురంబునన్ హరిని సందర్శించి మర్త్యావళిన్
మనుపంగా నవతారమెత్తుమని సంప్రార్థింపుమా" యన్న ని
ట్లనియెన్ నారదమౌని మానసములో హర్షించి యా బ్రహ్మతో
"జనకా! యిప్పుడె వేడ్కతోడ భవదాజ్ఞన్ దీర్ప వైకుంఠ ద
ర్శనమున్ జేయంగ నేగుదున్ భువన నిర్మాణంబు గావించు నీ
కును, లోకావన కృత్య మిత్తఱిని వైకుంఠుండు గావింపనౌ
ననుచుం దోంచుట సాజమే యగుంగదా" యంచున్ బ్రశంసించుచున్

మునియా బ్రహ్మ యనుజ్ఞఁ బొంది మహతిన్ మోయించుచున్ విష్ణు కీ
ర్తనలం బాడుచు నేగియేగి వెస శ్వేత ద్వీపమున్ క్షీరవా
ర్ధిని వీక్షించి సదభ్ర విభ్రమ కళా శ్రీకంబు, లోకైకపా
వనమా దానిని, కల్పవృక్షకుసుమ శోభారమ్యమా దానినిన్,
దనరంగా వన మధ్యభాగమున నుద్యద్దివ్యధామంబునన్
మనమానంద రసాబ్ధి వీచికల లోనన్దేలుచున్ శాతకుం
భ, నిభంబౌచు వెలుంగు దాని నట శుంభద్దివ్యమా నోలగం
బున శోభామయ కోటి భాస్కరరుచుల్ పుష్పించి యాకాంతులె
ల్లను ముల్లోకములందు వెల్గులయి వెల్గన్ సిద్ధ గంధర్వ చా
రణ విద్యాధరు లప్సరోగణము భారద్వాజ ముఖ్యుల్, సనం
దనుఁడున్ బక్కలఁగొల్వ నాయుధములుద్యత్ప్రీతిఁ గాఁన్ ఘనా
ఘనసంకాశవినీల దేహుఁడయి శ్రీకాంతాదులత్యంత భ
క్తిని గొల్వన్ వనమాలసౌరభము వ్యాప్తింగాంచ నుద్యద్రుచిన్
గొనఁబా కౌస్తుభరత్నకాంతితతి వక్షోభూమి దీపింపన
వ్వనజాక్షుండు తటిల్లతాంచితనవాభంబట్లు పీతాంబరం
బున నొప్పారఁగఁ గాంచి భక్తినిగరంబుల్ మోడ్చి కీర్తించె "నో
వనజాతాసన వాసవాది సురసేవాభాజ నాంఘ్రిద్వయా!
వనజాక్షా! హరి! ఖండితాసురచయా! వైకుంఠ! పద్మాప్రియా!!
ప్రణవాకార! ఖగేంద్రపత్రి! పరమ బ్రహ్మస్వరూపా! జగ
జ్జనసంరక్షణదక్ష! శేషశయనా! చక్రీ! నమో" స్తంచు న
మ్ముని; వాత్సల్యముతోడ నిట్లనియె నంభోజాక్షుఁ "డో నారదా!
యనయంబున్ బదునాల్గులోకములలో నభ్యంతరంబించు కై
వను లేకుండఁ జరింతు నీవు భగవన్నామంబు కీర్తించుచున్
సునసంగీత రసామృతోక్తులను గాంక్షల్లేవు నీ కేవియున్
మనమందెప్పుడు మామకీనగుణసంపత్కీర్తనల్ చేయు వా

రిని, న్నాకై తమ సర్వమిచ్చి మనువారిన్. నన్ను నేవేళ వ
గ్గన గావించెడు వారినిన్, నిరతమున్ రక్షింతు; సాయుజ్య మి
త్తును; నీమోహమునుగాంచ లోకపు విపత్తున్ దెల్పఁగా వచ్చినా 125
వనిపించున్, పినిపింపు" మన్న ముని దేవా! కల్గునే నీ వెఱుం
గని కార్యంబు! నెఱుంగనట్లుగ వినంగా నెంచితు నా నోట న
న్నును ధన్యాత్ముని జేయఁగా; నిలువ కెందున్ సంచరింపన్ బ్రయో
జనముం గూర్చిన నీకు మానక నమస్కారంబుఁగావించెదన్
నిను దర్శింపఁగ బ్రహ్మయాజ్ఞ నిటకున్ నేవచ్చితిన్ నేఁడిటన్
వినిపింతున్ దివినుండి నీవు వినఁగా వృత్తాంతమున్ సర్వమున్

...o...

త్రిమూర్తుల భృగుమహర్షి పరీక్షచేయుట

మునులెల్ల న్మునిముఖ్యు, వృద్ధుని, దయాపూర్ణున్, భృగున్ జ్ఞాన వం
తుని, ధీరున్,మహిమాన్వితున్ సుగుణు శాంతున్ జేరి "నీవేగి చ
య్యన ముమ్మూర్తులలో నెవండుకడు సత్వాఢ్యుండో కన్గొంచు ర"
మ్మనిపంపన్ భృగుమౌని యందులకు దానంగీకృతిం జేసి వే
చని, వాణీపతిఁ జేరి తన్నునతనిన్ సత్త్వమ్మెఁజూడంగఁద
న్నినఁ గోపంబును బూనెనా భృగువుపై; నిండారు క్రోధంబు దా
ల్చిన యా బ్రహ్మకు శాపమిచ్చె భృగుఁడిట్లీ! నీవు పూజాదులం
గనకుండన్మను మికమీఁదటను నీగర్వంబు సర్వంబు గం
టిని నీవెన్నరజోగుణాఢ్యుఁడవు పో నీతే" యటంచున్ శివుం
గనఁగైలాసము చేరి తన్నిన భృగున్ గామారి ఫాలాంబకా
గ్నిని గాల్పన్ సమకట్ట శాంకరియు మాన్పి దాచె "లింగాకృతిన్"
గనుమంచున్ శపియించి యత్తఱిని శ్రీకంఠున్ తమోన్వితుఁగాఁ

గను గుర్తించి నినుంగనుంగొనెదు వేడ్కన్ వచ్చి లక్ష్మీయుతున్
నినువక్షంబునఁ దన్న నెప్పటివలెన్ నిర్ణిద్రమా శాంతితోఁ
డను "శ్రీమానివరా! యెఱుంగకిటులన్డాయంగ సుస్వాగతం
బున నర్ఘ్యాదివిధా విశేషములనేఁ బూజింపఁగా నైతిఁద
ప్పును మన్నింపుము నీపవిత్రచరణంబు ల్దాఁకినన్ నొచ్చెనో!
యనఘా! తన్నితివింత ప్రేమగను నాహా! నీదుపాదద్వయం
బును నేనొత్తఁగ మెత్తమెత్తగను నీవుందప్పు సైరింపుమా!" 150
యని పాదద్వయిఁబట్టి నాభృగువు సాష్టాంగంబు గావించి కీ
ర్తనలంజేసి నుతించి యిట్లనియె "శౌరా! నిన్ బరీక్షించి చూ
చిన నాతప్పిదమున్ సహించి కరుణాశ్రీయుక్త మా ప్రేమఁ జూ
చినఁ జాలున్ బహుసత్వయోగ మహిమన్ శ్రీగల్గెనీయందె" యం
చును బోయెన్ గద! పోయి యామునుల నవ్వోఁ జూచి యిట్లాడె "నో
మునిచూడామణులార! శ్రీహరియె నమ్మోందెంతో సత్వాఢ్యుఁడై
మొనయున్ లోకములందు దైవతములంబూజార్హుఁడై వెల్గువాఁ
డును, సర్వాత్మలనుండువాఁడును, ఘనుండున్నాఁటిలేఁటి వాఁ
డును, శుద్ధాత్ముఁడు, సర్వరక్షణపరుండున్, విష్ణుఁడేయంచు' మే
ఘ నినాదార్భటిఁ జాటె; సర్వముని సంఘంబుల్ ప్రశంసించె న
మ్మునిని "యాగంబులు చేయఁగావలయు నంభోజాక్షునింగూర్చి యో
గ నిరూఢింజనునాతఁడే, యతఁడెలోకత్రాతముంగావ నెం
చునటంచున్ దమలోననాడుచు హవిస్సుల్ గూర్చుచున్ "మాధవా
య! నమో" యంచు మునీంద్రులెల్లరు భవద్ధ్యానంబె కావింతు రీ
మనుజుల్ నిక్కముగా నశక్తులు భవన్మాహాత్మ్యమూహింపఁగన్;
జనులందారసి చూడఁబామరులెఁగా సంఖ్యాధికుల్; వారికిన్
ఘనభక్తి ప్రతిపత్తి కల్గిగరిమన్ గల్యాణము ల్గాంచఁగా
వినుతంబౌనొక దైవరూపమునఁ గన్వింద్రానటుల్ గొండ మీఁ

దను నీవే వెలయంగ నీపనియ యుక్తంబంచు విజ్ఞాపనం
బును గావింపగ బ్రహ్మదేవుడు ననుం బుత్తెంచె నీరీతి మా
మనవిం గైకొని మమ్ము నేలగల శుంభద్దివ్య కల్యాణ మూ
ర్తిని నిల్పంగదె సర్వమానవులు భక్తిన్ముక్తి ప్రాపింపగా
నిను గొల్వందమ జన్మపాపములు కుంటీ భూతముల్గాగ జ
క్కని మార్గంబును జూపుమయ్య! సగుణాకారంబుతో నిల్చి భ
క్త, నికాయాభిమతార్థదాయి వగుమా ధన్యాత్మ" యంచాడగా;
"వినుమా నారద! మీ యభీష్టమును వేవేదీర్తు! సత్కీర్తిగాం
చిన దౌ నా 'వృషభాద్రి' నిల్చెదను లక్ష్మింగూడి క్రీడాద్రిగా
జను; నా పర్వతమందు సిద్ధులు, తపశ్శాలుల్, మనసన్ ఖ్యాతిగాం
చును; నా కేళిమహీధ్ర మీ ధరిణిలో శోభాకళారీతి గ్రా
లును, నందున్ వృషభాసురుండు తపమున్ శ్లోకమ్ముగా ఘోరరీ
తిని శీతాతప వర్షపాతముల కెంతే జిక్కకుండన్; దమో
గుణ పూర్ణాత్ముల మానసంబు లెపుడున్ క్రోధ ప్రధానంబులౌ
మనుజు లన్దుర్గుణ దుర్గుణంబులను నేమాత్రంబు వీడంగ జా
లని వారల్, సురవైరి స్నానజపముల్ రంజిల్ల ముప్వేళలం
దును; నా తుంబురు తీర్థమందు హరినెంతో యాత్మ సంధించి తా

...o...

శ్రీహరి నారదునకు దెల్పినవృషభాచల మహిమ

లని భక్తిన్ నరసింహశైలమున సాలగ్రామమందెంతయున్
దన యంగుష్ఠము నేలమోపి యనవద్య ప్రక్రియన్ ఘోరవీ
ర, నితాంతాద్భుత మాతపంబును నొనర్పన్ నారసింహుండటన్
తనకుం దోపక యుండుటంగనిసి హస్తన్యస్త ఖడ్గంబుతో

దనకతంబును ద్రుంచివైచియిడు తాత్పర్యంబు సంధిల్ల నా
తనికిన్ శీర్షము మొల్చి ప్రాణములు నంతన్ వచ్చునానాటికిన్
ఘనుడౌ శ్రీ నరసింహదేవుని కృపా కల్యాణ కారుణ్య ర
క్షను; నాహా! శిరమే నివేదనగ నే కల్పంబులో నైన జే
సిన వారుండిరె? నీతడొక్కడె గదా శ్రీ నారసింహున్ శిరం
బును దా ద్రుంచి సమర్చనల్ జరుపు నబ్బోయంచు మౌనీంద్రులున్
మనమందుందలపోసి రాక్షసు ననామాన్య ప్రభాశక్తి లీ
లను గీర్తింతురు; నారసింహుడట సాలగ్రామ శైలంబునన్
దన భక్తాగ్రణికిన్ వరంబునిడ ప్రత్యక్షంబు గాగా నె, మో
డ్పును హస్తంబులు, ప్రీతి దన్మయతతో జేజేలు నర్పింపగా
దనుజుం, డంతట నారసింహుడును "మోదంబొప్పగా" కో
ర్కెను దీర్పంగలవాడ" నన్న నతడున్ బ్రీతిన్ మదింబొం యిడి
ట్లనె "నీతో రణమాచరించుటయె నాదౌ వాంఛితంబింక నీ
ఘన చక్రాగ్ర మదంబుగొందుజామి నిర్గారింతు బోబోకుము"
నన్న, నృసింహుడును చక్రధార శిరము ఖండించగా నంతలో
దనుజాధీశుడు శీర్షమున్ మొలవ నాతండప్డు శీర్షంబుతోన్
పెనుపూజల్ పొనరింప శ్రీహరియు నావింతంగ నెన్ 'నీచుడా!
ఘనదుర్వార తపంబుచేసి పిదప న్నగ్గొంటె పీరీతి న
న్నను నాతోరణముంబొనర్ప మదియందుం గోర నౌచిత్యమై
చనునే?" యంచన దానవుండనియె "నీచక్రాహతింగూలి యే
సనకాద్యుత్తమ మౌను లుంగనని శస్త్రంబైన సుస్థానమున్
గనఁగా నిశ్చయించి నాడ జలజాక్షా! యీ శరీరంబు ని
ల్చునె? మృత్యూగ్ర కరాళ దంష్ట్రలకు నెట్లు న్జిక్క యేరీతి నై
నను పోవునన్, నిను నైరమూన క్షణమైన న్నిల్వ నీకుండ నీ
ఘనచక్రాహతి నాదు శీర్షమును వేగం ద్రుంతు వంచించినా

డను భోగేచ్ఛయొకింత లేదు విడనాడంగంటి దేహభ్రమన్,
గన వాంఛింతు వరంబు నీవలన నొక్కండేను, నా పేరు మీ
ద, నగంబియ్యది యింక బిల్వబడు చందంబీవు చేయంగదే”!
యన “నట్లే” యని నారసింహుడును దైత్యాధీశు జక్రాహతిన్
దునిమెన్ శీర్షము; వానికి న్మరల నుద్ఘాతంబు మహానట్లుగా
దనుజాధీశ్వరు తేజ ముంగలిసె నంతన్నార సింహున్, నగం
బును ప్రఖ్యాతిగనెన్ “వృషాద్రి” గను నీభూమండలి న్నారదా;

...o...

నారాయణాద్రి

ఘననారాయణ నామధేయుడు హరిన్ గల్పించి సన్మాన సం 225
బున నిష్ఠన్ బరిపూర్ణ భక్తిని తపంబున్జేయగా ఘోరరీ
తిని నాతాపసి యోగ జన్యమగు శక్తింగాంచె దత్ప్రాంత జం
తు, నికాయంబులు జాతి వైరముల నన్యోన్యంబు వర్జింప; నే
న్గను సింహంబు, లులాయమున్ హాయమునుండున్ మైత్రితో; మూషికం
బును బోషించు బిడాల కాక నిచయంబుల్; వ్యాఘ్రిపాలీయజా
చును ప్రేమంబున లేడి పిల్లలకు; నెచ్చో జూచినన్ వింతగా;
ఘనుడామౌని దపంబు మెచ్చి హరిసాక్షాత్కారమై కోర్కె యే
మన? “నారాయణుడప్డు కేల్మొగిచి ‘దేవా! మౌని సంపూజితా!
విను నాపై దయగల్గెనేని వరమున్ వేయిమ్మ యీధాత్రినెం
దును నీ కొండకు సాటిలేనిగతి నిందున్ జేసినాడం దపం
బును నీచే వరమద్ది పొందుటకు నంభోజాక్ష! నాకీ వరం
బును నీ విచ్చినజాలు నీనగము పెంపుంగాంచు;నీవీయనే
ర?! దేమున్నది? స్వామి పుష్కరిణి తీరంబందు శేషుండు; వా

హనమై శ్రీ ఖగరాజు; లక్ష్మి ప్రియురాలై సేవగావింప నీ
ఘన శైలంబున నిల్చి మానవులకున్ గల్యాణము ల్గూర్చి పా
వనమౌ జీవనమిమ్ము; యీగిరియు నొప్పన్నాదు నామంబుతో
డను నాశీర్వచనంబు నీయగదె వేడ్కన్ దేవరా!" యన్న నే
నును హర్షించి "తథాఽస్తు" టంచు వరమెంతో ప్రీతితో నిచ్చినా
డను; నారాయణ పేర నీగిరికి నాటంగోలె ప్రఖ్యాతి గ
ల్గెను; దీనింగను మాత్ర మానవులు ముక్తింగాంచుటే కాదు పా
వనమౌ జీవనమందు చిందురును దివ్య ప్రాభవాధిక్యముం
దనరన్ "క్షైరవు" డన్న వాడు మఱియేతత్ క్షేత్రపాలుండుగా
వినుతింగాంచెను: "గాం" యీగిరిని సంప్రీతిన్ దపంబున్ బొన
ర్చెనుమున్; "దుర్గ" యటన్న నామమున నా శ్రీకంఠు దేహార్ధమున్
గొనియెన్; బద్మపురాణమందునిది వాక్రుచ్చన్బడెన్ వ్యాసుచే; 250
గనియెన్ ద్వాపరమందు నామమిదియున్ "గల్యాణ శేషాద్రి" నాన్

—o—

అంజనాద్రి కథ నారాయణుడు దెల్పుట

వినుమా నారద! "యంజనాద్రి" యనగా బేరయ్యె త్రేతాయుగం
బున మున్ "కేసరి" యన్న రక్కసుడు లోకవ్రాతము ల్మెచ్చఁజే
సెను దా దివ్యతపంబు వానియెదుటన్ శ్రీకంఠుఁడుం దోచి "యో
యనఘా! కోరుమటన్న దాపసియు నాహ్లాదంబుతో నిట్లనెన్
"తనయుంగూర్చుముమేశనా ’ కనగ "లేదయ్యా! యీజనిన్నీకు నే
దనయున్ గూర్చెద నీవునాపై వలనన్ ధన్యాత్మ మాన్యాత్ముగా
వినుతింగాంతువు; వీరవిక్రమ కళా విశ్వోన్నతింగాంచు నీ
తనయా రత్నము కన్నబిడ్డ! వినుమా ధాత్రీ స్థలిన్ వ్రాల్గు,, నం

చును నంతర్హితుడయ్యె శంకరుడు నచ్చో!; నాతడట్లే కనెన్
దనయన్నూతనయౌవనంబుగను కాంతారత్నమా దాని "నం
జన" యన్పేర నెసందు దాని గని కాంక్షించెంది యా కేసరిన్
ఘనుడా వానరరాజు కేసరియు వేడ్కం జేరి యర్థించె "నీ
తనయా రత్నము నాకు నిమ్మనుచు"; సద్భావంబుతో నిచ్చెనా
తనికిం గేసరి పుత్రినంజనను; చేతఃప్రీతి కిష్కింధకు
న్జనెనా కేసరి యంజనావనితతో సంతోషమేపార, సా
ర, నయోపేతుడు వానరేశ్వరుడు నారామామణింగూడి కీ
ర్తినిగాంచెన్; మఱికొంతకాల మరుగన్ ప్రీతిన్ సుతాలబ్ధమిన్
మనియెన్జింతను; కోర్కె దీర్చుకొన నమ్యగ్భక్తితో "శ్రీ మతం
గుని" మౌనిం దరిసించి 'యాంజనకు చేకూర్చంగదే పుత్రు, నా
కును, లోకంబున కైనవాని నొకనిన్ గూర్చుమదయా సాగరా!"
యని సాష్టాంగ నమస్కలం దనుపఁగా; నామౌని యిట్లాడె "ని
ష్ఠను" నీవా వృషభాద్రి వాయువుభజించగల్గు సంతాన" మం
చును; మౌనీంద్రుని మాట నంజనయు నవ్వో ఘోరమౌరీతి జే
సెనునాత్యున్నతి దివ్యమౌతపము: మెచ్చెన్మౌని "శ్రీవాయుదే 275
వుని చేతంగనుమమ్మ పుత్రు"నను చున్ బొల్పార నాశీస్సు లి
చ్చెను నామౌనియు; రోజుకొక్క ఫలమిచ్చెన్ మౌనియాకాంతకున్
మనగాదాపసవృత్తి "దత్ఫలములన్సంధించె; శ్రీవాయు దే
వుని వీర్యంబును దాదృశంబులు ఫలంబుల్ ప్రీతి భక్షించి యం
జన గర్భంబు ధరించె శాంతిమెయి: నుత్సాహ ప్రభాబుద్ధి 'చే
తనముల్వీర్య బలంబుగల్గు తనయుందద్వాయు వీర్యంబున
న్గనెనయ్యంజన 'యాంజనేయుఁడతడే ఉమ్మపుత్రికన్ లంకలో

గనియెన్, గోష్పదమట్లు సాగరము దూకింగల్గి యాదైత్యులన్
జెనకంజాలని శక్తిజూపెను చిరంజీవిత్వమున్గాంచె; 'నం
జన" పేర మఱి 'యంజనాద్రి'' యని యాశైలంబు పిల్వంబడెన్;

...o...

శేషాద్రి

అనఘా! ద్వాపరవేళ మేరుగిరి క్రీడార్థంబు స్వీయాత్మజం
బనుపం గోరికపుట్టి శేషునకు జెప్పన్; శేషుడున్ వానినాం
ఛను దీర్పంగను సమ్మతించి, తన శీర్ష శ్రేణిపై మేరునం
దనుఁ గూర్చుండగ బెట్టి, యెంతయును మోదంబారగా ద్రిప్పి 'యం
జనశైలంబు' వృషాద్రియున్న యెడనంచద్రీతితో నిల్పెటన్
గనె 'శేషాద్రి' యటన్న నామమిటులాతన్మహీభృత్తునిక్కంబుగా;
విను మీ యద్రి సరస్సులందు సుమముల్ విప్పారి నేత్రోత్సవం
బును గావించు; వనాంతరంబున 'గుజంబుల్ పండ్లనొప్పారు; వి
చ్చినమల్లెల్, మఱి మొల్లలున్, దిలకముల్, చేమంతులున్, బొన్నలున్,
సనజాజుల్, మొదలైన పుష్పములవౌ సౌగంధ్యముల్ గ్రోలఁగా:
ననిలంబుల్ విహరింపుచుండు నచటన్; న్యగ్రోధ, మాలూరముల్,
పన,సోదుంబర పారిభద్ర, తినిశ, ప్లక్షామ్ర ముఖ్యంబులౌ
ఘనవృక్షంబులుఁ గ్రాలుచుండును, శిఖాగ్రంబుల్ నభోవీధియె
ల్ల నిరోధింపగ, శాఖలందు నను గూండ్లంగట్టి నానాశకుం
త, నికాయంబు వసింప; వానివగు కూతల్ వేదవన్నాయిగా
వినిపించున్ భళి బ్రహ్మచారులచటన్ వేదావళిన్ గానమున్
బొనరింపం ధ్వనిపించు, శబ్దములనన్; బొల్పార నాశబ్దముల్
విని మేల్గాంచు సమస్త పక్షి తతులున్; వేగన్ గురంగాది జం

తు, నికాయంబులు నిద్రలేచి వనమందున్ స్వేచ్ఛగా సంచరిం
చును, వృక్షంబులనుండి రాలు ఫలరాజుల్ మూటగాఁగట్టి కొం
చును బాంధావళి దారిబత్తెములటంచున్ గొంచు బోవున్వడిన్;
ఘనశైలేంద్రము! దివ్యశృంగముల నెక్కంజాలు వారల్ తగన్
వనటల్వాసి నికుంజపుంజయుచులన్ భాస్వత్ఫలోపేత భూ
జ, నికాయంబులఁ గూండ్లు గట్టుకొనినిచ్చల్ వాసముం జేయుచుం
డు ననేకాద్భుత పక్షిజాతులను గన్గోవచ్చు; దత్పక్షి సం
ఘు, నినాదంబులు శ్రావ్యమై యెసఁగ నాకర్ణింపగా వచ్చు; గం
గను బోలంగలదా "సువర్ణముఖి"యన్ ఖ్యాతింమహిం దాల్చు పా
వనమౌ వాహిని క్రోసు దూరమునదాబాలున్ వడిన్, బ్రహ్మనం
దన! విన్నాడవె! యోగిరీంద్రపు "బవిత్రంబైన వృత్తాంత మం"
చును విష్ణుండు విరించి పుత్రుననిచెన్. స్తోత్రావళిం జేసి పో
యెను శ్రీనారదమౌనియున్మహతిలో నీపర్వతోదంతమం
తను బల్కించుచు, మూడు లోకములలో నన్నాట దద్వృత్తమున్

...o...

శ్రీలక్ష్మీ నారాయణులు మాయ వేషముల భూమికి వచ్చుట

ప్రణుతాత్యంత విలాస మొప్పఁగను శ్రీరామామణింగూడి వ
చ్చెను నారాయణుఁడీ ధరిత్రికి మహర్షి వ్రాతముల్ చేయు యా
గ, నికాయంబులఁగాంచ, శైలశిఖరాగ్రంబందు నిల్వంగ, న
వ్యవనజాక్షుండు కటాక్షవీక్షణములన్ బద్మాముఖాంభోజమున్
గనుచున్ మేళములాడుచున్, నగుచు, వేడ్కన్సాగి యానందమం
దినడెందంబున నొప్పి లక్ష్మిఁగని"యింతీ! గాంచినావే! యిదే
మునులాత్మీయ తపోమహాత్మ్యగతులన్ బూర్ణంబుగా నీగిరిం
ద్రునిపై యజ్ఞము లాచరించెదరు సంతుష్టాత్ములై ధైర్యవ 325

ర్తనుతై! నాథులు తోడురాగ తమ కార్యంబుల్ ఫలింపంద ప్రీ
తిని లోకత్రయ వాసులెల్లరును శాంతిన్ జీవయాత్రల్ పొన
ర్పను' సర్వస్వము నాకె యర్పణముగా వర్తింతు;రి మానులం
దును స్వార్థంబను మాటలేదు గను మిందున్నాతి! యాయజ్ఞశా
లను! నాసిద్ధసదస్యశాల! కనుమా మాలన్ వహ్నిశాలన్; రమా
వనజాక్షీ! కనుమల్ల జేకరము దివ్యంబై వి రాజిల్లునా
వెనుకన్ శ్రీయజమానుశాల; యదె ఋత్విగ్బృంద శాలాచయం
బును, 'బత్నీజనశాల లల్లవియె యో ఫుల్లాంబు జాతాక్షి! నీ
వును నేరున్ మనుజాకృతుల్ గాని యటుంబోవంగ వాంఛింతు", న
న్నను లక్ష్మీపతి మానవాంగనగనైనన్: విష్ణువుం దాను నెం
టనె సామాన్యమనుష్య రూపముగొనె న్భావింపఁగా నీలమే
ఘ, నిభంబై తనువున్ సితాంబురుహ సంకాశంబు లారమ్యలో
చనముల్ నూతన మందహాస రుచి రాస్యం బల్ల బాలాబ్జ రే
ఖను నిర్మించెను ఫాల భాగమును, భృంగవ్రాత ముంగేరు రీ
తిని నల్లందన మొప్పు కేశములు; ప్రీతింగంబు కంఠంబు, శ్రీ
లను మించంగల కర్ణయుగ్మము, విశాలంబైన వక్షంబునున్
దనరెన్, లక్ష్మియు మందహాసముఖ సౌందర్యంబుతోఁ బట్టు చే
లను, బంగారపు పూలతోడ బగడాలం గూర్చు హైకం ధరిం
చెను, మధ్యంబసియాడ మేఖల కటీసీమన్ ప్రకాశింపగా
గనులంగాటుక, ఫాలభాగము పయిన్ గస్తూరి బొట్టొప్పగా,
గనకచ్ఛాయను మీఱు దేహరుచితో, గాదంబినిం బోలు న
ల్లని వేణీ భర మంచితంబుగను ప్రేలన్, గుండల ద్వంద్వము
ల్లన వీనుంగవ సంచలింపఁగ గపోలంబుల్ గనత్కాంతి ద
ర్పణముంబోలెనెసంగ, నందియలు శబ్దంబుల్ దువాళింప; నొ
ప్పెను; నాదంపతులిట్లు వచ్చుటయు సంవీక్షించె మానీంద్రు లె

ల్లను సుస్వాగత మిచ్చి ప్రీతియును సల్లాపించి రీరీతిగన్
"ఘనయాగంబులు సర్వము న్వెలుఁగ నీకాంతామణింగూడినే
ర్పునఁ గాపాడగ వచ్చు దాశరథిగా రూపంబు గాన్పించు మీా
రు, నిజంబెవ్వరో శ్రోత్రపేయముగ వాక్రుచ్చుం"డనన్ బల్కెఁని
ట్లని "మాతాపితృహీనుడన్, నెలవు నాకంచొక్క చోటెద్దియున్
వినిపింపంగను లేదు విశ్వమునఁ గావింతున్ జగద్రక్షణన్
ననుఁ జూడంగలవారు తక్కువ, హరిన్నారూపు నిట్లుంచు నే
మని విన్పింతును? వేయిపేర్లనను నాహా! పిల్చు లోకమ్ము; తే
నును సంచారము చేయువత్తు భువిలో నూల్కొన్న మోదంబునన్
వినుఁడీవింతను మీారు; కాంతయిదినన్ వెంటాడు మీాయాగమున్
గననే తెంచితి" మన్న మానులును యజ్ఞంబున్ దగన్ పూర్తిచే
సిన దద్భక్తికి మెచ్చి వారియెదుటన్ శ్రీవత్స వక్షంబుతో
ఘనచక్రాయుధ శంఖ శార్ఙ్గగదలున్ గ్రాలంగ హస్తంబులన్
గను పట్టెన్ హరి మానుషాకృతిని; వేగన్ లక్ష్మియై మానవాం
గనయున్ తోడనెతోఁచె వారిరువురన్ గన్గొంచు మోదంబుతో
ముని సంఘంబున "నతుల్, నుతుల్ సలుప నంభోజాక్షుఁడిత్తున్ వరం
బును వేఁడు"డన వేంకటాచలముపై బూర్ణావతారంబుగాఁ
గను, నిల్వంగ వరంబుగోర "నటులే గాకం"చు నారాయణుం
డును లక్ష్మి సహితంబుగా వెలసె నందు న్వేంకటేశుం డుగా;

...o...

వృద్ధభూసురుని శ్రీనివాసుఁ డనుగ్రహించుట

మును శ్రీవేంకట భూధరాగ్రవనిలో భూమీాసురుండొక్క డుం
డెను, శాస్త్రోచిత సర్వకర్మముల నెంతే ప్రీతి గావించు చుం

డెను, "గోవిందు"డనంగ బుత్రుఁ డొకఁడుండెన్ వాఁడెటో యేగఁ బు
త్రుని మోహంబున 'నాయనా! పుడమియందు న్పుత్రులం గాంచువా
రని నగ్గింతు; రపుత్రకుల్ నరక వారింగూలు వారంచు విం
చును శాస్త్రంబులు, లేకలేక నిను నీశుండీయఁగాఁ గాంచ; నీ
వును నాయట్లె గృహస్థధర్మమున సత్పుత్రుం దగం గాంచి యీ
మన వంశోచిత శాస్త్రధర్మగురు సమ్మాన్యార్హ కార్యంబులన్
గనుదంచున్ మనమందు నెంచితిని; నిర్ఘానంగ లేనైతి దం
డ్రిసి, వృద్ధుండను, నిన్నుఁగన్గొనఁగ నీరీతిన్ సుపుత్రా! లభిం
చునె? నీ తల్లియు నిన్నుఁ జూచుకొని మెచ్చున్, మాకు నీరీతి భ్రాం
తిని గల్పించితి, వెందుబోయితివో? మాదిక్కెవరో? యీగిరిం
ద్రుని నిందున్న వనౌకసుల్ వినఁగ, నిందుంగల్గు భూతమ్ములన్
దనయా! నిన్గని నారలేమొయని చిత్తభ్రాంతితో నడ్గినాఁ
డను, నొక్కండును మాకు పల్కరిట గట్టా! నేను జీవింప" నం
చును నావిప్రుఁడు పుత్రమోహమున నచ్చో వేంకటాద్రిన్, వనం
బున గాలించుచు, దారి తప్పుచును, నాభూమీసురుండేడ్చుచున్
మనమందెంచుచు వేంకటేశ్వరు లసన్మాహాత్మ్యమున్, పుత్రమో
హా, నిబద్ధాత్ముల చిత్తుడౌచుఁ దిరిగెన్ హా! యంచు మోహోనఁద్రెం
చ నసున్బాశము తెన్నియైన, మరి వాత్సల్యార్తవహ్నా తండ్రి నె
మ్మనమందుంగల పుత్రమోహలత ద్రెంపన్ రాదు రాదెరికిన్;
తనయున్బాసిన భూసురోత్తముని మోదంబందగాఁ జేయఁ దా
నను శ్రీ వేంకటనాథుఁ డయ్యెడల నందున్ భూసురుండౌచు ని
శ్చయుఁ డార్మిన్ గని వృద్ధుడున్ దనమనఃక్లేశంబు సర్వంబుఁ జె
ప్పిన, నాలించి ధరామరుండు కరుణన్ వృద్ధున్విలోకించి యి
ట్లనె "భూమీసుర! సర్వశాస్త్రములు నభ్యాసంబుగావించి జీ
వనముం జేసిన పండితుండవు గదా! ప్రాల్మాలి పుత్ర భ్రమన్

మునుగం బాఱుచు నుంటి, తండ్రి యెక్కఁడో! పుత్రుం డెవండో! వృథా
వనటం బొందుచు నుంటి మోహము ద్రుంపన్ లేక; దుర్భ్రాంతిచే
తను, నీ తెల్వినిఁ గోలు పోయితివి, చేతంబందు నీజన్మ బం
ధన ద్రెంపన్ మననింప వైతివిటు; నీతత్త్వమ్ము నే చూడ నే
రని వాఁడైతి, వివేకమేది? యిటు "పుత్రా! పుత్ర" యంచేడ్చి చ
చ్చిన నీకుం గల దేమి స్వర్గమట? నీ చింతల్ విసర్జించి భా
వినిఁ గాలింపుము, మూడుగాళ్ల ముసలీ! వేవేగ యూహింప నీ
తనువే శాశ్వతమేమి? నీగతికి చిత్తంబందు చింతింపుమా!
ఘన శాస్త్రంబులు వల్లెవేసితివిగా! కర్మాను బంధంబు త
ప్పనిదంచున్, మమకార పాశమును ద్రుంపన్ జూడుమా యింక ని
వ్వనికే వాఁడును గాఁడు దేవుఁ డొకఁడే భావింపగా సర్వముం
చును లోనెంచుము పుత్రమోహ వశమౌ శోకంబుఁ బోకార్చి, శాం
తిని నీవుండుము శ్రీహరిన్ మనములోఁ దీవ్రంబుగాఁ గొల్చి, నీ
తను పుత్రాదుల భ్రాంతి వీడుము భవద్ధర్మంబె నిన్గాచెడున్
మనుమా పుత్రుని మోహము న్విడిచి, నిమాయాంధకారంబు దా
టను నాలోచన చేయుమా!" యనెడి మాటల్వీనులన్సోఁక బ్రా
హ్మణుఁడిట్లాడెను "భూసురా! సుతునికై యారాటముం బూనుటె
ల్లను, వంశాంతముఁగాక, నా పితరులెల్లన్ స్వర్గతుల్గాంచ,, నం
చును బల్కంగను, వృద్ధుఁ గాంచు చనియాక్షోణీసురుండా తనిన్
మునుగం జేయుఁగ స్వామి పుష్కరిణిలో ముమ్మాఱు; వృద్ధుండు యౌ
వనముం గాంచెను భూసురుండు; హరిగాఁ బ్రత్యక్షమై నిల్చి పు
త్రుని నవ్వాని కొసంగి పల్కె నిటు "పుత్రుం గూడి నవింక శా
స్త్ర, నిరూఢిన్మను వంశవృద్ధిఁగని విశ్వాసంబుతో వేంకటే
శుని సేవింపుఁడు నీవు నీప్రియ తనూజుండున్ గడున్ భక్తి" నం
చన నావిప్రుఁడు స్తోత్రముల్సలిపె నిట్లత్యంత మోదంబునన్

“వనజాతాసన వాసవాది సుర సేవా భాజనాంఘ్రిద్వయా
దనుజారీ! హరి! దేవదేవ! పరమాత్మా! భక్త సంతాపవా
రణ! సంరక్షిత వారణా! మునిమనోరాజీవ రోలంబ! బ్రా
హ్మణుఁడంచు న్నినుఁగంటిఁ దప్పఁగొని యాహ్లాదంబు చేకూర్పవే
యనఘా! నాదుకుమారుఁ జూపితిగదయ్యా! నేను మూఢుండ! ని
న్ననలేనట్టి వివేక హీనుఁడను సాక్షాత్కారముం జెందుచున్
మనఁగా నీకృపయ యౌవనంబిడిన నీమాహాత్మ్యమున్ నేఁడు వ 425
ర్ణనగావింపఁగఁజాల శేషుఁడయిన న్వర్ణింపగా లేఁడనం
గను, నేనెంతటివాఁడ? నాచదువనంగా నెంత? వేదాంత వే
ద్య! నిను న్గాంచుటచేత నాకుమదిలో నత్యంతమైనట్టి నూ
తన చైతన్యము రూపుదిద్దుకొనె, మేధాశక్తి దీపించె, నా
మనమానంద రసాబ్ధిఁ దేలె, నిను సంభావింతు, ధ్యానింతు, భ
క్తిని బూజింతు, నిరంతరంబు ననురక్తిన్ నిన్ నుతింతున్! దపో
ధనులుం జూడఁగరాని నిన్నుఁగని నే ధన్యుండనైతిన్! దయా
వనధీ! ధీరహితున్, ననున్మనుపఁగాఁ బ్రత్యక్షమైనట్టి నీ
ఘనచారిత్రము ముజ్జగంబులను, ముక్కాలంబులన్ నిల్చి పా
వనమౌ నీపదపద్మ యుగ్మమును సద్భావంబుతోఁ గొల్చు, బు
ద్ధి, నొసంగంగదె జన్మ జన్మములకున్ దేవా!, యనంగా “సరే,,
యని శ్రీశుండు ననుగ్రహించి, తమితో నంతర్హితుండయ్యె బ్రా
హ్మణుఁడా రీతిని యౌవనంబుఁగని చెల్వారం. కుమారుం, గనుం
గొనుటం జేసి “కుమారధార” యని లోకుల్ పిల్వ నత్యంతమున్
గనె విఖ్యాతిని, స్వామిపుష్కరిణియు న్భూమండలంబందుఁ దీ
ర్థ, నికాయంబులు పెక్కులా గిరివర ప్రాంతంబు నందుండుటన్
“ఘనతీర్థాద్రిగ” వేంకటాచలము శ్లాఘాపాత్రమై రాజిలెన్

...0...

శంఖణరాజుకథ

ఘనుఁడౌ "శంఖణుఁడన్న రాజొకఁడు మున్కాంభోజ దేశంబునే
లెను, బోషించెను సత్కవీంద్రు బుధపాళిన్; యజ్ఞముల్ పెక్కుచే
సెను, లోకంబున శౌర్యశాలియను వాసిం గాంచె నెంతేని; భూ
జనులెల్లన్ సుఖశాంతులన్మనుటచే సార్థక్యముం జెందె నా
తనిపట్లన్మఱి రాజశబ్దమది; యంతన్ దైవయోగంబునన్
దన రాజ్యంబును బాసి శత్రువులచేతన్ భూమిపాలుండు భా
ర్యను దోకొంచును జెట్టు పుట్టల మహారణ్యంబులందున్ వసిం
చెను రాజ్యాంగసతోడ నాతనిని బాసెన్ సర్వసౌఖ్యంబులు;
గ్గనవింతేయగు సర్వమానవులకున్ రావచ్చు పోవచ్చు, వ
చ్చినవానిన్ బహు సంపదావళిని వెచ్చించున్ బరార్థంబుగా
గ, నెవండో యతఁడే హొగత్తలు గనున్ గ్రంథాలలో; నాతఁడే
జనము ల్మ్నెల్కలనిల్చు శాశ్వతుఁడు విశ్వస్తుత్యుఁడౌచుండు; వాఁ
డనఘుండౌ, మతిమంతుఁడౌ, నతని భవ్యంబౌ యశస్స్ఫూర్తితో
ఖవనీ తుంగతరంగ సంఘములు వేడ్కంబూని సయ్యాటలా
డును; దేవేంద్రుని రీతిఁ దేజరిలుచుండున్; నిక్కమూహింపఁ బ్రా
జ్ఞని పుణ్యానఁ బరేశు భక్తివఱలన్ గాంచంగనౌ మోక్షమే;
జననంబందినదానికి న్ఫలము రమా దక్షు నారాయణు
న్మనమందర్చన చేయుటే! సతతమున్ సౌఖ్యంబు, దుఃఖంబు రెం
డును దుల్యంబు లెంచు నెంచిమదియందున్, లేమి యన్నట్టి భా
వనలేకుండఁగ, నెల్లకాలములఁ బ్రాప్తంబైన లేశంబె తా
ననయుంబున్ బదివేలుగాఁ దలచు విద్యావేత్తయౌ, వానికెం
దునులోటుండదు; సర్వమాతనిదె గాదో; యెంచనానంద న
దన భూమీరుహ పుష్పసౌరభము నాతండే సదాపీల్చుఁ; శం

ఖణుడారీతి నరణ్యవాసమునఁ దాగాలంబుఁ జెల్లించుచున్
మనమందెంచెను, దీర్ఘయాత్రలొనరింపన్ మేలు పాటిల్లునం
చును; భార్యాసహితంబుగా వెడలె సంశుద్ధాంత రంగంబుతో
డను రామేశ్వర సేతుసన్నిధిని, వేడ్కంబోయియచ్చో మునిం
గెను;దివ్యంబగు నాసువర్ణముఖిఁగ్రుంకెన్ బోయి యాయుత్తరం
బున గంగాసలిలావగాహుండయి సంపూజించె దేవావళిన్;
మనమందెంతయు భక్తితో సతియు సమ్యగ్భక్తిఁ బూజించి పా
వన గోదావరిలో మునింగె, నటుపై భావంబు లుప్పొంగ , కృ
ష్ణను, గావేరిని, దుంగభద్రను. మహాసంతోషమేపార, గాం
చెను శ్రీనర్మద శర్మదన్ మునిఁగి తాఁజేసెన్ ప్రణామమ్ము, ల
ర్పణఁగావించెఁ దదాత్మఁ భావమునఁ దీర్థంబుల్ ఫలంబిచ్చునం
చును వైరాగ్యముఁగాంచ సాధ్యమగునంచున్ మానసంబందు తా
ననయం బిట్టులతండు భార్యయును దేవారాధనా లగ్న భా
వనులై ; కాలముపుచ్చ; నొక్కతఱి, సంప్రాప్తించె దీనత్వ మా
తనికిన్ "లేమిని నాతితోడ నిటు బాధల్ పొందుచున్ గాలమెం 475
తని వేగించుట?" లంచు నెంచుచును "రాజ్యభ్రష్టుఁడై, నిష్క్రియుం
డును, దారిద్ర్యహతుండునై, బ్రదుకు దీనుండెన్న జీవించు కం
టెను, నాబోటికిఁ జచ్చుటేనయము; సందేహంబు లేదింత" యం
చును; నిదురించుచునున్న భార్యఁగనుచున్ శోకించి, శోకించి, తా
నును నిదురించెను; నిద్రలో వినియె "నెందున్ ధైర్యముంబాయకో
జననాథా! బ్రతికున్న సౌఖ్యములు, సత్సంపత్తియుంగల్గు" నం
చును జూడంగదె యుత్తరంబునను, నీచూపులప్పంబందఁగాఁ
గనుమా! యల్లదె! వేంకటాచలము నీకున్మేలొసఁగ వైకుంఠమున్
గన సర్వార్తులఁ బాఱఁదోలు, నదియే కాంక్షన్ దగందీర్చు నె
వ్వనికైనన్; బహుళార్థ సంపదలిడున్ బాలించు, లాలించు, శాం

తిని బండిరించును: గల్పవృక్షమయి ప్రీతిన్వేంకటేశాఖ్య దే
ల్లని పాదాబ్జ యుగార్చనారతిఁ, దపస్విఁల్.సిద్ధులున్, యోగులె
వ్వరు జీవించెద. రానగంబుపయి శ్రీలక్ష్మీ మనోనాయకుం
డును నిశ్శ్రేయసకృ జ్జాయమాన, కరుణాఢ్యుండున్, జగద్రక్షకుం
డును, చింతామణిమూర్తియైన వరదుండున్; వేంకటేశాభిధా
న, నిరూఢుండును, నైన దేవుఁడల కొండన్ భక్తవాంఛాళి యె
ల్లను దీర్పన్ వెలసెన్మహా మహిమతోఁ, లావణ్య వారాశియై;
ఘనమా వేంకటభూరిభూధరమనంగాఁ బ్రీతి యవ్వేంకటే
శున కెంతేనియు"స్వామిపుష్కరిణి" యంచుం బొల్చుతీర్థంబులోఁ
మునుఁగన్, స్వామినిగొల్వఁగాఁ గలుగు నీముందున్న రాజ్యంబు లె"
మ్మని యవ్వాణి వచింప; నుల్కిపడి శుంభద్రీతి నారాజు లే
చెను, నల్దిక్కులఁజూచె!"కల్ల! కలయా! శ్రీవారిభద్రోక్తులా!"
యని యర్ధాంగికి నాకలస్వనిచె, తానర్ధాంగితోఁ గూడి; తె
ల్పిన, యా యుత్తర దిక్కుపట్టిచనె; సాపృథ్వ్యాసపై నంత వి
చెను, మందమ్మునఁ బిల్లవాయువులు, దోచెన్ జెంత పద్మాకరం
బున. నేత్రోత్సవ మొప్పవీచికలు, సొంపుల్గుల్కి రాణించున్
గని, వాల్మీక నగంబు; నిల్చియట సత్కల్యాణముంగూర్చు దా
నిని శ్రీ పుష్కరిణిన్, జనౌఘకలుషానీకంబు భంజించు దా
నిని నీరేరుహ ముఖ్యపుష్పములు సందీపించు దానిన్ జగ
జ్జనముల్ మెచ్చెడు దాని మత్స్యకమఠ స్థానంబుగా నొప్పు దా
నిని గాంచెన్; దరువాత గాంచెఁజని యెంతేభక్తి, శ్రీవేంకటా
ద్రిని మల్లీముఖ సూనసౌరభములన్ దివ్యల్లతాశ్రేణులన్
వినుతింగాంచెడు దానిఁ గొమ్మలగమిన్ వ్రేలాడుచున్నట్టి పం
డ్లను, శోభిల్లెడు దానిఁ బండ్లు తిను నానాపక్షివారంబు చే
తను, నొప్పారెడు దానిఁ గీరములు, వేదంబుల్ పఠింపంగ స

ర్పు, నికాయంబు ఫణంబు లెంతయును నూపం బొల్చు చున్నట్టిదా
నిని గోలంబవికాయ నాదములతో, నిండారుదానిన్; మహో
త్తున్నని శ్రీ వేంకటనాథుఁ దాల్చుచును సంతోషించు దానిన్ జన
మ్మున్మన కానందము నిచ్చు నాట్యముల, నెమ్ముల్మెచ్చియు,రాణించు దా
నిని ఘాతుచ్ఛటఁబొల్చు దాని మృగముల్ నిత్యోత్సవంబొప్ప భ
క్తిని సేవింపుచు, స్వామి పుష్కరిణిలోఁ దీర్థమ్ములాడంగఁ బెం
పున వర్తించెడు దానిఁ గాంచి యటుపై భూపాలుఁడున్ జేరి, చే
సెను స్నానంబును స్వామి పుష్కరిణిలోఁ, జిత్తమ్మున్, మొత్తమ్మున్ భ
క్తిని, సర్వోన్నత భావడోలికలలోఁ దేలంగ, నర్ధాంగితో
డ; నటన్ నిర్మల వారి పూరమును వేడ్కన్ గ్రోలి, శ్రీనాథు న
ర్చనగావించె! "సమస్తమాతఁ"డను విశ్వాసంబు గాఢంబుగాఁ
గను; షణ్మాసము లాగతిం జరిగెఁ దత్కాలంబునన్ సర్వ మా
తనికి, న్వేంకట నాథుఁడే కనఁబడెన్; దద్భిన్నమౌ వస్తువే
కనరాదయ్యెను; స్వామి పుష్కరిణిలోఁ గావించి స్నానంబు; దీ
క్షను, జిత్తంబును వేంకటేశుపయి లగ్నంబౌనటుల్ నిల్పి; యా 525
జననాథుండొనరించి ధ్యానము, కనెన్ సర్వాత్మునిన్ వేదవే
ద్యుని దైత్యాంతకునిన్! మునీంద్రజనవంద్యున్ నీలవర్ణున్ గిరీ
టిని కర్ణద్వయి వెల్గు కుండలములన్ శోభిన్ విరాజిల్లు వా
నిని పీతాంబర ధారి, హారయుతు, ధన్విన్, శంఖ చక్రాదుల
న్గొని, హస్తంబుల యందుఁ, గన్నులకు బ్రేగుం గూర్పఁగాఁ జూచి,సం
తసె, బ్రహ్మేంద్రముఖా మర వ్రజము స్తోత్రంబుల్ దగన్ జేయువా
వను మౌనీంద్రనుతున్ బరాత్పరుని శుంభద్దివ్య సమ్మోహ రూ
పుని రాజీవదళాయ తాక్షు; మఱి శ్రీభూనీల లత్యంత భ
క్తిని సేవింపఁగఁబొల్చు వాని; గని, యెంతే స్తోత్రముల్ చేయనా
మనుజాధీశ్వరుఁ జూచి "రాజ్యమును సంప్రాప్తించు నీకింక పా

వశమా భావన నన్నుఁ గొల్చితివి శోభల్మీర సౌఖ్యంబు లె
ల్లనునిన్జేరును, బూర్వవైభవము వైళంబింక బ్రాప్తించు వే
చనుమా!" యంచును, వేంకటేశ్వరుఁడు శశ్వత్ప్రీతితో జెప్పి, యం
తని యంతర్హితుఁడయ్యెఁ; బ్రీతిఁగొని, తాఁదన్వీ సమేతంబుగా,
జననాథుండును, స్వామి పుష్కరిణిలో స్నానంబు గావించి, వి
ష్ణుని, నాత్మన్నుతిఁ జేసిఁ యేగునెడ, సుశ్లోకాత్ములై వచ్చి, రా
తనికి న్మ్రొందుగ, మంత్రిసత్తములు, చేతః ప్రీతి; నా శంఖుని
న్గని "రాజా! విను గెల్చి యేలుకొనియెన్ గారాని రాజ్యంబు; నీ
వును, రాజ్యంబును బాసి, ఘోరవనులం, బోవంగ నీలోన, దై
వ, నియోగంబున నీను శత్రవులు, దుర్వార ప్రభావంబుతో
ఘనదుర్దాంత దురంత భావముల సంఘర్షించుచున్, బోయి చ
చ్చిన, మేమందఱ మీగతిం, దిరిగి మీచేఁ బూర్వరాజ్యంబు, పా
లన జేయించు కొనంగ వచ్చితిమి; శ్రీరాజన్య! మీమంత్రులం
గనుమా నమ్ము! యథాక్రమంబుగను, నీకారుణ్యముం జూపుమా!"
యనుచున్ బ్రార్థనచేయు, శంఖుఁడు నాహ్లాదంబుతో నెల్లవా
రిని ప్రేమంబున గౌగిలించె, యిదియా శ్రీవేంకటాద్రీంద్రు పా
వనమౌ దీవెన! లేకయున్న యిటు, సంప్రాప్తించునే రాజ్య మా
తని! కారుణ్య కటాక్ష వీక్షణ మహాత్మ్యంబిద్ది నిక్కంబ" టం
చును భూమీజను లెల్ల రాత్మలను సంతోషింప, శ్రీ వేంకటే
శుని చిత్తంబున నెంచి, రాజ్యమును సుశ్లోకుండు గానేలె! ధా
త్రిని సర్వోత్తముఁడౌచు; నీ చరిత సంప్రీతిన్ పఠింపన్ ఘటిం
చును, భాగ్యంబులు, వేంకటేశ్వరుడు ప్రోచున్ సర్వకాలంబులన్;

...o...

ఆత్మారాముని కథ

వినుతింపందగు మధ్యభారతమునన్, వేదాది శాస్త్రజ్ఞుఁడై,
యనఘుం డైనవి, నొక్క భూమిసురు "డాత్మారాము" నాముండు. పా
యని దాతృత్వ గుణంబు చేతఁదన ద్రవ్యంబెల్ల వెచ్చించి, ని
ర్ధనుఁడై పోయెను, తీర్థయాత్రలకు, జిత్తంబు త్తలంబంద, నే
గెను శ్రీ వేంకటశైలముం గనఁగ; భక్తిం గాంచెనచ్చో, మహా
త్ముని, మౌనీంద్రు సనత్కుమారకుని, సంతుష్టాంతరంగంబుతో
గని సాష్టాంగ నమస్కృతుల్ జరుప వేడ్కన్మౌని "లేలెమ్మ"టం
చును సంతోషముతోడ నెత్తి నిటులం మంబల్కె దత్పూర్వ జ
న్మను గావించిన యట్టి కర్మముల నంతర్దృష్టి వీక్షించి; "తీ
అని కోర్కుల్ మరితీరు నీ" కపిల తీర్థంబందు గ్రుంకంగ; నా
య్యాన, శ్రీ వేంకటనాథు సత్కృపయు నెయ్యంబొప్ప నీవంది కొం
చును సన్మండలిలోనచుందువిక హెచ్చుల్గల్గు; శ్రీ వేంకటే
శుని; శ్రీ వేంకట శైలమెక్కుమిక; నక్షీణుండవై యుందువో
యనఘా! తల్లిరమా వధూటి కృప నీయందుండు; నీపై నినా
జననీవత్సలతన్, మహావిభవమున్ సర్వంబు ప్రాప్తించు; బా
యనివై! పద్మయు, పద్మవాసినియు, బద్మాక్షార్థ భాగంబుగా
మను శ్రీపద్మదళాయతాక్షి! వరపద్మ శ్రీలతోఁ గూడుఁ ద
ల్లినిబూజించు దయాంబురాశియయి సుశ్రీలిచ్చెడున్, హెచ్చుగా;
ధనమేగాదు సమస్త భాగ్యముల సంధానించు, నాతల్లి పే
ర్మిని నెవ్వారికినైనఁ గొల్చినను; లక్ష్మీమంత్రముం గొమ్మ దీ
నిని నారాధనచేయు" మంచు నిడె నెంతేనిన్ రమామంత్ర మా
తనికిన్; వెంటనె నేగెనమ్మునియు; స్వాంతంబందు నా బ్రాహ్మణుం
డును, నామౌనినిగాంచి; బాష్పముల తోఁ దోహస్తముల్ మోడ్చి, పా

వని శ్రీలక్ష్మిని, జిత్తమందునిచి, సేవాభావనన్ మంత్రవా
సినిగా నాత్మ మహత్త్వతత్త్వమున లక్ష్మీదేవి నూహించు చుం
డిన వాడౌచు సమస్తమున్మఱచి; మానిన్సద్గుణత్వమ్ముతో
గని శ్రీవేంకటశైలమెక్కి యచటన్ గౌతూహలంబొప్పఁగా
గనియెన్ రత్న సమూహ సంఘటితమౌ కల్యాణ కుడ్యంబుఁ లం
తన భర్మంబు వినిర్మితంబులగు యత్యంత ప్రమోదంబు జూ
పిన ప్రాకారము; గోపురంబులును భావింపంగ రానట్టి పా
వనమౌనింద్రపురంబు మించుచును శోభన్మీరు నా వేంకటా
ద్రిని; శ్రీలక్ష్మికటాక్ష వీక్షణాల నెంతేగానగా వచ్చు నం
చును భావించుచు శంకరు స్సురపతిన్, సూరీంద్రులైనట్టి వా
రిని, దిక్పాలుర, దేవతాళుల మహర్షివ్రాతమున్ యక్షులన్
ఘనదివ్యర్షుల, పన్నగోత్తముల జెంతిర్గీత వాదిత్రయం
బును గావించెడు వారి నందఱను; సంపూర్ణ ప్రమోదంబునం
గనియెన్ భూసుర వంశ భూషణుడు శ్రీకంజాక్షునిన్; వక్షమం
దును లక్ష్మీసతి కౌస్తుభంబు గను విందుంగూర్పుచున్నట్టి నా
నిని గాంచెన్; జపియించె మంత్రమును, ధ్యానించెన్ రమానాథునిన్
మనమేకాగ్రతనిల్పి; శ్రీదయితుడీమాడ్కిన్ వచించెన్ "రమా
వనజాతేక్షణ సుప్రసన్నతనుఁ సంభావించి నీవిప్డు ల
క్ష్మినిగన్నావు కటాక్ష మందితివి సుశ్రీయోగ భాగ్యంబు లె
ల్లను నందంగలవింక; ఇవిహములో లక్ష్మీ నివాసుండవౌ
చును పై మోక్షమునందగా గలవు; కాసుల్దానముం జేయుచున్
మనుమా!" యంచును భూసురుండు హరి సమ్యగ్భక్తి బూజించి యిం
టని జేరంజను; నంతలోపలనె యెంతే లక్ష్మితో దాండవిం

చెను గేహంబును; నబ్బురం పడుచు లక్ష్మీయుక్తుడౌ వేంకటే
శుని బూజింపుచు దానముల్సలుపుచున్ శుద్ధాంతరంగంబుతో
డను, గావించుచు ధర్మకార్యములు వేడ్కంబొల్చె లోకంబునన్;

...o...

వివిధ తీర్థములు

ఘనుడౌ కర్దము గర్భమందు "కపిలాఖ్యున్" శ్రీనివాసుండు బు
ట్టెను; సాంఖ్యంబును బోధచేసి బుధకోటిన్ మెచ్చగాఁజేసి కాం
చెను సత్కీర్తి; రసాతలంబున వసించెన్ బోయి యచ్చో దపం
బొనరించెన్ శివలింగమున్నిలిపి; యాయోగీంద్రు డత్యంత భ
క్తిని; నాశాంభవ లింగముం బెఱిగి ధాత్రిన్వేంకటాద్రిస్థలిన్
గనుపట్టెన్ గరిమంబునన్ "గపిల లింగంబన్న" నామంబుతో
డను సద్భక్తుల కెల్ల కోరికలు వేడ్కందీర్చె మున్నీ మునీం
ద్రుని కన్నంటల, భస్మమౌ సగరు సత్పుత్రాళికిన్ ముక్తి గూ
ర్చను; భాగీరథి వచ్చి "భోగవతి"నా బాతాళమం దొప్పి యీ
వినుతంబౌ శివలింగరాజము నిటన్ విఖ్యాతిగా దడ్పె; నిం
కను శ్రీవేంకటశైలమందు మిగులన్ గణ్యంబు, మాన్యంబు, శో
భనము ల్గూర్చెడు "శక్రతీర్థమది పాపఘ్నంబుగాఁ గీర్తిగాం
చెను; మున్నింద్రుడహల్యతో నెనయుటన్ సిద్ధించె పాపంబు, దా
నిని నాతండును "జక్రతీర్థమున నెంతేభక్తితో నిచ్చలున్
మునుగన్ బాపవిముక్తి కల్గెను; సిరుల్ మోదంబు నందన్; సుధీ
జనముల్ మెచ్చగ; స్వామి పుష్కరిణిలో స్నానంబు మున్పాండునం
దను, లయ్యేవురు చేసియున్న కతనన్ దథ్యంబుగా నామ మ
య్యెను "శ్రీపాండవతీర్థ" మంచు బొగడగన్ బృందారకాగ్రేసరుల్

—o—

వేంకటాద్రిని దిలీపుఁడు దర్శించుట

ఇనవంశోద్భవు "డంశుమంతు" డను పృథ్వీనాథుఁడానంద, వ 625
ర్ధనుడై, నిత్య వినూత్నభావుకు, "డయోధ్యానాము" సత్పట్టణం
బును పాలింపుచు, "దానశీలు" డను పెంపున్ సొంపులార్జించె; నా
తని యర్ధాంగిగ నొప్పె, భానుమతి; యాతస్వీశిరోభూషణం
బునకుం, బుత్రులు లేమికిన్ వగచి, యా భూపాల చంద్రుండు, యా
గ,నికాయంబులు చేసె నెన్నియొ, గుడుల్ గట్టించె; నిష్టార్థ సి
ద్ధిని, గాంచంగను లేమి జేసి, శివునుద్దేశించి, చేసెం దపం
బును, భార్యా సహితంబుగా గడఁగి; శంభుండంత ప్రత్యక్షుమై
వినిచెన్ "మీకు సుపుత్రుడుద్భవిలు పృథ్వీన్ వైరులం ద్రుంచి, ని
ల్పును మీకీర్తి" నటంచు భానుమతియున్ బుత్రున్ గనెన్
గని రాజేంద్రుడు, జాతకర్మ విధులం గావించె దానంబులం
దవిపెన్ భూసురకోటి నుత్సవము, లుద్యద్రీతిగావించె, భూ
జను లెన్నంగ 'దిలీపు నామమిడె, నాసత్పుత్రుడున్ గాంచె యౌ
వనమున్, దండ్రియు, యౌవరాజ్యమునఁదా బట్టంబు గట్టంగ, వెం
టనె యాతండును, జైత్రయాత్రసలుపన్, నాకీశుడర్థించె నా
తని, దైత్యేశ్వరు "రత్నచూడు" దునుమన్, దత్కార్యముం జేసి, మె
ప్పును బొందెన్ సురరాజుచేత, జనులుబ్బంగాంచ, నిట్లుండగా!
ఘన ధర్మాత్ముఁడనంగనొప్పు, సగరక్ష్మాపాల చంద్రుండు, న
గ్నని, సద్భక్తిని, గూతునిమ్మనుచు సంకీర్తించి, ప్రార్థింప, ని
చ్చెను కన్యామణి నాతడున్; సుగుణ రాశిన్; సుందరరాగిన్, "సుద
క్షిణ" యన్నామము గల్గునాయమను వరించెన్ ప్రేమమీఱన్ 'దిలీ
పుని' నాతండొకనాడు వేంకట నగంబుం, జూడగా గోరిజే
రె, నయం బొప్పగ; స్వామి పుష్కరిణిలో బ్రీతాత్ముడై స్నానము

ననువుప్పొంగగ జేసె; వేంకట పతిన్ తాత్పర్యమొప్పార, గొ
ల్చెను, సర్వోన్నత భావడోలికలదేలెన్ శీర్షమర్పించె దీ
వనలా బొందగ శ్రీనివాసువకు, శుంభద్భక్తి నేకాగ్రత,
న్మనసున్నిల్పుచు, ధ్యానముం జలిపె; నంతన్ శ్రీనివాసుండు, దా
చెను రాజేంద్రుని ముందు 'నీకగుత! సుశ్రీలున్, యశోదన్, సుద
క్షిణతో, రాజ్యము సేయుమా! మిగులవాసిన వన్నెయుం గాంచి' యం
చు, నదృశ్యుంబయి పోయె వేంకట నగేశుండంత నారాజు, వ
చ్చె, నయోధ్యాపురికిన్ ప్రజల్ప్రగడి జేజేల్వెట్టి రెంతేనియున్:
జననాథుండును రాజ్యమేలెను జనశ్లాఘాస్పదంబౌగతిన్;

...o...

దశరథుండు వేంకటగిరిని దపముంజేయుట

ఇనవంశ్యుం, "అజ" సూతియా దశరథుం, డీ వేంకటాద్రిన్ దపం
బును గావించెడు కాలమందుననును, నంభోజాక్షు దర్శించి, రా
వణుడా శంకర, పద్మసంభవ వరప్రాప్తిన్ విజృంభించి, లో
క, నికాయంబుల కార్తిగూర్చుటయు, వీకన్దేవతా కామినీ
మణులన్ గారలయందు బెట్టుటయు; రంభన్బట్టి "కుయ్యో మొఱ్ఱో"
యనుచుండన్, విడకుండ బొందుటయు; గోలైనట్టి దుశ్చర్య, లె
ల్లను దెల్పం, దెలిదీవి వైపుచను వేళన్ దారిలో నారదుం
డును గన్పింపగ, దేవనాయకుడు, గోడుం జెప్పగా: "వేంకటా
ద్రిని వైకుంఠుడు, లక్ష్మితో, నిలిచె; మీరీరీతిగా గాక, బ్ర
హ్మను ముందుంచుక, యేగ శ్రీహరి స్వకీయంబైన రూపంబు, జూ
పును మీకం" చును జెప్పిపోయెను, గడున్ బూజ్యుండు శ్రీనారదుం
డును; శ్రీనారదు వాక్కులన్విని సురల్, నూల్కొన్న మోదంబునన్

జని, రుద్యద్గతి సత్యలోకమున; కాస్థానంబు నందున్న, బ్ర
హ్మను, వేదంబులు నాల్గుమోములను శుంభద్రీతి నొప్ప గ, బ
చ్చని దేహంబు; సువర్ణ శైలమును మించన్; ఫాల భాగంబు, బ్రా
హ్మణ తేజమ్ముఁ జాట; బద్మమున నధ్యాసీనుడై వెల్గువా
నిని, వాణీ సహితుం, గనుగొనిరి; యెంతే భక్తిగేల్మోడ్చి, కీ
ర్తనగావించిరి; బ్రహ్మ ప్రశ్నకు సమాధానంబుగా నింద్రుడ
ల్లన దెల్పెన్, దమ రాకకుంగతము "దెల్లంబయ్యె సర్వంబటం"
చును, వారందఱుగూడి బ్రహ్మ చనె; సుశ్లోకంముగా వారి దో
డ్కొని శ్రీ వేంకటశైలముం గనగ; నిట్టుల్వారిద్దరితో బల్కె "మీ
కును, నాకున్ స్వామి యీ గిరీంద్రమున, చూడ్కుల్జూడగా రాని బా
గున గన్పించును; నిచ్చటన్ దశరథక్ష్మోణీశ చంద్రుం, డవా
రణ గావించు తపంబు; "రాము" నవతారంబూని యీ మేదినీ
శునకున్ విష్ణుఁడుఁ బుట్టు నందనుక నిచ్చోటన్ దగనిల్చి భ
క్తిని స్తోత్రంబులు చేయమేలనిన" నాదేవాళి యట్లేయటం
చును నాబ్రహ్మ,బృహస్పతుల్ మఱిబిడౌంజుండున్, జనన్ముందుగా
వెనుక న్వారల వెంబడింజనుచు సంప్రీతాత్ములౌచున్ బ్రద
క్షిణగావించిరి యాగిరీంద్రమును, సుశ్రీ తేజముల్గాంచ బో
లును, వైకుంఠము నిద్దియంచు, నమరుల్ లోనెంచి రెంతేని, వి
చ్చిన మొల్లల్, మఱిచంపకావళులుచున్, జేమంతులు, న్మల్లెలున్
బ్రణుతింపందగు సన్నజాజులును , గోరంటల్ మరిన్ నందివ
ర్ధనముల్, పొన్నలు, మున్నుగాగల సుమవాటికంబు నేత్రోత్సవం
బు, నిడన్ ; చిల్కల,గోరువంకలనుడుల్ మోదంబుగూర్పన్,వనం
బును బొంగించెడు గోకిల ధ్వనుల నింపున్పెంపు గల్గించు నా
ఘనమౌ వేంకట సద్గరీంద్రమున వేడ్కంగబోయి యత్యంత భ
క్తిని దేవావళి, స్వామి పుష్కరిణి గ్రుంకెన్ , శ్రీహరింబాడి; బ్రే

మను నాచెంతను చేరి శ్రీ దశరథక్ష్మాపాలునిన్ బుత్రవాం
ఛను ఘోరంబగు సత్తపంబుఁగడు దీక్షంచేయుచున్నట్టి వా
నిని భావంబున వేంకటేశ్వరుడె రాణింపంగ నున్నట్టి వా
నిని! సంతానము దక్కనవ్యమును దేనింగోరకున్నట్టి వా
నిని! తద్దివ్య తపః ప్రభావమునకున్ మేల్మేలటంచున్ నుతిం
చునో యన్నట్టులు తుమ్మెద ల్మ్రోరయ సంశుద్ధాంతరంగంబుతోఁ;
జెనకన్ రానటు లున్న జూచి "భళిరా; శ్రీసూర్యవంశోత్తమా!
కనుమా పుత్రుల వంశమున్నిలుపుమా! కల్యాణముల్గాంచుమా"!
యని యాశీర్వచనంబు బల్కనెడ నత్యాశ్చర్యమేపారగన్
ఘన దివ్య ప్రభ యొండుదోచెనట నాకాశంబునన్; దిక్కు లె
ల్లను, వెల్గొందఁగ దేజమప్డి, నృపుపాలన్ గ్రన్ననన్నిల్చినన్
గనులన్విప్పి యతండుగాంచెనెదురన్ గంజాక్షు! శ్రీ వేంకటే
శుని; హస్తంబులు మోడ్చి భక్తిమెయి సంస్తోత్రంబులన్జేసి నా
వనజాతాక్షుఁడు కూడ నాదశరథున్ 'వహ్వారె నే భక్తికిన్
మనమాహ్లాదము నందెనంచు మరి బ్రహ్మన్, చాకవైరిన్, గనుం
గొని, సంభావనచేసి యింద్రుడును రక్షోబాధ వాకుల్విగా
విని' జన్మించెద నేను నీ దశరథోర్వీనాథు పుత్రుండనై'
తునుమాడంగలవాడ రావణుని, మీ దుఃఖంబులన్బాపువా
డ" నటంచున్ వచియించి "యో దశరథుండా! వింటివే" యన్న "విం
టిని నాజన్మతరించె నం" చతడనన్ నిండారు మోదంబునన్
గని "బ్రహ్మోత్సవ మాచరింపుడిటుపైఁ గాక్షుల్ ఫలింపగ నం"
చును నంతర్హితుఁడయ్యెనందు జలజాక్షుం డంత బ్రహ్మాజ్ఞ చే 725
తను నిర్మించెను విశ్వకర్మయుగుడిన్, దబ్భ్రాభరాగ్రంబుమీ
దను, నిర్మించెబురంబు దివ్యముగ; దత్ప్రాంతాన బ్రహ్మోత్సవం
బునుగావింపగ; నంతనాశ్వయుజమైహాల్వారు. మాసంబులం"

దును, ప్రారంభము చేసియు న్మఱియు నెంతో "యుత్తరాషాఢ"లో
ఘనతంగాంచి వెలుంగు నా "శ్రవణనక్షత్రంబులోఁ దీర్థవా
ఁ ని జేకూరిచి యుత్సవంబు కడుఁ పెర్మిన్ఁ నిర్మిచి సంతోషమం
దిన డెందంబుల భక్తులెల్లఁ దమితో దివ్యాభిషేకంబుఁ జే
య నియోగించెను బ్రహ్మదేవుఁడును; బ్రహ్మానందముం గాంచిరి
ర్విభక్తుల్; మఱి గాంచెనా దశరథోర్వీనేత రామాదులన్.

—o—

-: శ్రీరామచంద్రుఁడు వేంకటగిరిని దర్శించుట :-

వనవాసంబును రామచంద్రుఁడొనరింపన్ జానకిం గొంచు; రా
వణుఁ డంపంగి పిసీనతోఁ గదలి యాపద్ప్రాప్తసూనుండురున్,
హనుమ, జ్జాంబవదాదులుం గొలువ శౌర్యస్ఫూర్తి శోభిల్లుచున్
దనకు న్వేంకటశైలదర్శనము చేతం గార్యసంసిద్ధియౌ
ననుమానీంద్ర వచస్సెంచి చన, నయ్యద్రిప్రదేశంబునం
గని శ్రీరాముని, నంజనాసతియనె హ్మా పుత్రికానాథ! మా
హనుమన్నన్ భవదీయదాసునిగ బ్రహ్లాదుండుగా నేలఁ బా
వనమయ్యెం గదమాదువంశము మహాభక్తుల్, మహర్షుల్, నినుం
గన నీ వేంకటశైలమందుఁ దపముం గావింత్రు శ్రీరామ!" యం
చును నాయంజన ప్రార్థనంబు పలుపన్ "జాతున్ మఱిన్ వారిరా
వణుఁ దున్మాడు ననంతరం" బనిన దేవా! ముందుగా నీవు వా
రిని సంప్రీతులఁ జేయఁగాదగును; వారినీవు వీక్షించి వ
చ్చిన యజ్ఞంబుల చేత లోకహితము న్జేయంగనౌ, వారికిన్
బ్రణుతంబై నకటాక్షవీక్షణసుధావర్షంబు నందంగఁ జే
సిన, నమ్మానుల దీవనల్ నినుజయశ్రీయుక్తునిం జేయునం"
చన రాముండు ప్రసన్నుఁడై టఁ గని వేహస్తంబులన్మోడ్చి ప　750

మునులెల్లన్ మును "సత్ర యాగమును సమ్మోదమ్ముతో నైమిశం
బున గావించు తఱిన్ బురాణ నిచయంబుల్ చెప్పుసూతుండు విం
చును; నాలోపల వేంకటేశు మహిమం జోద్యంబుగాఁ దెల్పఁగా
విని, యాకశ్యప, గౌతమాదిమునులువిప్రౌఘ్యారుచున్ వేడుకన్
జనిరా వేంకట శైలరాజమును గాంచన్; సూతమౌనీంద్రు వా
క్కును లోనెంచుచు వేంకటేశ్వరు కథాకూపార మగ్నాత్ములౌ
చును; మధ్యన్ దివిజస్రవంతిని మహర్షుల్ గ్రుంకి, యామీఁద; వే
డ్కను శ్రీ గౌతమి వారిమున్గి, పయినేగన్వచ్చెఁగొన్నాళ్లకున్
వినుతింపన్ దగు వేంకటాచలము మౌనివ్రాతమెల్లన్, ప్రద
క్షిణలం జేసిరి; భక్తిభావ గరిమ శ్రీయుక్తులై చేరి, తీ
ర్థనికాయంబుల నోలలాడిరి ; మనోరాగంబు సంధిల్లఁ బెం
పును,సొంపున్ బ్రకటించు నాగిరిని సంపూర్ణ ప్రమోదంబుతో
డను నారోహణఁజేయు చొండొరుల తోడన్దాని మాహాత్మ్యముల్
"గణనాతీతములంచుఁ బల్కుచును సాక్షాత్కారముంగన్న శ్రీ
వనజాతాక్షుని రాజధానియగు నావైకుంఠమో, యంచు వ
ర్ణనగావించుచు, వేంకటేశు "సగుణ బ్రహ్మ స్వరూపుండటం"
చును, భక్తావళి పాలిటంగల, సురక్షోణీరుహంబౌండెఁ గా
దనిసన్ వేడ్కప్పు గిడ్డియుండె వనుచున్ హాళింబ్రసంగించుచున్;
జనియామౌనులు స్వామి పుష్కరిణిలో స్నానంబుఁగావించి, పా
వనభావాబ్ధి తరంగ డోలికలలోఁ బల్మాఱు లుయ్యాల లూ
గినవానంద సువృష్టిలోఁ దడిసి యాగీర్వాణ వంద్యున్ నిరం
జను, నిత్యున్! బరమాత్ము, విశ్వమయునిన్ సర్వేశు గాంభీర్యసీ
సనిధిన్ గద్గద కంఠులౌచు నిగమార్థ స్ఫూర్తి గేయంబులన్

ఘనరావంబును బోలుకంఠరవమొక్కండప్డువి తెంచె; నే
గెను శ్రీరాముడు, లక్ష్మణుండు, మఱిసుగ్రీవుండు, నయ్యంజనా
తనయుండుం, దనుఁగొల్వ; సర్వకపియూథంబున్ గమింపంగఁ జే
రెను లంకాపురి; యుద్ధమందుఁ బరిమార్చెన్ రావణున్ గుంభక
ర్ణుని, నయ్యింద్రజిఁ గూల్చె లక్ష్మణుఁడు; ధీరుల్మెచ్చఁగా నవ్విభీ
షణునిన్ బట్టముగట్టిలంకకును; రాజన్యుండు సీతమ్మతో
డ, నయోధ్యాపురి కేగుదెంచె; కపికాండంబుల్ మఱిన్ లక్ష్మణుం
డనయుంబుందనుఁగొల్వ రాఁగ; నిజరాజ్యంబేలె లోకంబున
న్ఘనమౌ వాడుక "రామరాజ్య" మనికల్గన్ మాఱులేకుండఁగన్;

...o...

:- శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యము :-

ఘనుఁడాసీగిరిమీఁదట న్వెలసి భక్తవ్రాతమున్నిచ్చలున్
మనుచు న్వేంకటనేతసత్కరుణతో మాహాత్మ్యముంజూపి, మ్రొ
క్కిన మ్రొక్కుల్ ఫలమందఁ జేయును, దొలగించున్ మహాపత్తుల్;
తనదౌ చక్రము నడ్డువేసి యపరాధంబుల్ క్షమించున్; మఱిన్
దనకొండెక్కియు సర్వమాతనికిఁ జేతఃప్రీతినర్పింపవే
డ్కను మోమందును భక్తితో డమది ప్రుండంబుల్ ధరింపంగ మె
చ్చును, యోగోన్నతభావడోలికల జేర్చున్; మార్చుకర్మంబు; బ్రో
చును బాపాత్ములనైన, సంపదలనిచ్చున్, హెచ్చుగా మెచ్చుఁ దీ
యనిరూపంబును జూపునాత్మకు మహాహ్లాదంబు సంధించుచున్
ఘన సంపచ్చయముల్ ఘటించును, నమస్కారంబు సద్భక్తిఁ జే
సినఁ బాపౌఘదవానలంబుపయి వర్షించున్ గృపావర్ష ధా
రను; హేరాళముగాఁగ వేంకటమహాగ్రావంబుపైఁ గొప్పున

ర్పణగావించిన నెల్లవాంఛలును సంప్రాప్తింపఁగాఁ జేయు, పొ
చ్చుఁ నెవండైనను నిల్వుదోపిడొసఁగన్ జోద్యంబుగా వానిఁ బ్రో
చునుఁ జన్మాంతర కర్మవాసనఁ ద్రెంచున్; బెంచునానంద వ
ల్లిని; భక్తావళిచేయు విన్నపములన్ లీలామయాత్ముండుగా
వినెడున్; డాబులు చూపి మోసములు గావింపంగ నుంకించువా
జనులన్ మోసము చేయు నట్టిఖలులన్ శాసించు; నేకాగ్రతం
దను సేవించెడి యాస్తికావళులకానాకష్టము లీర్చి, ర
క్షణగల్పించును; నాస్తికావళిను పేకుంజేసి శిక్షించుఁ; గ
ల్మిని; లేమి, న్నమచిత్తులై మను నెడన్ మేల్మేలనన్జేయు; స
జ్జనులన్ మెచ్చును; భక్తసంతతికి మోక్షంబిచ్చు నీ వేంకటే
శునిలీలన్ గొనియాడ వేతలల శేషుండే నశక్తుండగున్!

...౦...

శ్రీ స్వామి పుష్కరిణీ చరిత్ర

మును చంద్రాన్వయుఁడైన నందుఁడను సద్భూపాలుఁడొక్కండు భూ
జనసన్మాన్యచరిత్రుఁడై ఘనవిపత్వ్రాత సర్పాళికిన్
వినతానందనుఁడై జనుల్పొగడఁ బృథ్వీపాలనం జేసె; నా
తనికిన్ గల్గెను ధర్మగుప్తుఁడను పుత్రశ్రేష్ఠుఁడొక్కండు; యౌ
వనముం గాంచెను, శస్త్రవిద్యల మహా ప్రావీణ్యముం బొందె; కీ
ర్తి నిమించెన్; గజవాజిశిక్షణాల "నేరీసాటి యీ మేటికి"
న్ననుతిన్ రాజకుమార లోకమున జెందంగల్గె; నామీఁదటన్
జనకుం డిచ్చిన రాజ్యమేలఁ దొడఁగెన్ సర్వప్రజల్ "మేలు మే"
లని కీర్తింపఁగ, భూసురుల్ తనియఁగా యజ్ఞంబులం జేసె, భూ
జనసంత్రాస కరంబులౌ మృగములన్ జంపంగ వాంఛించి కా
వనమేగెన్; హరులన్వధించె, గజసంతానంబు మ్రందించె, గూ

ల్చెను వ్యాఘ్రంబులుఁ దక్కుజంతువులుఁ దూల్చెన్; భాస్కరుండంతఁ జే
రెను నస్తాద్రికి, సాంధ్యరాగములు మీఱెన్; బుల్గులుం గూండ్లఁ జే
రెను; నానాపశుపక్షిసంతతులు కోరెన్ గూర్కులందంగ; హా!
గుణివస్త్రంగతు సూచు నెంచి, తెలివిం గోల్పోయి యాలోకబం
ధువకై పూర్వదిశాంగనా మణికడున్ దూపిల్లఁ బ్రాణేశుఁడే
గెనెటో యంచును జింతఁబద్మినియు భృంగీనిస్వనార్తధ్వనుల్
తనరన్ మోమునుముడ్చె బంధులతిచేల్ త్యాగమింతేగదా!
మనమానందరసాత్మతత్త్వమున ముంపన్ జారచోరాదు లె
ల్లనునంతోషముఁ గాంచఁ జీకటి దెసల్గప్పంగ సాగెన్ పడిన్;
బెనుభూతంబును బోలె నంతటను గప్పెన్నీల జీమూతకాం
తివిభృద్ధీపతి యంతఁ గ్రూరమృగభీతిన్ వృక్షశాఖాంతరం
బునఁ గూర్చుండె సుఖాసనుండగుచు రేపుచ్చంగ; నాలోనెలుం
గును వెన్నాడుచు సింగమొక్కటి మహాక్రూరంబుగా వచ్చె; భీ
తిని రాజున్న విశాలశాఖపయి నెంతే నెక్క నష్టాయెలుం
గును; గ్రిందన్ హరిఘోరగర్జనలతోఁ గూర్చుండెఁ దానా యెలుం
గును నా రాజును గాంచి యిట్లు పలికెన్ "క్షోణీశ! యేహాని నీ
కును నేఁ జేయ నటంచు, రాజును నెలుంగున్నమ్మి యిట్లంచు నెం
చెను భావంబున" వేంకటేశు మహిమల్ చిత్రంబులై యుండు; నా
తని మాహాత్మ్య మెలుంగు వాక్యములచేతన్ స్పష్టమై పొల్చె, నా
కును విశ్వాత్ముఁడనాదిమధ్యలయుఁడక్షోభ్యుండు, భక్తౌఘర
క్షణపారీణుఁడు, వేంకటేశ్వరుఁడె ఋక్షం బిట్లు నా కెట్టి హా 825
నినిగావింప నటంచుఁ దన్మహిమచే నిక్కంబుగా నిట్లు ప
ల్కె" నటంచెంచుచునుండ; ఋక్షమనెయెన్ క్షేమంబుగా శాఖపై
"జననాథా! యొకయింత కూర్కుము మన! రాజన్యుండు కూర్కంగ; నా
తనినిన్ గ్రిందికి ద్రోసె నెల్గు, ముదమందన్ సింహరాజంబు; నం

తను భూమీశుడు కేసరింగని యిటుల్ తాఁబల్కె "నా మాటలన్
వినవోయీ! చెవియొగ్గి యాపదయుని గావింపందగున్ నీకుఁ దో
చిన చందంబున స్వామిపుష్కరిణిలోఁ జిత్తాను మోదంబునన్
జని, స్నానంబొనరించివచ్చి, తనువున్ సత్యంబుగా నీకు న
ర్పణగావించెదనమ్మ" యన్నను మృగేంద్రంబాడెనీరీతి "న
మ్మనె యీ మాటల నెంతవెఱ్ఱియయినన్ భూపాల! నిన్నిప్పుడే
తినినాయాఁకలి దీర్చికొందు, ననః బృథ్వీపుండిటుల్ పల్కె "నీ
తనువుల్ నిత్యమె? వేంకటేశ్వరుని మీఁదన్ నేఁబ్రమాణం బొన
ర్తును, నా మాటను విశ్వసింపు; నినునెంతున్ సింహరూపంబుతో
డను గన్పించెన వేంకటేశుఁడని చేడ్కన్ నా శరీరంబు ని
త్తును నీ" కన్నను: "బోయిరమ్మ" నఁగ నెంతో ప్రీతితో నేగి యా
జన నాథుండును స్వామిపుష్కరిణిలో స్నానంబుగావించి శ్రాం
తిని సంప్రీతినిగాంచి యొద్దునకు నెంతేఁ జేరి తాఁ జూడ వెం
టనె దాఁదోఁపదు సింహరాజమట! స్వాంతంబంత నాశ్చర్యము ం
గనఁగా రాజును వేంకటేశ్వరుని శ్రీకల్యాణరూపంబె గాం
చెను; హస్తంబులు మోడ్చి, భక్తిగదురన్ శ్రీవేంకటేశున్ స్తుతిం
చెను, "సీవేహరిరూపుదాల్చి పరీక్షింపంగ నేతెంచి క్షో
ణిని నాశాచరితంబు శాశ్వతముగా నిల్పంగనైనట్టి త్రో
వను జూపించితి నీ కృపారసమహాపాథోధికంతంబుగ
ల్గునె తండ్రీః" యని మాటరాక యటనాక్షోణీంద్రుఁడున్ నిల్వ; నా
వనజాక్షుండిటు పల్కె నా తనిపయిన్ వాత్సల్యమేపార "నా
యన! ధర్మంబుగ భూమినేలుము త్వదీయంబైన సద్భక్తికిన్
మనమానందము నందె, సర్వశుభముల్ మాఱెందు లేకుండ నీ
కును బ్రాప్తింప నటం" చదృశ్యమగుడున్; క్షోణీశుఁడున్ వేడుకం
దన రాజ్యంబున కేగి; వేంకటనగాధ్యక్షున్ మదింగొల్చుచున్,
మనియెన్; భూప్రజలిచ్చ మెచ్చుచు భజింపన్భక్తి సంయుక్తితోన్;

...o...

మార్కండేయుఁడు వేంకటగిరిని దర్శించుట

ఘనుఁడైనట్టి మృకండుమౌనికిని "మార్కండేయు" నాఖ్యంబు చే
త, నమోఘంబు, నపూర్వమైన వరమున్ దక్ష్యంబుగా మృత్యువే
తనుడాయంగను లేనియట్లుగ నెనాతండేగుదెంచెన్ వృషా
ద్రిని దర్శింపఁగ, దల్లిదండ్రులును "దండ్రీ! పోయిరమ్మం"చునె
మ్మనములో మ్మోదము నందఁగా ననుమతింపన్; వేడుకం బొప్పుచున్
గనె నామౌనిసుతుండు వేదమయునిన్; గల్యాణసంధాయకున్
గనకాద్రిప్రతిమానకాయు, నిజవేగక్షిప్తమేఘవ్రజున్,
వినుతాత్యద్భుత పక్షయుగ్మని, మహావిఖ్యాత చారిత్రునిన్,
వినతానందను మార్గమధ్యమున బృథ్వీదేవతా మౌళితో,
ననె నాకశ్యపసూనుఁ డిక్కరణి" నీవా! వేంకటాద్రిం గనన్
జనుచున్నందుకు మోదమందితిని భూచక్రంబునన్ భక్తులె
ల్లను సేవింపఁగ యోగ్యమిద్ది; కలికాలంబందుఁ బాపంబులన్
ఘనరోగంబులఁ బాయఁజేసి మనుచున్, గల్యాణముల్గూర్చెడున్;
మునులచ్చోటను భక్తియుక్తులగుచున్ మోదంబుతో, వేంకటే
శునిపాదాబ్జయుగార్చనాపరులునౌచున్, నిత్యముల్లాస మొ
ప్పిన, యోగామల దివ్యవాసనలసంప్రీతైక చేతస్కులై
చని, నిత్యంబును స్వామిపుష్కరిణిలో స్నానంబు గావింత్రు, పా
వనమౌ పశ్చిమతీరవాసమునఁ బాపవ్రాతముల్ నాశమం
దును; దద్దక్షిణ భాగమందు వఱలున్గోవిందుడున్ లక్ష్మితో;
గనుమా యిచట వేంకటేశ్వరుని శ్రీకాంతాసమేతున్ భవ 375
జననం బెంతయు సార్థకంబగును గాంచం బొమ్ము పొమ్మంచటన్
వినతానందనుఁ డేగె; నంతమునియుం బ్రీతాత్ముఁడై ముందుకున్
జనియెన్; వైళము స్వామిపుష్కరిణిలో స్నానంబుగావించి, పా

వనతోయంబులఁ గ్రోలి, తృప్తిగని, యాపై నేగి, శ్రీవేంకటే
శుని సేవించెను; సన్నుతించె నిటులన్ శుద్ధాంత రంగంబునన్;
"వనజాతాక్షుఁడ వీవు వేంకటగిరిన్ వాల్లభ్య మొప్పారఁగా
మనుచున్నాఁడవు! దేవదేవ! కనుమా! మా మ్రొక్కులం బ్రీతితోఁ
గొనుమా! నీవె పరాత్పరుండయిన వైకుంఠుండ వంచెంచి, ద
ర్శనభాగ్యంబును గోరి వచ్చితిని, నిన్ సద్భక్తి సేవింప, భ
క్తనికాయంబులు డాయ, దివ్యశుభముల్గల్యాణముల్గల్గు," నం
దనభూమీరుహ పుష్పసౌరభ సమేతంబుల్ మరుత్సంతతుల్,
తనపై వీచెడి భోగమబ్బును, బరంధామంబులో వాసమున్
గనఁగా వచ్చును, నీదయాంచిత కటాక్షంబింతపై సోకఁగన్;
వనుమన్నింపుమ" టన్న మౌనిఁ గని యన్నాఁడిట్లు వెంకన్నయున్
"అనఘా! సన్మునిచంద్ర! తీర్చెదను దీయంబైన నీ కోర్కులన్
వినిపింపంగదె!" యన్న మౌని యనియెన్ విశ్వేశ! నీసేవకం
బెను, నీసృష్టిని గోరఁగాఁ దగిన దున్నే వేఱుగా దేవరా?"
యనుమౌనీంద్రుని వాక్కులన్విని మహాహర్షంబుతోఁ బల్కెని
ట్లనియా శ్రీపతి శ్రీమృకండుసుత! నీదౌ భక్తికిన్ మెచ్చితిన్
జెనకంజాలదు నిన్ను మృత్యువు చిరంజీవిత్వముంగంటి; చె
ప్ప, నశక్యంబగు నీతపోగరిమ జీవన్ముక్తుడైనట్టి నీ
కును నేముండును కోర్కు'లంచు జలజాక్షుండంత నన్మౌనికిన్
గనరాకుండను మాయమయ్యె, నల మార్కండేయుడున్ భక్తి భా
వన హస్తంబులు మోడ్చి వేంకటపతిన్ బ్రార్థించి వేవేగ దా
ఁనియెన్ నైమిషవాటికిన్ మునిజనాంచత్పుణ్య సంపేటికిన్; 900

...o...

మహర్షులు వేంకటగిరిని దర్శించుట

మును లెల్లన్ మును "సత్రయాగమును సమ్మోదమ్ముతో నైమిశం
బున గావించు తఱిన్ బురాణ నిచయంబుల్ చెప్పుచూ తుండు విం
చును; నాలోపల వేంకటేశు మహిమం జోద్యంబుగాఁ దెల్పఁగా
విని, యాకశ్యప, గౌతమాదిమునులు వ్విళ్ళూరుచున్ వేడుకన్
జనిరా వేంకట శైలరాజమును గాంచన్; సూత మౌనీంద్రు వా
క్కును లోనెంచుచు వేంకటేశ్వరు కథాకూపార మగ్నాత్ములా
చును; మధ్యన్ దివిజస్రవంతిని మహర్షుల్ గ్రుంకి, యామీఁద; వే
డ్కను శ్రీ గౌతమి వారిమున్గి, పయినేగన్వచ్చెఁ గోనాళ్లకున్
వినుతింపన్ దగు వేంకటాచలము మౌనివ్రాతమెల్లన్, బ్రద
క్షిణలం జేసిరి; భక్తిభావ గరిమ శ్రీయుక్తులై చేరి, తీ
ర్థనికాయంబుల నోలలాడిరి ; మనోరాగంబు సంధిల్లఁ బెం
పును, సొంపున్ బ్రకటించు నాగిరిని సంపూర్ణ ప్రమోదంబుతో
డను నారోహణఁజేయు చోండోరుల తోడన్దాని మాహాత్మ్యముల్
"గణనాతీతములంచుఁ బల్కుచును సాక్షాత్కారముంగన్న శ్రీ
వనజాతాక్షుని రాజధానియగు నావైకుంఠమో, యంచు వ
ర్ణనగావించుచు, వేంకటేశు "సగుణ బ్రహ్మ స్వరూపుండటం"
చును, భక్తావళి పాలిటంగల, సురక్షోణీరుహంబౌండెఁ గా
దనిసన్ వేఱుపు గిడ్డియుండె వనుచున్ హాళింబ్రసంగించుచున్;
జనియామౌనులు స్వామి పుష్కరిణిలో స్నానంబుఁ గావించి, పా
వనభావాబ్ధి తరంగ డోలికలలోఁ బల్మాఱు లుయ్యాల లూ
గినవానంద సువృష్టిలోఁ దడిసి యాగీర్వాణ వంద్యున్ నిరం
జను, నిత్యున్! బరమాత్ము, విశ్వమయునిన్ సర్వేశు గాంభీర్యసీ
సనిధిన్ గద్గద కంఠులౌచు నిగమార్థ స్ఫూర్తి గేయంబులన్

వినుతిం జేసిన, వేంకటేశ్వరుఁడు ప్రావృట్కాల మేఘంబునాఁ
గనుపించెన్, వినిపించె కంఠరవమున్ గర్జాస్ఫుటిన్; మానులున్ 925
మనమాహ్లాదము లందుచుండఁగ "నమోనారాయణా" యెతిని
స్వనులై జన్మలు ధన్యమైనవని, హస్తద్వంద్వముల్ మోడ్చి ని
ల్చిన, "సాయుజ్యము మీకుఁగల్గు" నని యా శ్రీవేంకటేశుండు స
న్మునులన్ మోదసముద్ర భంగముల యందు న్వేడ్కనోలార్చి, చ
య్యన నాలోన, నదృశ్యమైన: మునులత్యంతంబు, సంతృప్తులౌ
చును, లీలామహనీయ యోగగరిమన్ శుద్ధాంతరంగంబు, ల
ర్పణ గావించిరి వేంకటేశ్వరునకే పాలింప లాలింప నా
తనికే చెల్లు ననల్ప దివ్య మహిమల్, ధన్యత్వ మాన్యత్వముల్,
గొని, ముల్లోకము లేలు స్వామియెగదా! గోవిందుఁడౌ వేంకటే
శునికన్న, న్మఱిలేరు వేలుపులటంచున్; మానులూహించు కొం
చును, వేవేగను నైమిశంబరిగి యచ్చో సూతమౌనీంద్రు ద
ర్శనముం జేసి, తగంగ వేంకట మహాశైలంబు పై వేంకటే
శునిసాక్షాత్కృతిఁ గన్న యట్టి విధమున్ జోద్యంబుగాఁ దెల్ప వా
కొనిరా మానులు నీను సత్కథలు మాకన్నిందుఁ గావించెఁ దీ
యని శ్రీవేంకటనాథు సచ్చరిత, మాయాత్మను మోదంబుఁ గాం
చెను, దత్పాత్రిలు సర్వమూర్తులును మించెన్, నర్తనన్జేసె మా
కనులంగట్టు విధాన మాయెమట, సౌఖ్యంబొప్పనాశ్చర్యమా
చును గన్పట్టె, మదాత్మలన్నియును మెచ్చుల్గుల్కఁగా విన్పుమో
ఘనుఁడా! యేమహనీయ సత్కృపను నీకల్యాణ వాణిన్ సనా
తన మైనట్టి పురాణగాథల మహాతత్త్వంబు దీపించె? స
ఃన విఖ్యాతః కృపా సమేతః సుమనస్సంపూజితా! మానివ
! నవీనామృత సత్కథాకథన విద్యాచాతురీధుర్య! నీ
నుడుల్ నిక్కముఁలయ్యెనం" చనిన సూతుండంత నావ్యాసమౌ

నిని ధ్యానించి! స్తుతించి౹ మానులకనెన్ "నిక్కంబుగా నేను చె
ప్పిన పౌరాణిక గాథలన్నియును నావే౹ నన్నువ్యాసర్షి ని
ల్పెను పౌరాణిక పీఠమందతఁడు పంపెన్ నైమిశారణ్య, మా
ఘను నాజ్ఞందలదాల్చి చెప్పెదఁ బురాగాథల్ సమస్తం"బటం
చును" దెల్పెన్ మునులున్ భజించి రట వ్యాసున్౹ సత్కళోల్లాసునిన్౹

...o...

చోళరాజు చరిత్రము

మనువల్మీకమునందు సూక్ష్మమగు రూపుందాల్చి వర్తించుచుం
డెను శ్రీ వేంకటశైలభర్త,, యతనిన్సేవింప గోరూపముం
గని వాణీశుఁడు, దూడరూపమును శ్రీకంఠుండు పొందెన్ రమా
వనజాతేక్షణ గొల్లభామయయి౹ గోవత్సంబులంగొంచుఁబో
యెను, జోళావనిపాలు నొద్దకును; నాపృథ్వీశుడు 'న్మెచ్చి' యో
వనితా౹ ముద్దులుమూటకట్టు మొదవున్౹వత్సంబు, నాకన్నులన్ 950
దనిపెన్; గోరికగల్గె౹ నావు వెలకాంతా చెప్పుమా! యెంతయై
నను నేనిత్తు" ననంగ "నొక్కవెయి దీనారంబు లి"మ్మన్నఁ జో
ళ, నరేంద్రుండును గోపభామినికి మూల్యంబిచ్చె౹ నారీతి వే
చనె, గోపాంగన వేషమూనిన రమాసాధ్వీలలామంబు; రా
జనిపెన్ ధేనువు నాలమందకును; నాయావున్దగన్నందతో
డను గోపాలురు మేతమేపులకు వేడ్కందోలుకొంచుంజనం
గను౹ శ్రీ వేంకటశైలరాజమున; కాగ్రావంబు నన్జింతచె
ట్టునకుం, గ్రిందనెసంగు పుట్టగల పట్టుంజేరి, యాగోవుచే
సెను నందుంగల వేంకటేశ్వరునకున్ క్షీరాభిషేకంబు; దా
నను సంతోషముగాంచె దేవుఁడిటులే నానాఁడు వర్తించుచుం

దనియుం జేయఁ దొడంగె వేంకటనగాధ్యక్షున్; సదాభక్తర
క్షణదక్షున్! వనజాక్షు! నాసురభి; యాక్ష్మాపాలు దేవేరి తె
మ్మనె నాగోవుపయస్సుఁ బుత్రుకొఱకై; యాదేవి యాజ్ఞంబయ
స్సును బిండంగను జూడఁగాఁ బొదుగు తాశూన్యంబుగాదోఁచె; గో
వునకిట్లేయగుచుండుటన్, బ్రతిదినంబున్; "దీనికింగీలకం
బు, నెఱుంగన్ వలె" నంచు నెంచియట గోపుండొక్కచో మాటునన్
గనుచుండంగను గోవుపుట్టదరికేగన్ గోపుడున్ గుర్తుప
ట్టెను; "క్షీరంబులు రామికిన్ గతముగంటిన్ నేడటం" చుగ్రుఁడౌ
చును "నమ్మ్రకిసుంతువా? యకటరోజున్; రాజువేమూడలం
గొనె, నిన్నంచు" నుగోపవేగమున నా గోపాలుడున్ హస్తమె
త్తెను దాటింపగ వేంకటేశ్వరుఁడు నెంతేసప్తతాళప్రమా
ణ, నితాంతాకృతిఁదోఁప: గోపుఁడు భయానన్ గుండె వ్రీలంగఁ జ
చ్చెను: దద్రూపముఁగాంచి; గోపతతి గాసింజెంది యావింత దె
ల్పెను, రాజేంద్రుని; కంతభూపుడును నావింతంగనన్ జూడఁబో
యెను సేనాళులతోడ; శ్రీశుఁడును దానెంతేని సూక్ష్మాకృతిన్
దనరెన్: గానఁగలేక భూపుఁడట చిత్తక్రోధమూపంగలే
క, నటద్భ్రూకుటియాచుఁ బుట్టఁగని పల్కన్నాగె "నోరోరి! నే
ననెవ్వానిగ నెంచితో మదిని నన్యాయంబుగా గోపబా
లుని జంపంగను, డొక్కచింపిమటి డోలుంగట్టనే? బైటికిం
జనుదేరా!" యన వేంకటేశ్వరుఁడు బాష్పద్రూపుడై సప్తతా
ళ, నితాంతోన్నత దేహుఁడై నిలిచి "కూళా! వ్రేలరా! నీవికన్
గనుపైశాచిక రూపమున్" చనఁగ లోఁగంపించుచున్ భీతితో
ననె రాజేంద్రుఁడు "దేవదేవ! హరి! నేనజ్ఞానినై పల్కితిన్
మనమందూహ యొనర్పఁజాల, కిదినీమాహాత్మ్యమంచేను ద
ష్టాను గావించితి" నన్న రాజుఁగని దేవుండిట్లు వాక్రుచ్చె "గో

పుతుం, విప్రుండును, నేకజాతియగు గోపుండావుఁ బాడింపఁబో
యిన పాపంబునఁగూలె; సర్వసురులున్ హేలాగతిన్ గోవు స
త్తనువందుందురు పాయకుండ వినుమా! దాసుండు పాపంబు చే
సినఁ దత్పాపఫలాంశ మూర్వీపతినిం జెందుంగదా: గాన గో
పుని పాపాంశము నిన్నుఁ జెందుటను శప్తుండవై తివీరీతిగాఁ
గను: శాపంబును దీఱిపోగలదు, మత్కల్యాణముం జేయనం”
చును శాపాంతము దెల్పి, వేంకటగిరీశుండాదరస్వాంతుడై
చనె నంతర్హితుఁడై చు; భూపుఁడు నెదన్ సంధిల్ల మోదంబు వం
దనముల్సేసె సహస్రముల్; పిదప వత్సత్వంబుఁ బాసె న్స్వరుం
డును; గోరూపముఁ బాసె ధాతయును; సంతోషంబుతో వారు శ్రీ
శునికిన్ సన్నుతులన్ఘటింపుమను నచ్చోఁ బాసి: రారాజు వే
డ్కను నాముద్వరకు న్నమస్సులను సత్కల్యాణ మొప్పార జేఁ
సెను: దానచ్చటనుండి యేగెపురికిన్; శ్రీశున్మదింగొల్చుచున్:

...o...

:- వకుళా దేవి చరిత్రము :-

వనజాక్షుండు వరాహరూపమును, నాపై వేంకటేశాకృతిన్ 1000
మనుదాల్చెన్: వరహావతారుఁడగు నంభోజాక్షునిం దొల్త ద
ర్శనముం జేయ నభీప్సితార్థములు సంప్రాప్తించు, నాపైని ద
ర్శనముం జేయుట- లెప్ప, వేంకటమహాగ్రాహాధినాథున్, మనం
బున, నీకట్టడి కెంతయేనియును సమ్మోదంబుతో వేంకటే
శునకిచ్చెన్ జనయిత్రిగాఁగ వకుళ! శుద్ధాంతరంగన్! సతీ
జన సన్మాన్యను: శ్రీవరాహవిభుడు-చత్రీప్రీతిఁ దత్కామినీ
మణియున్ బూర్వజనిన్ యశోదగను జన్మంబంది శ్రీకృష్ణుఁ బెం

చిన గోపాంగనఁ దావరంబుగొనె నా శ్రీకృష్ణుచే భావిజ
న్మను సైతంబు తదీయమాతయయి యుండన్; దాన శ్రీవేంకటే
శునకుం దల్లిగ నుందుభాగ్యముగనెన్; జోద్యంబుగా నీమె బి
డ్డను బోలెంగని వేంకటేశునకు వేడ్కన్ సేవలం జేయుచుం
దును వాంఛింపదు మోక్షమైన; మునులున్, యోగుల్, సురానీకమున్
మనమందచ్చెరు వందు చంద్రువకుళమ్మం గాంచి; యే భావనన్
దను భక్తాళి భజించు దానకిఁ దగన్ దాదోఁచు దేవుండట"
న్న,నుడిన్ సత్యము చేసె నీవకుళ సన్మానంబనూనంబుగన్;

—o—

:- సుధర్మమహారాజు చరిత్రము :-

జననములెన్నొ చన్ఁగమున్ "సువీరుఁడను' రాజన్యుండు భూపాలనం
బును గావించెను; వానిమిత్రుఁడు "సుధర్మం"డాపయిన్ధర్మవ
ర్తనుఁడై రాజ్యము నేలె న్యాయముగ; "నేతన్మాత్రుఁడా? యాతఁడం"
చును బల్కంగఁ బరాక్రమంబునఁ బరక్షోణీశులం గెల్చి; యా
తనికాలంబున, నాల్గుపాదములమీఁదన్నిల్చె ధర్మంబు; మం
దునకేనిన్ మఱి యీతిబాధలవి యెందున్ లేవు రాజ్యాన నెం
దును, లేరెవ్వరి క్షుధార్తు; లాత్మకుల వృత్తుల్ చెల్ల; నిట్లుండఁగాఁ
జనె నారణ్యక రక్షణార్థమయి రాజన్యుం; డరణ్యంబు జం
తు, నికాయంబును జంపిడప్పిగొని యెందున్నీరముం గానకం
త, నటన్ గ్రుమ్మరుచుండఁగాఁ "గపిలతీర్థం"బందుఁ గానంగన 102
య్యెను; దద్వారిని గ్రోలి సంతసముసతో నింపందె; నా తీర్థ వా
రిని నాగాంగన యోర్తు వేడుక జలక్రీడా వినోదంబులం
దనరన్ జూచెను; మారుఁడేసె సుమబాణంబంత నారాజు న

ల్లన నాకాంతను జేరనేగఁ గనుచున్ లజ్జానతాస్యాబ్జయై
యనెనిట్టుల్ "జలకేళిమగ్నయయి యేకాంతంబునందున్న కాం
తను వర్జ్యేసుట నీకుయుక్తమె?" యనన్ 'దన్వీ! భవ దూప, యౌ
వనముల్గాంచిన యంతమారుఁడనిపెన్, భావింపనాకాంగనా
మణివో! నాగకులాంగనా మణివొ? భామా! నేసుధర్మాఖ్యుఁడన్
మనుజాధీశుఁడ! నింకనీ చరితమున్ మాధుర్యధుర్యోక్తులన్
వినిపింపంగదె' యన్న; నామె యనియెన్ "భూభృత్స్వరా! నేనాగక
న్యను నా తండ్రి "ధనంజయుండు" కుల విద్యా శీలరూపోన్నతిన్
గను, రాజన్యునకిచ్చి పెండ్లి జరుపంగానెంచె" నంచాడఁగా!
విని నీచెప్పినయట్టి సద్గుణములన్ విఖ్యాతుఁడన్ జూమ్మ, స
న్మణి శోభిల్లును గాంచనాశ్రయమునన్ గానన్ మనోజాగ్నియే
మనకున్ సాక్షిగఁబెండ్లియాడుదము లేమా! క్షత్రియార్హంబుగా
ఘనతన్నీరు వివాహమున్నదిగదా! "గాంధర్వమం"చింగితం
బును గుర్తించి తదీయకోమలకరంబుంబట్టె; నాకామినిం
గొని భూజాని లతానికుంజములఁ గోర్కుల్మీరఁ గేళికళా
ఘనచాతుర్యము చేతఁదన్పుచుసతిన్, గాలంబు పుచ్చంగ; నా
వనితారత్నమిటాడె "భూమివర! మద్వాంఛందగందీర్చ నీ
కును, నాకున్ జనియించునట్టి సుతు నేక్షోణీపతిం జేయువా
డ" నటంచున్ వరమిమ్మభిజ్ఞ కయి వేడ్కన్నాకు నీ యుంగరం
బునొసంగందగు"నన్న; భూవరుఁడు నాపూబోఁడి నీక్షించి, గ
ర్భిణిగాఁబోల్చి, వరంబు, నుంగరము. సంప్రీతాత్ముఁడై యిచ్చి, యే
గెను రాజ్యంబున; కంతనింతియును నేగెన్ గొంకుచున్ దండ్రినిన్ 1050
గనఁగా నాగజగంబు; సిగ్గును, భయోత్కర్షంబు, సంధిల్లఁగా
జనకుం గాంచివచింప సర్వ; మతఁడున్ సంతుష్టుఁడై పల్కె "నో
తనయా! నీకునునచ్చినట్టి నృపుగాంధర్వంబునం బెండ్లియా

డిన భీతిల్లఁబనేమి? కోర్కె సమకూడెన్ సంతసంబయ్యె, గ
ర్భిణివైనందు" కటంచుఁ భార్యఁ గని. పుత్రీగర్భ సంరక్షణం
బు, నొనర్పన్ నియమించె, నిండఁగ నెలల్ పూబోఁడి గాంచెన్ శచీ
వనితానందనుఁ బోలు సుందర తనుభ్రాజిష్ణురోచిష్ణు శం
ఖ, నిభాంచద్గళు, వారిజాతదళ సంకాశాక్షియుగ్మున్, గుమా
రుని వేడ్కన్ సుముహూర్తమందును; సుధర్ముంగూర్చి పంపించె,
ర్తను వేవేగ ధనంజయాహిపతి. యారాజేంద్రుఁడున్ బ్రీతితోఁ
జనిపాతాళము. క్షత్రియోచితముగా, సంస్కారముల్ చేసి, నం
దన వృద్ధ్యర్థమొనర్చి షోడశ మహాదానంబులన్, సేవికా
జనులంగాన్కల దన్పి, వేడుకమెయిన్, శ్వశ్రూగృహంబందు
డు, నెలల్ వాసము చేసి, యేగుతఱి వీడ్కోలిచ్చుచున్ "మున్వరం
బును నాకూఁతున కిచ్చియుంటి మఱవంబోలేదుగా!" యన్నమా
మను వీక్షించి' నృపాలుఁ డిట్లనియె, "మామా! నే వరంబిచ్చినా
డను, మోమోటమి; ధర్మపత్నిసుతుఁడుండన్ జ్యేష్ఠుఁడౌ వానిఁగా
దని రాజ్యంబును నీదుమన్మనికి నీయన్బాఁడియే! భూజనుల్
ననునిందింపరె?" యంచుఁ బల్కుచనె; నంతన్ రాజపుత్రుండునున్
తనమాతామహగేహమందుఁ బెరిఁగెన్, నానాఁటికిన్ నూత్నయౌ
వనముంగాంచెను; శస్త్ర విద్యలఁగడున్ బ్రావీణ్యముం బొందె;
తిని, శాస్త్రంబుల, ధర్మసంహితల ప్రీతిన్నేర్చె, విద్యాబలం
బును, శస్త్రాస్త్రబలంబు, రూపు వెలయన్ బూర్ణంబుగా నాతఁడున్
ఘనుఁ డెన్నంగల సత్ప్రవర్తనల లోకవ్రాతముల్మెచ్చఁతీ
రున సన్మార్గమునందు మిత్రుఁడన సుశ్లోకంబు నార్జించెఁ ద
జ్జననిం గన్గొని తండ్రిఁ గూర్చి యడుగన్, సాధ్వీలలామంబు తె
ల్పెను సర్వంబును: దండ్రిఁ జూతునని బాలిన్ దల్లిచేఁ దాతచే
తను, నాశీస్సులు పొంది యేగి కనిరాఁన్, దండ్రి నున్మాదంబొప్పఁ జూ

పె, నభిజ్ఞానముగాఁగ నుంగరముఁ బృథ్వీజాని సంతోషముం
గొని, యాలింగన మాచరించి, సభలోఁ గూర్చుండఁ, బర్హాసనం
బును జూపించి, సభాసదుల్వినఁగ "నాపుత్రుండటం" చెల్లవా 1075
రును నాలింప వచించె; నంతటను బుత్రుండిట్లు భాషించె "నో
జనకా! పుత్రుఁడు తండ్రిపజ్జ నివసించన్మేలు, నీసేవలో
మనెదన్; రాజ్యము, గీజ్యమేమి వలదో మాతండ్రి! నీపాదపూ
జను జీవించెద! నేది చెప్పినను విశ్వాసంబుతోఁ జేయువా
డను, నీయాజ్ఞ నొసంగుమా!" యనఁగ, వేడ్కం గాంచి సంతోషపూ
ర్వనధిం దూఁగుచు; పుత్రుసద్వినయ భావస్ఫూర్తి, మూర్తిత్వముం
గని, జ్యేష్ఠుండును, ధార్మికుండు, బితృకాంతావేదియున్ రాజకా
ర్యనయజ్ఞుండును, భావిభూమిపతియౌ నాకాశరాజేంద్రుతో
న నె"సీతమ్మని గారవింపుమిటుపై నత్యంత వాత్సల్యమూ
నిన డెందంబున" నన్న! నాతఁడును నిర్ణిద్రప్రమోదంబుతో
ననుజన్మాగిటఁ జేర్చి దండ్రిఁ గని యిట్లాడెన్ "మహారాజ! నీ
కును మే మిర్వురము కుమారులము; మాకున్ రాజ్యముం బంచియి
చ్చిన, నీమాటను నిల్పుకొన్న విధమున్ సిద్ధించు; నాసోదరుం
డన, నాకున్న మహానురాగ, మదియిట్లావిష్కృతింగాంచు న''
న్నను బుత్రోక్తికి మోదమందె జనకుం "డాహా! బలే" యంచు స
భ్య నికాయంబును మెచ్చె దోఁచెనటులా యాకాశవాణీవచ
స్సును "భూనాయక! యీతఁడెంతయు యశస్సుం గాంచు భక్తుండుగాఁ
గనివిఖ్యాతిని 'దొండమా' ననెడునాఖ్యం గాంచు" నన్మాటలన్
విని సంతోషము నందె; నంతటను పృథ్వీనాథు డుచ్చైస్స్వనం
బున సభ్యుల్ గొనియాడు వాక్యముల మార్మ్రోగెన్ సభామండపం
బును; భూపాలుఁడు పంచె రాజ్యమును దత్పుత్రులు మోదంబందఁగా;
ఫణికన్యాసుతుఁడున్, దదగ్రజుఁడునున్ బాలింపఁగా సాగి రా

ర్య నికాయంబులు మెచ్చ స్వీయధరణీరాజ్యంబు లిట్లుండఁగా;
ఫణికన్యాసుతుఁడొక్కనాఁడుచని నశ్వంబెక్కి వేటాడు కాం
ఛను; శేషాద్రి సమీప కాననము; నిచ్చన్మెచ్చుచున్ బోయిక 1100
న్గొనె, లోకోత్తరయౌ సువర్ణముఖరీ కూలంకషాతీరభూ
మిని; బర్ణంబులు దేహయాత్రగను నెమ్మిన్ జాతివైరంబులె
ల్లను బోఁద్రోసి పరస్పరంబుఁగడు నుల్లాసంబుతోఁ జెల్మితో
మను జంతువ్రజమున్, ధరాపతియు నిమ్మాడ్కిన్ మనంబందు నెం
చె, "నహో! జంతువులిట్టులుండుట గడుంజిత్రం, బనూహ్యంబి దే
మునిలోకేశుని యోగశక్తి మహిమంబోఁ బోయిదర్శింతు" నం
చును గౌతూహల మొప్పనేగి, యొకచోఁ క్షోణీశు డమ్మౌనినా
థునిగాంచె, న్వినయంబు, భక్తియుఁగడుందోఁపన్ సమీపించిచే
సెను సాష్టాంగ నమస్క్రియల్; మునియు నాశీర్వాదముజేసి యా
తనికిందా "శుకమౌని" నంచుఁ దెలిపెన్; ధాత్రీశుఁ"డో వ్యాసనం
దన! యుష్మన్మహనీయ దర్శనమునన్ ధన్యుండనైనాఁడ; నా
జని సాఫల్యము నందె" నన్న మునియున్ క్ష్మాజాని నీక్షించి "భ
క్తిని ధ్యానింపుము వేంకటేశు, నతఁడే ధ్యేయుండటం" చాడ; వీ
డ్కొని యమ్మౌనిని; స్వామిపుష్కరిణిలోఁ గ్రుంకెన్ నృపాలుండు;
క్తిని ధ్యానంబొనరించె; వేంకట, నగాధీశుండు ప్రత్యక్షమై
యనె "నేకాగ్రతతోడఁ జేసితివిపో; ధ్యానంబు నిన్మెచ్చితిన్
మనుజాధీశ్వర! తొండమాం" ననెడు నామంబిప్డుగావించి తిన్.
జనిరాజ్యంబును నేలుకొమ్మ" నఁగ; నాక్ష్మాజాని శ్రీవేంకటే
శునికీర్తించిచనె న్పురంబునకు; నాక్షోణీశుఁ డిట్లుండ: నా
దర్శింపఁగ నొక్కనాఁడు శబరాధ్యక్షుండు తా వచ్చియి
యెన్ "భూవరచంద్ర! వేంకటగిరి ప్రాంతంబునందున్న పు
గన్పించును దివ్యతేజములు; వేడ్కంజూడ రమ్మంచు" నే

గెనరేంద్రుండు కిరాతుఁతోఁ గనియె భక్తిన్ బుట్టలోఁ దేజమున్
బ్రణతుల్ చేయుచుఁ బోసె క్షీరమును నావల్మీక రంధ్రంబునన్
గనియెన్ భూపతి వేంకటేశ్వర మహాకల్యాణమూర్తిన్; ప్రద
క్షిణలర్పించె నమస్కరించె హరికిన్ (శ్రీ) బ్రహ్మరుద్రాదులుం
గనలేనట్టి త్వదీయ రూపమును నేఁ గన్నారఁగా గాంచి నాఁ
డను; నీరూపున కన్నవే తుదిమొదల్? డాయంగ, గానంగ, నీ
ఘనదివ్యాంచిత రూప మేవిధని నేగన్గొంటి? నీలోకముల్
జనియింపంగనుఁ జేయఁ బెంప, మఱిదూరించగల్గు నిన్నెన్నఁ జా
లునె నావాక్కులు? విశ్వమంతయును నీలోనుండు; విశ్వంబునం
దును నీవుందువు; గాననిన్నును మునీంద్రుల్, 'వాసుదేవుం'డటం
చును గీర్తింతురు సర్వసద్గుణ ఖనీ! శ్రీ! విపన్మత్త వా
రణసింహాకృతి' యంచు సన్నుతులొనర్పన్; వేంకటేశుండు మె
చ్చె, నమోఘంబగు భక్తిగల్గ వరమిచ్చెన్; రాజు వేఁడంగ, వ
చ్చె, నరేంద్రుండు స్వకీయ పట్టణము; విచ్చెన్ వృద్ధ సీమంతినీ
జననేత్రంబులు, వేడ్క శీర్షమున సేసల్ సల్లి దీవించి; రా
మనుజేంద్రుండును వేంకటేశ్వరుని శుంభత్పద్మముల్ గొల్చు మన్
మని రాజ్యంబును జేసె భక్తుఁడగుచున్ మాటెందు లేకుండఁగన్;

...o...

ఆ కా శ రా జు చ రి త్ర ము

అనఘుండున్ బుధకీర్తనీయుఁడును నౌ నాకాశరాజేంద్రపా
లన గోమాతలు క్షీరవృద్ధిఁగని క్రాలం జొచ్చె (శ్రీ) వేంకటే
శుని కల్యాణము లాచరించుచుఁ గడున్ శుద్ధాంతరంగంబులన్
మనిరా భూప్రజ లెల్లతావులను శుంభత్కీర్తి రాజిల్ల మం
దునకున్ జారులు చోరు లన్నపలు కెందున్ లేదు; వర్షించుచు

డె, నేలన్ వానలు మూఁడు; పోకకును బుట్టెఁడమ్మో; లేదయ్యో వం
చన; వర్ణాశ్రమధర్మముల్ సతతమున్ సాగెన్ జనస్తుత్యరీ
తిని; లేదయ్యెను వర్ణసంకరము; ధాత్రీజాని యర్థార్థివం
దనభూజంబయి, రాజధానిగను "శ్రీనారాయణాభిఖ్య" ప
ట్టనమొప్పారఁగ రాజ్యమేలె నతిగాఢంబైన సద్భక్తి పెం
పున శ్రీవేంకటశైలనాథు ననయంబున్ గొల్చుచున్ బొల్చె నా 1150
తని సత్పాలన నన్నిరంగములలోఁ దద్రాజ్యమొంతేని వృ
ద్ధిని సాధించెను; గన్నబిడ్డలవలెన్ దీనావనుండౌచు న
మ్మనుజాధీశుఁడు బ్రోచె నెల్లజనులన్ మంతెందు లేకుండ శ
త్రు నికాయంబులఁ బాఱఁద్రోలెను గులవృత్తుల్ చెల్లుచుంటన్ జనుల్
మని రచ్చోటను గూడుగుడ్డలకు నేమాత్రంబు లోటంచు లే
క; నరేంద్రుండును దేవతాయతనముల్ కల్పించుచున్ నిత్యపూ
జనముల్ బాగుగఁ జేయు; భూసురులు మెచ్చంబోరు విద్యాబలం
బున బ్రహ్మన్; సమదారి కుంభిదళనంబుం జేయు సింహంబులం
చును వాసింగని రెల్ల క్షత్రియులు; వైశ్యుల్ న్యాయమార్గంబునన్
ధనమార్జింతురు వర్తకంబులను; సేద్యంబుల్ తగం జేసి దీ
క్షనుబండింతురు చేలు పాదజులుముక్కారున్; గజంబుల్ మహేం
ద్రుని దంతిన్ నిరసించు నశ్వములు మీఱున్ వాయువేగంబు; మే
రు నగంబుల్వలె నొప్పుచుండు రథముల్ రూపింప; గాల్బంటులున్
ఘనవీరుల్; నరపాలు నేలుబడి సాగన్ గొన్ని యేండ్లిట్లు గాఁ
గనఁగా నయ్యెఁ గొఱంత యొండు మదిలో క్ష్మాజానికిన్; వ్యర్థజీ
వనమా సంతతిలేకయున్న; నరయన్ భాగ్యంబు లెన్నెన్నియు
న్నను లాభంబది యేమి? జీవులకు సంతానంబు లేకున్నచో
మనమాహ్లాదమునంద సంతతిఁగనన్ మార్గంబు లేదా?" యటం
చను జింతించుచు నుండ; రాజుకడకున్ క్షోణీసురుండొక్కఁడా

ర్యనుతుండంతట నేగుదెంచి ధరణీంద్రప్రార్థితుండై వచిం
చె; నిటుల్ "మానవనాథ! సంతతికినై చింతింప నీకేటికిన్
జనకక్ష్మాపతిఁబోలె నీవునొకయజ్ఞంబిప్డు కావింప; శ్రీ
శుని కారుణ్యము చేత సంతతిలభించున్ నీకు నిక్కంబుగా"
ననివాక్రుచ్చి మునీంద్రుఁడేఁగుటయు; నాహ్లాదంబుతో యజ్ఞదీ
క్షను బూనెన్ నరపాలుఁడంతటఁగడున్ సంతానవాంఛన్; "సుధీ 1175
జన నిర్ణీత దినంబు నందునను యజ్ఞక్షోణి దున్నింపుమో
జననాథాగ్రణి"! యంచు మంత్రిపలుకన్ సంతుష్టుఁడై బిల్వఁబం
చెను జ్యోతిష్కుల; వారు వచ్చిఫల సంసిద్ధిన్ వెసం గూర్చు చ
క్కని లగ్నంబును జూచి తెల్పి; రటుపై క్ష్మానాథుఁడున్ వారు చె
ప్పినరీతిన్ శుభలగ్నమందు ధరణీ బృందారకుల్ బంధువుల్,
జనులున్, మిత్రులు తోడురాఁగఁ జనియెన్ సంతోషమే పారఁగన్
జని యజ్ఞోర్విని స్వర్ణలాంగలమునన్ క్ష్మాజాని దున్నించుచోఁ
గనఁగానయ్యె. సహస్రపత్రము, పయిన్ గానంగనయ్యెన్, బురా
జని పుణ్యంబునఁ జక్కనైన శిశు; వాశ్చర్యంబుతో నెల్లరున్
వినఁగా నచ్చట నభ్రవాణి యిటులన్వినిపించె రాజేంద్ర! చే
కొనుమా యీ శిశువున్ గుమారికగ నీకుందక్కె నా పద్మవా
సినియంశంబుననైన బిడ్డ'యనుచుం జెప్పంగ మోదంబుఁ గొం
చును భూపాలుఁడు బిడ్డఁగైకొనిచనెన్ శుద్ధాంతమున్; రాణికిన్
వినిపించెన్ సకలంబు; నామెకును జేపెన్ బాలుఁభూపాలుఁడున్
బొనరించెన్ సవనంబు; దక్షిణలతో ముంచెత్తె భూదేవతా
ళిని; "బద్మావతి" యంచుఁ బేరిడియె బాలిన్ బద్మగర్భంబు నం
దనకుం దోఁచుటఁ జేసి యాశిశువు, కొన్నాళ్ళేఁగఁగా గర్భల
క్షణముల్ గన్పడె రాణికిన్; నృపతికిన్ గల్గెన్ బ్రమోదంబు; కాం
చెను బుత్త్రున్ శుభలగ్నమందు; నొనరించెన్ జాతకర్మాదులన్

జనులెన్నన్; "వసుదానుఁడం" చునిడియెన్ క్ష్మాపాలచంద్రుండు పు
త్రునకు న్నామము; "పుత్రిజన్మమున దీఱున్ లేనిచోఁ దీఱనే
ర్చునె యింకొక్కగతిన్ బితౄణ"? మనుచున్ క్షోణీశ్వరుండెంచెఁ ద
ప్పెను పున్నామమటంచు సంతసపడెన్; బెంపొప్ప నా పుత్రికా
మణినిన్. బుత్రవతంసుచెంబెఁగడు బ్రేమన్; షోడశాబ్దాంబుల
ల్లన సాగెన్; సుతునిన్, సుతంగనుచు నుల్లాసంబుఁగాంచెన్ నృపా
గ్రణి; దేవేరియు మోదవార్నిధి తరంగశ్రేణినోలాడఁగన్

...o...

పద్మావతీ సౌందర్యము

తనరన్ నూతన యౌవనోదయము పద్మాకాంత పాదాబ్జముల్
కనియెన్ బల్లవవైభవంబు; కరముల్ కంజాత నాళద్వయం
బును బోలెన్; గళమొప్పె శంఖమువలెన్; బొల్పారె శ్రీకారరీ
తిని వీనుంగవ; నల్లకల్వలగతిన్ దీపించె నున్ జూపు; చ
క్కనదై ముక్కు పొసంగెఁ జంపకపు మొగ్గన్బోలి; దంతాళి గ్రా
లెను వజ్రంబులరేవ; బింబమనజాలెన్ మోవి; వేణీభరం
బెనసెన్ వారిదకాంతి; చంద్రసఖమై యింపారె నెమ్మోము; త
త్తనయారత్నముఁ జూచి తల్లితగుభర్తన్ జూచుటెట్లంచు నెం
చును; "కన్యామణియా! యయోనిజగనీ క్షోణిన్ సరోజంబునం
గనిపించెన్ వచియించె నీయమను సాక్షాల్లక్ష్మియంశంబటం
చును నిక్కంబుగ నభ్రివాణి; మిగులం జోద్యంబుగా నీకుమా
రిని బెండ్లాడఁగ మర్త్యుడర్హుఁడగునే? శ్రీ వేంకటేశుండుగా
వనజాక్షుండవతారమెత్తె; నతఁడీ వామాక్షిఁ బెండ్లాడ వ
చ్చునో! రావచ్చును గూర్మి మీఱజలజాక్షుం; డీమెలక్ష్మ్యంశ్యమౌ
టను, శ్రీ విష్ణుపురాముఁడైనపుడు వేడ్కన్ లక్ష్మియై దేహీ యు

య్యెను, కృష్ణుండుగనైన యప్పుడటులయ్యెన్ భైష్మిగా; వేంకటే
శునిగా నీ యవతార మెత్తఁగద విష్ణుండిప్డు పద్మావతీ
వనితారత్నము లక్ష్మియంశమగుటన్ వాల్లభ్యచేపారనీ
మెను నర్ధాంగిగ స్వీకరించు నతఁడే మేల్మేలనన్ జింతిలన్
బనియేమున్న' దటంచునెంచు నిటులన్ వర్తిల్లుకాలంబునన్!

నారదముని జోస్యము

చనె పద్మావతి యొక్కనాడు సఖులుత్సాహంబుతోఁ గొల్చిరాఁ
గను, నుద్యాన వనంబు; నచ్చటను వేడ్కన్ సంచరింపంగ వ
చ్చెను వృద్ధుండగు బ్రాహ్మణుండొకఁడు; రాజీవాక్షులా వృద్ధునిం
గని హస్తంబులు మోడ్చి మ్రొక్కి యిటకున్ బ్రహ్మదేవచూడామణీ
చను దేరంగతమేమి? తామెవరు? మాభూపాల సత్పుత్రికా
మణి పద్మావతి యీమె, యంచు నెఱిఁగింపన్ జెల్మికత్తెల్, "సఖీ
జనులారా! యెటు లాత్మ నామమును శాస్త్రజ్ఞుండనై యుండి తె
ల్పు, నగున్? శ్రీహరి కీర్తనాపరుఁడనై వర్తింతు; లోకంబులె
ల్లను సంచారము చేయుచుండెదను; సిల్వాంజాలనేనొక్కచో
టున; మీరాసుత మోమునందు దొలుకాడున్ దివ్యతేజంబటం"
చును బద్మావతి హస్తరేఖలను నచ్చోఁ గాంచి యిట్లాడె! "నీ
వనజాతాయత నేత్ర హస్తమున గన్పట్టున్ గనుంగొందు మీ
రు, నివే! చామర మీనరేఖ లెసలారున్; భర్తయా నీమెకున్
వనజాతాక్షుఁడు వేంకటేశ్వరుఁడు నా పల్కద్దితథ్యంబగున్
గనుగొండంచు" నదృశ్య మాటయును నాళంజాక్షు లాశ్చర్యమున్
గన్నుమన్; శ్రీహరి కీర్తనాపరుఁడ, లోకంబుల్సదా సంచరిం
తు, నటంచున్ వచియించెగావునను వృద్ధుండీతఁ డూహింపఁగా
ననుమానం బదియేల నారదుఁడెయౌ, నాతండుఁగాకున్నన
న్యునకేలా యిటులేగుదెంచి, మనకున్ జోస్యంబు చెప్పంగఁ జె

ప్పినవాడిట్టి యదృశ్యమాట యెటులో! వేయేల యా వేంకటే
శునియాంతర్యముఁజెప్పవచ్చెను మునీశుండిట్లు సత్యంబటం
చును; జర్చించుచు; గాంతలేగిరటుపై శుద్ధాంతము న్జేరఁగన్

--o--

-: వసంతము :-

దినముల్ కొన్ని చనన్ వసంతఋతు వేతెంచెన్; బికశ్రేణి "క్కో"
యనుచుంగూసెను బంచమస్వరమునన్; "హా"యంచుబాంధాళి మా
ర్ఛనుమున్గన్; ద్రుమముఁలున్సమాన్వితములై రాజిల్లెః రోలంబముల్
తనివారన్ మధుపానముల్సలిపి మొత్తంబై విహారంబుచే
సెను; ఝుంఝుమ్మని గానముల్సలుపుచున్; జెట్లన్ ఖగవ్రాతముల్
తినజొచ్చెన్ ఫలరాజి; తెమ్మెరలువీ తెంచెన్ః లతల్ పువ్వులం;
గనువిందయ్యెను సర్వమాప్రకృతి యుంగన్పట్టె నూత్నద్యుతిన్, 1250
వనితల్ మల్లెలు కొప్పులో దురిమి శోభల్మీర వర్తింపఁగా
దినముల్కొన్ని వసంతమందుఁగడచెన్ దేదీప్యమానంబుఁగాన్;

...o...

-: వేంకటేశ్వరుని పద్మావతి చూచుట :-

చనె పద్మావతి యొక్కనాడు మధుమాసంబందు నుద్యాన శో
భనువీక్షింపసఖీసమేతముగ; నావామాక్షులుం గోకిల
స్వనముల్, వించును పుష్పముల్ గనుచుముచ్చట్లాడుచున్ః వేడ్కమీ
అనుబుష్పాపచయుం బొనర్చుచును; గీరవ్రాతసల్లాపముల్
వినుచున్, బాడుచు నందునున్న సరసిన్ వేచేరి నీటన్ గుబా
ళునవొక్కుమ్మడిదూకి యీది, బిసవల్లుల్ దున్ని, యాపైని లో

మునుఁ గంబాఱుచు లేచుచున్, మునుఁగుచున్, బూఁబోఁడులీకేళి చే
ర్చిన యుత్సాహముతోడనప్పుడు జలక్రీడా వినోదంబునన్
దనివాఱంగను బ్రొద్దుపుచ్చి జలమధ్యంబున్ దగన్వీడి, యొ
డ్డునకేతెంచి చనంగ నచ్చటికి నెట్టుల్వచ్చెనో యొక్కవా
రణరాజంబదివచ్చి వారుచను మార్గంబున్ నిరోధించి, భీ
షణఘీంకారముఁజేయఁగాంతలు భయస్వాంతంబునంగూయుచు; వా
రిని "భీతిల్లకుఁడం"చు వచ్చి మదవారింద్రాలు నాదంతి నా
థుని నొక్కండటఁ బాఱఁద్రోలఁగ బడంతుల్ సంతసంబంది; "యో
యనఘా! కాచితి రీరువచ్చి కరుణన్ బ్రాణంబులన్ మీకు వం
దనముల్. మీదగు నామమేమి? నిలయస్థానంబు తానెద్ది! యీ
వనజాతాయతనేత్ర! రాజసుతయా పద్మావతీదేవి" యం
చును జెప్పన్విని; యాతఁడిట్లనియె; "నీక్షోణిన్ ననున్ వేయి పే
ర్లను బేర్కొందురు; మాఱు పేరులను బిల్వంజూచువారుంద్రు; నా
కును వాసస్థలమిద్దియంచు నెటువాక్రుత్తున్!; సమస్తంబు నం
దును నేనుందు" నటంచుఁ బల్కె; మఱియున్ దోడ్తోడ నిట్లాడె "నే
ననఁగా నొంటరివాఁడ, మీ సఖిని నెయ్యంబార వీక్షించి నం
తనె యీయొంటరి జీవితంబు కడురోఁతంగూర్చెనం" చాలతాం
గిని వీక్షింపఁగ; స్వేదకంపములు కల్గెన్, మోముపంచెన్; సఖుల్ 127
కని, పద్మావతినింగితం బెఱిఁగి భూకాంతుండు కోపించునో!
యనుచున్ భీతిలి కాలయాపనము చేయన్ దల్లికోపించుఁ గా
వున వేవేగము పోద మంతిపురమో పూఁబోఁడి! యం" చామెఁ గొం
చును నేగన్; మిషపెట్టి యాతనిని గంచున్ బోయెనంతఃపురం
బునకున్; వచ్చిన వేంకటేశ్వరుఁడు నాముగ్ధామనో భావమున్
గని యంతర్హితుఁడయ్యె; నెంతయు మనఃకంజంబురంజిల్లఁగన్;
జని పద్మావతి యిట్లు మానసములోఁ జర్చించె నీవచ్చి న

ట్టి, నరేంద్రాగ్రణి వేంకటేశ్వరుఁడు! కాఁడే సీతనింజూడ నా
మనమేలా యటులాఁగె? నప్పగిది నామం బేమియుంచాడఁ ద
న్నను వేనామములన్ వచింతురనె! యెందుం దాగలఁడంచుఁ జె
ప్పెను సందేహముఁ గల్గుచోటను మనంబే సత్ప్రమాణం బటం
చును వాక్కుత్తును పెద్దలెందులకిట్టుల్ శోధింప నాతండె వై
నను నా తండ్రిని గోరఁబంపు; శివుఁడానాఁ డంబికన్ గోరి స
న్మానులం బంపె, హిమాద్రిరాజు కడ కన్నచ్చెన్ జెప్పఁగా మున్ను విం
టిని సేవించెద నేఁటినుండియు భవానీభర్గులన్ భక్తి న
వ్వనజాతాక్షుని భర్త జేయుఁడనుచున్; వైదర్భియు న్నాఁడు కృ
ష్ణునికై కొల్చె, నుమామహేశులనె నేను న్వేంకటేశార్థమై
మనసేకాగ్రిము చేసి కొల్చెదను శుంభద్భక్తి సంయుక్తి నం
చును భావించి వహించె దీక్షఁ గడు సంశుద్ధాంతరంగంబునన్

...o...

:- వేంకటేశ్వరుని చింత :-

తన ధామంబునకేగి వేంకటనగాధ్యక్షుండు పద్మాఃశ్రీ
వనితారత్నము దివ్యరూపమెడఁదన్ భావించు, నంతఃపురం
బునకుం బోవుచు, వెన్కకుం గనిన యూహాల్పించి యాకాంతయున్
దనుఁ బ్రేమించు నటంచు నెంచి తనియున్ దద్ధ్యాన మగ్నాత్ముఁడై
ఘనచింతా జలరాశిలోపల మునుంగంబాఱుచుండంగఁ బు
త్త్రినిరీతిన్ వకుళాంబ యారసి యిటుల్ రూపించె నేహేతువో! 1360
తను వెంతో కృశియించె జెక్కిళులపై ధావళ్యమేపారె; నే
పని చేయంగను నుత్సహింపఁ డిపి సంభావింపఁగాఁ బ్రేమల
క్షణముల్ గాఁగనుపించు, నీతని మనస్సద్మంబులోఁ దష్టవే
సినకాంతామణి యెవ్వరో! యనుచుఁ దా శ్రీవేంకటేశుం గనుం

గొని యిట్లాడెను "నాయనా! యెదిరియొ నీకుంజింత పాటిల్లఁ ద
ల్లిని నాయొద్దను దాచ నేమిటికి? నేలీలావతింజూచి నీ
మనసర్పించితో! చెప్పుమిట్టులుకృశింపన్ నే సహింపంగ నే
ర్తునె? యేతల్లి సహింపఁగల్గు నిటు పుత్రుల్ చిక్కి శల్యంబులై
నను; గన్యామణి నామధేయమును, దన్మాతాపితల్ పేరులున్
వినిపింపన్, జననీకుఁ బెండిలిని గావింతున్! సరే! నీకు న
చ్చిన దన్నప్పుడె యాలతాంగిమణి నచ్చెన్ నాకనన్ వేంకటా
ద్రినివాసుండిటు పల్కెనంత "జనయిత్రీ! తల్లిగా కింక భూ
మిని నిస్స్వార్థముతోడ బిడ్డలను ప్రేమింపంగ నే జీవియుం
డును? నీవైతివి తల్లిగా నిపుడు నన్నున్ సాక; నేనెంత వాఁ
డనొ కావచ్చునుగాని, తల్లికిని బిడ్డన్ గాక యింకేమి యా
దును? బిడ్డల్ తమపెండ్లి చేయుమని యెంతున్ నోటితో నందురే!
యనినన్ లోకము నవ్వదా? తగదు చేయన్ వేరికైనన్ సరే
వినుమా! లోకవిరుద్ధకార్యముల నావేశంబుతోఁ బోపటిన్
నను నీవేయడుగన్ వలెన్; జననిగానన్ నేనుగాఁ జెప్పనై
తిని; నీవిప్పుడు పృచ్ఛ చేసితివి, నాతీరున్ విలోకించి కా
వున వాకుచ్చెద నేనెవండనని; దేవుండఁ జుమా! నీవు న
న్గను చున్నావొక బిడ్డపోలికనె యిన్నాళ్లున్ మనంబందుఁ గా
యని వాత్సల్యముతోడ నామనసులో నాకాశరాజేంద్రు నం
దన పద్మావతి నిండియున్నయది; యాతన్వంగి చారిత్రమున్ 133
వినిపింతున్ వకుళమ్మ! యన్నుమ్మ! విను మవ్వేళన్ బ్రమోదంబునన్

...o...

శ్రీ వేంకటేశ్వరుని పూర్వ చరిత్రము

మును త్రేతాయుగమందు దాశరథినై భూలోకమందల్లు దా
మునిగా నేనవతారమెత్తి నతజిన్ భూపుత్రి గొంపోవ వ

చ్చును లంకేశుఁడు రావణాసురుఁడటంచున్ ముందుగా నగ్నిలో
నునుపం గోరితి సీత; వేదవతి తానుండెన్ సురారాతి చా
వునకుం గారణమౌటకందు సరిగా భూపుత్రి రూపంబుతో;
ననలుండామె నొసంగి యామెఁగొనె మాయాసీతఁగైకొంచుఁ బో
యెను పౌలస్త్యుఁడు లంక; కాకిటుకు నూహింపంగలేమిన్, రణం
బున నారావణుఁజంపి శుద్ధిమిషతో భూపుత్రిగా నున్న య
వ్వనితన్ బావకమందు దూకుమన నవ్వామాక్షియట్లే యొన
ర్చెను; సీతాకృతు లగ్నినుండి వెడలెన్ రెండప్డు చిత్రంబుగా;
జనకక్ష్మావరుపుత్రి, వేదవతి, యాచందంబునన్ దోఁచి రే
మన నీరీతి సమస్య వచ్చిపడె; నేనా యేకపత్నీవ్రతుం
డను, రాఁబోవు కలిన్ లభించెదవు వేడ్కన్నీవు నాకాశ రా
జునకు న్నాగటి చాలునం; దతఁడు పెంచున్నిన్ను; నేనత్తఱిన్
వనితారత్నమ! వేంకటేశుఁడనఁగా వర్తింతు, నేస్వీకరిం
తును నిన్ భార్యగ నంటె వేదవతి నన్నుం బెండ్లి యాడంగ బు
ట్టెను బద్మావతిగాఁ దపంబిటులు పండెన్ నీవు నారాయణా
ఖ్యను దీపించెడు పట్టణంబరిగి యయ్యాకాశరాజేంద్రునిం
గని పద్మావతి నీయవేఁడు, రథమున్గల్పించెదన్; రేపు ప్రా
ద్దుననే పోవలె మార్గమధ్యమున యందున్ శంభుదేవాలయం
బునఁ బూజన్నొనర్చి పొమ్ము, జయమబ్బున్ దల్లి!" యంచాడఁగా
విని మోదంబునుగాంచి యవ్వకుళయున్ వేడ్కన్ వచించెన్ "కుమా
ర! నినుం బెండ్లికుమారుగాఁ గన శుభారంభంబు గావింతుఁ గా
వున నిశ్చింతగ నుండుమంచుఁ జనె నప్పూఁబోఁడి సంతృప్తితో.;
దిననాథోదయమయ్యెఁ బుల్గు బులుఁగెత్తెన్ లోకముల్మేల్కనెన్
వనజమ్ముల్ తమి పెంపుసొంపుఁగనెఁ దాపద్మప్రియుంజూచి తీ
యని రాగంబున లోకబాంధవునకై యర్పించి రర్ఘ్యంబు మిం

చిన భక్త్యంజలితో ద్విజోత్తములు; తోఁచెన్ స్యందనంబొండు చ
య్యన నెక్కెన్ వకుళమ్మ కౌతుకముతో నాకాశ రాజేంద్రునం
దన నిమ్మించును వేంకటేశుకొఱకై తావేఁడఁగా స్యందనం
బును సాగెన్ వడిమీఱ; నవ్వకుళ సమ్మోదంబు నందందగన్
గననయ్యెన్ గపిలాఖ్య తీర్థ; మటుపైఁ గానంగనయ్యెన్ ప్రభా
వ, నిదానంబు శుకాశ్రమంబు; శుకు శుంభద్భక్తి సేవించె; సా
గెను బైపైకి; నగస్థ్వమానిఁ గని సాగెన్; ముందుకుం బోవఁగాఁ
గనఁగా వచ్చె శివాలయంబు నెమటన్ ఘంటాధ్వనుల్ వించు న
వ్వనితా రత్నము డిగ్గియేగె గుడికిన్ భక్తిన్ మహేశార్చనం
బు నొనర్పన్ గనువిందుఁగూర్చె నటనంభోజాక్షి యెక్కుర్తు భ
క్తి, నుమాశంకర పూజసేయుచును లక్ష్మీదేవికిన్ మాఱురూ
పనిపించెన్; వకుళమ్మ మానసము నందానందముం జెంది యి
ట్లనె నచ్చోఁ గల చెల్మికత్తెలకు; "నీ యబ్జాక్షి యేభూమి పా
లునకుం గూఁతురో! యక్షరంబులెవి యీలోలాక్షి నామంబుగా
వినుతింగాంచిన భాగ్యముం గనియెనో! వీనుల్ వినంగోరు నా
య్యనఁ దెల్పుండన; నిట్లుగా ననిరి యయ్యాకాశ రాజేంద్రుఁ డీ
వనజాతాక్షిని బెంచె; భూసుతగఁ జూపట్టంగ శ్రీ వేంకటా
వనిభృన్నాథు నిజేశుఁగాఁ బడయ సద్భక్తిన్ సదా చేయుఁ బూ
జన, లయ్యాదిమ దంపతుల్ తనియఁగా! శర్వాణియీ కాంత కో
ర్కెని నెన్నండొడఁ గూర్చునో! యనఁగఁ గోర్కెందీర్చునా భూమిభృ
త్తనయా రత్నము శంకయేటికిని బొందన్; నేను నాకాశరా
జును జూడంగనుఁ బోవుచుంటిని, మహేశున్ గొల్చిపోవంగ వ
చ్చు, నటంచున్ గుడిఁ బొచ్చి యిచ్చటను మీక్షోణీశుపుత్రింగనుం
గొని సంతుష్టిని బొందితిన్; గలిగె నాకున్ తీర్థమున్, స్వార్థమున్

జనుదెంతున్ మిముఁగూడి" యంచునటఁ బూజన్ బూర్తిగావించియే
గెను బద్మావతి తోడుతన్ వకుళ: సాగెన్ స్యందనంబున్ వడిన్.

****

ఎ ఱు క ల సా ని సో ది

జననిం బంపియు వేంకటేశుఁడు మనోజ్ఞాతంబు కంపింపఁ బూ
నెను లోకాద్భుత రీతితో "నెఱుకు సానింబోలు రూపంబు; చ
య్యన నారాయణ పట్టణం బరిగి యందంతః పురఃప్రాంత మం
దును నిల్చెన్; జెలికత్తియల్ గనుచు నిందున్ రమ్మటంచాడఁగాఁ
జనె; నాకాశ నరేంద్రు రాణికడ; కా చంద్రాస్యయుం బుత్రికన్
దన సాన్నిధ్యము చేరరాఁ బిలిచి యాతన్వంగికిన్ జెప్పసో
దె, నటం దున్ వచియింపఁ జెప్పెదను సందేహంబు లేకుండనే;
ననఁగాఁ జేతులు చూచి సోదెయని యల్లానిట్టులానంచుఁ దోఁ
చిన దేవో వచియించు దానననిమీ చిత్తంబు నందెంతురో!
కనఁగా శక్యముఁగాదు నా మహిమ, శ్రీకల్యాణికిన్సోదె నే
నును విన్పించితి; గౌరి దేవికిని నేనున్ విన్పితిన్; వాణి చెం
తను విన్పించితి; సర్వలోకములలోఁ దన్వంగులున్ నాదు సో
దెను విన్నారు; విచిత్ర చిత్రగతులా దివ్యోత్తముల్ నాదు సో
దెను సంతోషముతోడుతన్విని సందేహంబులన్ బాసిరీ
వనితా వృత్తము కంటిముందటను గన్పట్టున్ వచింపంగ నే
ర్తును సర్వంబును బూసగ్రుచ్చినయటుల్; దున్నంగ యజ్ఞార్థమై
కనిపించెన్ భువియందుఁ బద్మమున నీ కాంతాశిరోరత్న మీ
మనుజాధీశుని ముందటన్; శిశువుగా మన్నించియో రాజ్ఞి! నీ
తనయారత్నము గాఁగఁ బెంచితివి పద్మానామ ధేయంబుతో;
జనె నుద్యానవనీ విహారమునకున్ జాలల్ తనుంగొల్వనా

మిని కాలంబున; దంతియొక్కటి యసామాన్యంబుగా దోప; మా
నినులంగాచెను బూరుషుండొకఁడు; వానిఁజూచి మోహించె నీ
వనజాతేక్షణ; యాతఁడీమెపయినిన్ బాళింగనెన్; గన్న యా
తని నెవ్వాఁడో యటంచు నెంచె నతఁడే తన్వంగి! నీ పుత్రికా
మణి వాంఛించెడు వేంకటేశ్వరుఁడు; నామాటల్ తగన్ నమ్ము మం
చును గాన్కల్గొని పోదెకత్తె చన నాక్షోణీశువర్ధాంగియున్
దనయుం గన్గొని పోదెకత్తె నుడి తథ్యంబానె! సంకోచముం
గనకుండన్ నిజముప్వచింపఁగదె యోకల్యాణి! గోప్యంబులుం
డునె యేకాంతునకై నఁదల్లికడ! నన్నుం గ్లేశ పెట్టంగఁ జె
ల్లునె! యుద్యాన వనప్రదేశమునసో లోలాక్షి నిక్కంబుఁగా
గనినావా! యొక పూరుషున్! నిజముగాఁగన్నావె! మోహంబు! నా
కును వ్రాకువ్వక యేలదాచితివి! సరే! కుందంగ నింకేల? య
మ్మనుజాధీశుఁడె వేంకటేశుఁడని యిమ్మాడ్కిన్ వచింపంగదా!
మనకుస్వేడ్కను పోదెకత్తె; యిఁకనే మాడ్కిన్ వారింగూర్చునో
నని చింతాకులమయ్యె మానస మటంచాకాశరాజేంద్రుతోఁ
దనయాంతర్గముఁగూర్చి చెప్ప నలకుద్యత్ప్రీతితోఁ జేరవ
చ్చెను ప్రేమన్ వకుళమ్మ! యీమెకలిసెన్ శ్రీకంఠుదేవాలయం
బున; నాకాశనరేంద్రుఁ జూచుటకె యీపూఁబోఁడి యేతెంచు చుం
టి" నన దోడ్కొని వచ్చెనా మనఁగ; బోఁటింగాంచి రాజేంద్రుఁ డి
ట్లనె! "నీవెవ్వరవమ్మ! నిన్నుఁగన నాహ్లాదంబు నాకేటికో
మనమందుద్భవ మందుచున్నది; వచింపన్వాదు నీవృత్త" మ
న్నను; "నన్నున్ వకుళమ్మ యందురు, నినుంగానంగ నేతెంచితిన్
వినుమా! తల్లిని వేంకటేశ్వరునకున్ బృథ్వీశ! సందేహము
న్ననఁగాఁబోకు, మనాదిమధ్యలయుఁడౌ నారాయణుం డేడ? యా
తనికిందల్లియ దేడ? యంచను యశోదం బూర్వజన్మంబు న

దును శ్రీకృష్ణుని బెంచియుంటి; భువియందుం బుట్టితిన్ వేంకటే
శునకుం దల్లిగ సాకుచోరిక నటంచుం దెల్పె నాతండె కృ
ష్ణునకుం బెండిలిచేయలేదతఁడు నన్నుస్వేడె; నేనొక్క పెం
డ్లిని గాంచంప యశోదగా నిపుడు పండెన్నాదు భాగ్యంబు పెం
డ్లిని గావింతును వేంకటేశ్వరునకున్ సిపుత్రి పద్మావతీ
వనజాతాయతనేత్రితోఁడ"నని తాత్పర్యంబు దీపింప ని
న్నును దర్శింపఁగ వచ్చితిన్; హరియనంతుండాద్యుఁడాతండు నీ
కును దెల్లంబు త్రిమూర్తులందునను వైకుంతుండు లోకస్థితిన్
దనకార్యంబుగఁగొన్న వాడనుచు నానారూపముల్ దాల్చి, దు
ష్టనికాయంబులఁగూల్చి, భక్తులకు రక్షంగూర్చువాఁడంచు దా
ల్చె, నతండే యవతారమిట్లుకలిలో శ్రీవేంకటేశాఖ్యతోఁ
గనుకన్ నీసుత వేంకటేశున కొసంగం జెల్లు; నీ భాగ్యమే
మనఁగా! విష్ణువునకు నల్లుఁడగు; సామాన్యంబె; నీవాసము
ద్రునకున్ సాటిగ నౌదువన్న; మదియందుంబొంగియాకాశరా
జవిభున్ వార్త బృహస్పతింబిలువఁగా; బ్రహ్మనాథు జూడంగ వ
చ్చె, నతండున్; ధరణీశుఁడాతని సుఖాసీనున్ విలోకించి తె
ల్పెను సర్వంబు; గురుండు సమ్మతిని దెల్పెన్; శ్రీనుకుం బిల్వబం
చిన నాతండు వివాహమున్ జరుపు వాసిన్ బిల్వఁగాఁ బంపు మా
లెనినన్నన్; దగువారినంప నతఁడున్ దావచ్చె రాజేంద్రుచే
వివి తద్వృత్తము సంతసించి యనియెన్ "బృథ్వీశ! నీ నిర్ణయం
బునకు న్సమ్మతి మామవాడువిపుడంభోజాక్షుఁడా వేంకటే
శునకే! పందియమేల? గారికిని వచ్చున్ సాటి నీపుత్రి; నీ
పుడు శ్రీశాద్రికి సాటివాదు; వలయంభోజాక్షుఁడన్నన్, శివుం
డనినన్ భేదములేదు తత్వమున" నంచాడంగ నాకాశరా
జనె "మీరల్ శుభ లగ్నముంగనుఁడు, చేయన్వచ్చుఁగల్యాణ" మా

న్నను, లగ్నంబును గట్టి రాగురు, శుకుల్ నందాత్మజై మాటవెం
టనె వ్రాయన్శుభలేఖ నందుకొని గంటంబూని యీరీతి వ్రా
సెను రాజానుమతిన్ బృహస్పతి శుకర్షిశ్రేష్ఠుడై సొంపొం
గను "శ్రీ వేంకటశైలవాసునకు లోకస్థాన రక్షాకళా
కనదుత్సాహునకున్ బరాత్పరునకున్ గారుణ్యపాథోధికిన్
గుణికిన్ నిర్గుణికిన్ రమావరునకున్ ఘోరామరారాతి జీ
వన సర్వస్వ నిరాకరిష్ణునకు శుంభత్ప్రాభవాలంకరి
ష్ణునకున్ జిష్ణునకున్ సహిష్ణునకు రాచూలిన్ మదీయాత్మజా
తను బద్మావతి సర్వసద్గుణవతిన్ దన్వీశిరోరత్నమున్
జనకోర్వీవర పుత్రికా సదృశ నస్మద్గేహ సంవర్ధితన్
మనమాహ్లాదము నొందఁగా నొసఁగి కన్యాదానముం జేయ, స
న్మునివర్యుల్ తగ నిశ్చయించిరి కడున్మోదంబుతో, బంధు, మి
త్ర, నికాయంబులతోఁ గుటుంబములతో, రాఁగోరుచున్నార మం
చును నర్థంబు నొసంగు చందమున హెచ్చుందగ్గు లేకుండ, ఁజ
క్కని ముత్యంబుల బోలు నక్కరముల న్గల్పించి కల్యాణపున్
దినము, న్బెండ్లిముహూర్తపు న్గడియలున్, దెల్లంబుఁగాఁజేర్చి, యి
చ్చిన నాకాశనరేంద్రుఁ డంతటను జేసెన్ వ్రాలు; తద్రీతిగాఁ
గ, ననేకంబులు పత్రముల్ విరచనంగా వింపఁగా లేఖకా
ళిని వేగన్నియమింప, వారలును నట్లే పత్రముల్ వ్రాసి, రం
తను భూజానియు, శ్రీశుకున్, వకుళతోఁ దద్వేంకటేశుంగనం
గను, బంపించెను, బెండ్లిపత్రమిడి వేడ్కన్; వారు శ్రీ వేంకటే
శుని గానంజని రానరేంద్రుఁడనుపన్ క్షోణీధ్రమున్ డాయఁగాన్;
తన తల్లింగని వేంకటేశుఁడనె" మాతా పెండ్లికేరీతిగా
ధనమబ్బున్? ఋణమిచ్చు నెవ్వఁడన: శ్రీ తత్స్వామికిన్ భర్తవై
ధనమే లేదనవచ్చునే యనఁగ శ్రీ తన్వంగి ద్రవ్యంబుసేఁ

గోనఁగాఁజెల్లునె? స్త్రీ ధనంబుఁ దగునే గోరంగ నెట్లాను భా
ర్యను నా పెండ్లికి ద్రవ్యమిమ్మనుచు ధర్మంబౌనె, నీకున్ సప
త్నిని దెత్తున్ ధనమిమ్ము పెండ్లికినసన్, నేనెవ్వరింగోరుదున్
ఋణ? మన్నన్; జనియా పరావావిభుతో వృత్తాంతముం దెల్పఁజ
య్యనఁ దానావకుళమ్మ యాతఁడనెఁ గల్యాణంబుఁ గావింపఁగా
ధనదుండిచ్చును ద్రవ్యమేల భయమందన్ బెండ్లి కార్యంబు లె
ల్లను గావింతురు సర్వదేవతలు నుల్లాసంబుతో నంచుఁ దె
ల్పెను; దెచ్చెన్ ధనదుండు శ్రీపతికి సంప్రీతిన్ ధనంబెల్ల నో
వనజాతాక్ష! ఋణంబుఁ గావలెనె? శ్రీ పద్మావతీ ప్రాణనా
ధునికే యప్పట! యెంత వింతయని సంతోషంబుతో నేగ బా
ళిని నాహ్వానము లంపఁగా గరుడుఁ బిల్చెన్ వేంకటేశుండు చె
ప్పె, నిటుల్ ప్రీతిని, సత్యలోకమునకున్ వేవేగి యా బ్రహ్మ దే
వుని వాణీసహితంబుగాఁదరలి సంపూర్ణానురాగంబుతో
డను నా పెండ్లినిజూడ రమ్మనుము; వేడ్కం బోయి యా చెప్పఁబో
వు, ననేకామరపాళిఁ బిల్వవలెయుం బో! బిమ్మటన్ బాకవై
రిని బౌలోమి సమేతుఁ బిల్చు భుజగారీ; పైని నాహవ్యవా
హానునిన్, బిల్వుము, ముఖ్యుఁడాతఁడగు స్వాహా దేవితోఁగూడ ర
మ్మనుమా! యాపయినిన్ గుబేరుఁగడు నమ్మానంబుతోఁబిల్వు; మా
యనయే పెండ్లికొసంగె నాకు ఋణ మత్యంతంబు పైనేగి, య
య్యనిలున్ బిల్వుము, ధర్మరాజు మరిక్రవ్యాదున్, బ్రచేతున్ దగన్
జను దెమ్మంచు వచింపుమయ్య! మిగులన్ సౌహార్ద మొప్పారఁ గ్ర
న్నన నాదిత్యుల, యక్షకిన్నరుల, గంధర్వాళిఁ బిల్వం దగున్;
వినుమా యింకను సిద్ధ, సాధ్యులను విశ్వేదేవ నాసత్యులన్,
ఘన విద్యాధర వారమున్, వసువులం, గల్యాణముం జూడ ర
మ్మనుమా? మీదట నప్సరోగణములన్ హ్లాదంబుతోఁబిల్వుమా!

వినుమా! వారలలోన నూర్వశిని మున్బిల్వన్వలెన్, బిమ్మటన్
జని రంభ, న్హరిణి, న్దిలోత్తమను, విశ్వాసిన్, ఘృతాచిన్శుభా
ననసున్ మేనక చంద్రరేఖను మఱిన్బ్రమ్లోచ లోనైన స్వ
ర్వనితా రత్నములన్ వివాహమున కాహ్వానింపుమా, యంచుఁ బం
పెను; నా మీఁదట వేంకటేశ్వరుఁడు చెప్పెన్ శేష! భూభార ధా
రణ పారీణ! సుపర్ణు నంపితిఁగదా! బ్రహ్మాదులా నూర్ధ్వలో
క, నివాసుల్ చనుదెంచు నట్లుగను, నాకల్యాణ వార్తం దగన్
వినిపింపంగ, నధో జగత్తునను నీవె వార్తలందింపఁజా
లిన ధీశాలివి, నీ నివాసమది బాళింబోయి కళ్యాణ వా
ర్తను భోగీంద్రులకెల్లఁ దెల్పవలె నుద్యత్ప్రీతిఁ బెండ్లింగనన్;
జను దెమ్మంచును బిల్వ వాసుకి నుదంచత్ప్రీతితో నేగి ర
మ్మని పిల్వన్వలె సర్పరాజతఁడు సుమ్మా! పొమ్మ! రమ్మా! వెసన్
ఫణిరాజేంద్ర! యటంచు శేషునటకు న్బంపించెఁ దానేగి పి
ల్చెను శంభు న్సకుటుంబుఁడై సరిగ విచ్చేయంగ నవ్వేళకున్;
మనుజేంద్రుండును విశ్వకర్మను దగన్ మన్నించి" నిర్మింపుమా
ఘన శిల్పీంద్ర! యనూహ్యరీతి, నతిలోకంబౌచు దీపించు ప
ట్టణమున్ నీదగు ప్రజ్ఞఁజూపి" యని యాడన్ విశ్వకర్ముండు క
ల్పనఁ గావించెను గోరినట్టులుగ; నాపై వేంకటోర్వీ ధవుం
బును దీర్చెన్ గిరిదుర్గ మట్లు బళిరా! మున్ద్వారకా పట్టణం
బును నిర్మించితి, ద్వాపరంబునను సమ్మోదమ్ముతో నిప్పుడీ
పని గావించితి నంచు నెంతయును భూపాలుండు శిల్పీంద్రు మె
చ్చెను; నారాయణ పట్టణం బతిశయించెన్ భూతలస్వర్గమై;
చనె వైశాఖపు మాసమందు సితపక్షంబందుఁ గాలక్రమం
బున మున్నాళ్లులు, చొచ్చె నాల్గవ దినంబున్ దానిలో నల్లనన్
దినభాగంబు గతించి, రాత్రి గడచెన్ దెల్లంబుగాఁ గోళ్లుఁగూ

సెను; జొచ్చెన్ భృగు వాసరంబు; నల ప్రాచీదిక్సతీ ఫాలప
ట్టిని గాశ్మీరపు బొట్టువోలె గనుపట్టెన్ సూర్యబింబంబు; ప
ద్మములంతన్ వికసిల్లెఁ దుమ్మెదగముల్ తేనెల్ గొనన్ వ్రాలె ఝు
మ్మని ఝుంకారము లొప్ప; నాపయిని మధ్యాహ్నంబు ప్రాపించె, న
ల్లన సూర్యుండును వాలెఁ జొచ్చె దివిఁ గల్యాణంబు వీక్షింప బం
ధు, నికాయంబులు గాఁదొడంగె; నరనాథుండాత్మ నుప్పొంగఁగన్.

...o...

-: ఆహూతుల యాగమనము :-

చనుదెంచెన్ దనహంస వాహనముపై సమ్యగ్గతిన్ భారతీ
వనితారత్నముతోడ బ్రహ్మ; యటుపై వచ్చెన్ శచీయుక్తుఁడై
చను నైరావతమెక్కి యింద్రుఁడు; మహేశుండయ్యుమాదేవితో
డను, నందీశ్వరు మీఁద వచ్చెఁ దనవెంటన్ మూషికారూఢుఁడై
చను దేరంగను విఘ్నరాజును; సమంచత్కేకిపై నెక్కి వే
డ్కను గ్రౌంచారియుఁ గొల్చి రాఁగ; ననలుండామీఁద నేతెంచెఁ దో
డను స్వాహాంగనరాఁగ; వాయు, యమరాట్ క్రవ్యాదులున్ వచ్చి రం
తను నాదిత్యులు, యక్షకిన్నరులు గంధర్వుల్, వసుల్, సిద్ధసా
ధ్య, నికాయంబులు వచ్చిరెంతయును మోదంబొప్ప; నాసత్యులున్
వెను కౌతూహల మొప్ప వచ్చి; రల విశ్వేదేవతల్ వచ్చి; రిం
కను విద్యాధరకోటి వచ్చె; నటుపైఁ గంజాక్షు గల్యాణముం
గనఁగా లాస్య కళావిలాసములు లోకంబుల్ ప్రశంసించు రీ
తిని జూపంగను వచ్చి రచ్చరలు; నంతే వేడ్క భోగీంద్రు లె
ల్లి, నధోలోకమునుండి వచ్చిరి; సముల్లాసంబు వర్తిల్లఁగాఁ;
బ్రణుతాత్యద్భుత కామరూపముల, నారాజేంద్రుఁడున్ వారి కె
ల్లి, నొసంగెన్ విడుదుల్; సరోజములు డిల్లబోవ నస్త్రాద్రిపైఁ

గనుపట్టెన్ రవిబింబ; మాపయిని జీకట్లాక్రమించెన్ బయిన్
వనజారాతి యడంచెఁ జీకటులు గన్పట్టంగ రాకుండ; స
న్మని వర్యుండు వశిష్ఠుడప్పరిణ యంపుం బ్రక్రియన్నీకుతో
డను శాస్త్రీయముగాఁగ వేడ్కఁదొలుకాడన్ జల్పెనుద్యద్ధతిన్;

****

-: పద్మావతీ వేంకటేశ్వరుల కల్యాణము :-

పసుపం బెండిలి పెద్దలంతఁ బసుపుంబట్టించి ముత్తైదువల్
వనజాతాక్షుని మేనికిన్ నలుగిడన్ బన్నీటితో నంత మ
జ్జన మాడించిరి పేరటాండ్రు తమి హెచ్చన్ జట్టు పుట్టంబు తా
ల్చిన యంతన్ గయిసేసి యాపయిని మాళిన్దిర్చి పాగాను నే
ర్పున ఫాలంబునఁ బెట్టి వర్ధనములన్ బొల్పారఁగా దిద్ది; న
ల్లని చుక్కన్ నునుఁజెక్కిలిన్ నిలిపి; యాహ్లాదంబుతోఁ బెండ్లి కొ
డుకును వేద్యంతర రుక్మపీఠముపయిం గూర్చుండఁగా జేసి; ర
వ్వన జాతాక్షికి వేడ్క ముత్తయిదువల్ పన్నీటితోనట్లె మ
జ్జన మాడించి, సుమంబులం దురిమి, భూషల్దాల్పఁగా జేసి, యు
ల్లన ఫాలంబున నేర్పుమీఱఁగను గల్యాణంపు బొట్టుంచి, న
ల్లని చుక్కన్ నునుఁజెక్కిలిన్నిలిచి యాహ్లాదంబుతోఁ బెండ్లికూఁ
తును వేద్యంతర రుక్మపీఠము పయిం గూర్చుండఁగా జేసి; రం
త, నొసంగెన్ మధుపర్క మల్లునకు మోదంబంది భూపాలుఁడున్;
దనకన్యామణి ధారవోసెహరికిన్ దథ్యంబుగా; నెందు భా
వన చేయన్వలె ధారవోయు నెడలన్ బద్మాక్షుఁడేయంచు న
ల్లుని: నాకాశ నరేంద్రు భాగ్యమున నల్లుండయ్యె పద్మాక్షుఁడే"
యనిమానుల్ గొనియాడి: రాపయిని నెయ్యంబొప్ప ముత్తైదువల్

వనితారత్నముచేత వేడుకఁ దలంబ్రాలన్ దగన్ నాథుమౌ
ళిని బోయించి; వధూశిరంబునను నట్లే పోయఁగా జేసి ర
వ్వాన జాతాక్షునిచేతఁ నాపయి దలంబ్రాలన్; వశిష్ఠుండు చె
ప్పి, నటుల్ మంగళసూత్రమున్ వరుఁడు సంప్రీతిన్ వధూకంఠ సీ
మను గట్టెన్ దమివేసి మూఁడు ముడులున్; ఘ్నదేవతల్ దే వేఁగా
సనలంబున్ వెలిఁగించి పెట్టిరట హోమార్థంబు సద్భక్తి భా
వనతో వేల్చిరి దంపతుల్; పొలసె నవ్వైశ్వాన రజ్వాలికా
జనితంబౌ నవధూమమంతటఁ నుదంచత్ప్రీతి సంధిల్లఁగా
సనేకల్ మట్టెఁగ జేసె నప్పుడు వధూ సత్పాదముం బట్టి య
వ్వాన జాతాక్షుఁడు వేడ్కఁ సప్తపదియున్ బాటిల్లె; నాపైని దృ
ష్టిని సారించిరి మింటిత్రోవ: గనుపట్టెన్ మున్నుగా వారి వీ
క్షణ జాలంబుల కంతలోన ధ్రువనక్షత్రంబు జూపట్టె నిం
కను సప్తర్షి పదంబు; పిమ్మట గనంగా నయ్యెనందున్ వశి
ష్ఠుని ప్రక్కన్ గన సూక్ష్మరూపమునఁ దోఁచున్నకు నేఁగతన్
గనుఁగొండీ; యదిగో "నరుంధతి" యనంగా; దంపతుల్గాంచిరా
య్యాన నీరీతిని బెండ్లితంతు ముగిసెన్; యాజ్జనుల్ మోదవా
రి నిధిం దేలిరి; యప్సరోగణములన్ నృత్యంబులం జేయఁగాఁ
బనచెన్ వేడ్కఁ మహేంద్రుఁ డూర్వశియు రంభా మేనకాదుల్ ప్రద
ర్శనలం జూపిరి, విష్ణుమూర్తి యవతారంబుల్ పదిన్; బ్రీతిమో
హినిగా విష్ణువు నిర్జరాళి కమృతం బింపారఁగాఁ బోయు వే
ళను జూపించిన హావభావ నవహేళల్ చూపి; రాపైని చే
రణియున్ గొండ్లిని జూపి రుత్సుకతతో రాసంబులోనైన వా
నిని నామీఁదట జూపి తన్మయత వాణీనాథ ముఖ్యామరుల్
గనఁగాఁ జేసిరి; విందు భోజనములుం గావించి రవ్వేందునన్
గణనాతీతముగాఁగ భోజ్యములు, భక్ష్యంబుల్ తగం జేసి వ

డ్డనఁ గావించిరిః యెల్లవారుఁ గొనియాడన్ మ్రొక్కుచుల్: పిమ్మటన్
జనఁగాఁ జొచ్చిరి స్వస్థలంబులకుః హంసన్ వాణితో నెక్కి యే
గెను నాళీకభవుండుః నా శివుడు నేగెన్ నందిపై పార్వతీ
వనితంగూడిః మహేంద్రుఁడేగెను సితేభంబెక్కి పౌలోమితోఁ
జనిరాదిత్యులు మున్నుగాఁగల సురల్ స్వర్లోకముల్; పోవుచో
ధనదుంగన్గొని వేంకటేశుఁడనె నర్థంబెంతయో నీ కడన్
ఋణరూపంబునఁ గొంటిఁ బెండ్లికయి; నీకేఁదీర్చెదనన్నడిట్లో”
నన ‘నిట్లాడె నతండు’ భక్తిమెయి విశ్వాత్ముండవో నిన్నుఁగా
దని విశ్వంబున ద్రవ్యముండుగలదా? యన్నన్ నిజాబేయగున్
ఘన తత్త్వార్థము నెంచ; లౌకికముఁగా గన్గొన్న నో నీ కడన్
ఋణముం గొంటి నిజంబు; లౌకికముగా నేఁ బెండ్లి గావించుకొం
టిని గానన్ ఋణమున్ గ్రహించుటయు నట్లే చెల్లెడుంగాన నే
ఋణపడ్డా నది తీర్చికోవలయునోయీ! నేను నీ యప్పు తీ
ర్పను వాంఛింతు జుమీః మొదల్ చెడిన బేరంబుండునే? యెక్కడై
న ననంగా; ధనదుండు నీదయిన యాజ్ఞన్ నా కెటుల్ ధిక్కరిం
ప నగున్, నే శిరసావహింతును భవద్వాక్యంబు నా యప్పతీ
ఱునె? యేనాఁటికి వడ్డియే! యసలు మీఱున్ లెక్కకట్టంగ; న
న్నను “నా రాబడియుండుఁగోట్లపయి నైనన్ నీ ఋణం బట్లె యుం
డును నీ కంతగనే ఋణం పడితి నిన్నున్ మెచ్చ శక్యంబె” యుం
చును శ్రీశుండు కుబేరునంపె; ఫణిరాజుల్ స్వీయ పాతాళముల్
చని; రీరీతిగఁ బెండ్లిపూర్తి యయినన్; తొణ్మపాలుఁడాత్మీయనం
దనఁ బద్మావతి నల్లుతో ననుప నంతజ్జేసె నేర్పాటులన్;
దనయంగాంచి యిటాడె; నే కరణి బోధల్ చేయఁగాఁజాలుచున్
తనుజా! దేవుని భార్యవౌటను జగన్మాతృత్వముంగంటి నే
మనవౌ నాదగు భాగ్యమున్ నిరతమమ్మా సర్వలోకైకంబు

ల్లను గాపాడుము నీ కృపారసము తొల్కంజేసి" యంచాడి; ప
లెక్క, నిటుల్ వేంకటశైలవాసుఁగని బాళిన్ స్వామి! నాకిప్పుడ
ల్లునిగా నైతివి క్షీరవార్ధికిని దుల్యుండైతి నేనన్న నా
తన యారత్నము లక్ష్మి యంశమగుఁగాదా! నిన్నుఁబొల్లాడ నే
ర్చునె? యీ రీతిగఁద త్త్వ మొక్కటియె పేరుల్వేఱురూపంబులుం
గనఁగా వేఱగునంతె; ఁకుఁగలవే కాంక్షల్ భవద్ధ్యానమున్
ఘన భక్తింబూనరించువాఁడు! జగతిన్ ఖండింతు నంబొంచువా
డును. నీకొక్కటె; చైద్యముఖ్యులు బలాఢ్యుల్ నిన్ను ద్వేషించి ము
క్తిని సాధించిరి ధ్యానయోగమునగాదే! లోకముల్లావఁగా
వనజాక్షా! యవతార మెత్తితివి మా పద్మావతీదేవిచే
తను నేనైతిని మామ; శంకరునకు న్దక్షుండు తామామయై
మును జామాతయె యన్న దుర్భమును నా భూతేశునిన్ యజ్ఞ భా
హ్యునిజేయన్ సమకట్టి నష్టపడె; నేనో: నిన్ను జామాతృమా
త్రునిగా స్వప్నమునందు నైనఁగన; భక్తుండన్ విధేయుండ; నె
వ్వనికిన్ శక్యమె నీదులీల లెఱుఁగన్? భ్రాంతుండ గాకుండ న
న్నును రక్షింపు"మటన్న మెచ్చి హరి "నన్నుంబంపు పద్మావతిం 1635
గొని యేనేగెదనన్న శ్రీ సహజమా కూర్మిన్ హరింజూచి యి
ట్లనె నాకాశ నరేంద్రురాణి; "జలజాక్షా! నీవు దేవుండవా
టను, నా కూఁతురు నీకు నిప్డు సతియాటన్ దేవిగా నయ్యె; నై
నను నేఁదల్లిని గాన నోర్చుకొనసౌనా? యందుచే జెప్పుచుం
టిని. నీ వేలుకొనన్ వలెజుమి వధూటీ! రత్నమైనట్టి మ
త్తనయన్ బ్రేయసిగాఁగ నైతి నిటుల త్తన్ నీకు; భూదేవితో
డను సామ్యంబును గంటెఁ దల్లి కిని బిడ్డల్ భర్తృవాల్లభ్యముం
గనుచున్ హాయిగ నుంట కావలయు లోకన్యాయ మిట్లుండు నీ
కును నేఁ జెప్పెదు దాననే" యని కనుంగోనల్ నవాశ్రువ్రజం

బునుజిందన్ వచియింపఁ బద్మకనుఁదమ్ముల్ చెమ్మగిల్లె ; జగం
బున స్త్రీచిత్తము లిట్టులుండు; హృదయంబున్ భర్త కర్పించినన్;
దన పుట్టింటను లేమియే కలిగినన్ దానత్తవారింటిలో
ఘన భోగంబులు గల్గనేనియును భాగ్యంబున్న నెంతేనియున్
దనుఁ జిన్నప్పటినుండి పెంచికడు విద్యాబుద్ధులన్ జెప్పి సా
కిన మాతాపితలన్ విడంగను మనఃక్లేశంబు వాటిల్లునె
మ్మన నాహ్లాదము నంద నప్పుడు గరుత్మంతుండు తావచ్చి ప్రా
లెను; బద్మాపతి తోడ నెక్కెఁగడు హాళిన్ వేంకటేశుండు న
వ్వీనతానందను వీపు మీఁదికిఁగడున్ వీడ్కోలు చెప్పంగ న
మ్మనుజాధీశుఁడుఁ దత్సతీమణియు సమ్యగ్రీతితో, నుప్పరం
బునకున్ లేచెను వైనతేయుఁడు నగంబుల్ సంచలింపంగ, నం
బు నిధుల్ ఘూర్ణిలఁబెల్లఁగిల్లఁగ గజంబుల్ మేఘముల్ తూలఁద
ద్ఘన పక్షమ్ముల నార్చుచున్ జనియె నాకాశంబునందున్ దగన్.

...o...

తొండమాను వసుధానుల వివాదము

అనుకూలంబుగ రాజు పుత్రిక వివాహంబట్లు గావించి య
ల్లునితోఁ బంపిన కొంతకాలమునకున్ లోకుల్ముదింగుంద స
జ్జనుఁడాకాశ నరేంద్రుఁడేఁగ్గి కనియెన్ సాలోక్యమున్; దొండమా
నునకుం దద్వసుధాన నామునకునెంతో స్పర్ధ రాజ్యార్థమై
జనియించెన్ దనులోనఁ దాము తమదే స్వత్వం బటంచున్ జగ
జ్జన సంక్షేమము మాటయెంచక దురాశాపీడితుల్ శుష్కవా
దనలం జేసిరి; తొండమానుఁడు కడున్ దాత్పర్యమేపార న
వనజాతాక్షుని వేంకటేశుఁగని "దేవా! కావవే" యన్నా

కను భక్తుండవునీ; వతండఁగును నాకు న్బావ; నిన్నేర దీ
సినఁ బద్మావతి కుందుగావునను వాసిన్నికుఁజక్రంబు ని
త్తును నేనావసుదాను పక్షమున వత్తున్ యుద్ధముంజేయ; భ
క్తుని నిన్నున్విడ నాడఁజాల; మఱి బంధుండాతఁడోఁ గాన నా
తని వర్జింపఁగరాదు కొమ్మనుచు నంతన్ జక్రమున్ దొండమా
నునకిచ్చెన్ జనుమంచుఁబైని వసు దానుండంత నేతెంచి నా
కను సాయంబొనరింపఁగా వలయు నీకున్బావనై యోడి పో
యినచో నవ్వును లోకమన్న; నటులే యేతెంచి నీ పక్షమం
దని గావింతు నటంచుఁదెల్పిచనె సాహాయ్యంబుగావింప నం
తను ఘోరంబుగ బిండివాలములు, కుంతంబుల్. కటారుల్, గదల్
ఘన భల్లంబులు, ముద్గరంబులు, మహాఖడ్గంబులున్, జక్రశా
త, నిశాతాశుగ పంక్తిమున్నగు ప్రసిద్ధక్రూర శస్త్రంబులన్
గొని యుద్ధంబును సల్పి రుగ్రముగఁ దద్ఘోషల్ దివిన్ముట్ట; ఘో
ర నినాదంబులతోఁ బిశాచములు పోరంజొచ్చు చందాన సై
న్య నికాయంబులు పోరఁజొచ్చుటయు నత్యంతోగ్రమై యప్పుడా
ప్పెను యుద్ధావని హస్తముల్, చరణముల్, పీకల్, తలల్, మొండెముల్
తుని యల్లాఁబడఁ బీన్గుపెంటలయి శత్రుల్ నేలఁగూలంగ నం
తను వార్వీర విహారముల్సలిపి రుద్యత్ క్రోధముల్ మేరమీ
ఱినవారై, వసుదాను సైన్యములు పాఱెన్; దొండమానుండు వే
సెను జక్రంబును వేంకటేశ్వరుఁడు మూర్ఛిల్లంగ; నా వెంటనే
తనకోదండముతోడ నస్త్రముల నంతన్నవ్వగాఁ బాఱివై
చెను; జేరెన్ హరిసన్నిధిన్ గనుల నించెన్నీరు, దుఃఖంబుతోఁ
దనమూలంబున నింతవచ్చెనని; యేతత్పాద యుగ్మంబునౌ

త్తైను; నీవ్రుగఁ దొడంగ భక్తి మెయి నెంతే దాళవ్యంతంబుతో;
వనిలోనన్ వసుదానుఁడున్ మిగుల దుఃఖార్తుల్ చెలంగన్ వెసన్
దన బాణంబులు పాఱవైచి వగచిందన్ సైన్యమున్వీడి వ
చ్చెను దానుం బరిచర్యలం దనుపగా శ్రీనాథునిన్; దుఃఖముం
గొని పాదాబ్జయుగంబు సన్నిధిని దాఁగూర్చుండి సేవింప; మె
ల్లనఁగన్విచ్చెను వేంకటేశ్వరుఁడు నేలం; దొండమానుండు తత్
క్షణమే మ్రొక్కి "క్షమింపుమయ్య! జగదీశా! మూఢునిన్నన్నునో
వనజాతాసన వాసవాదిసురసేవ్యా! భక్తమందార! తె
ల్విని గోల్పోయితి రాజ్యకాంక్షఁగొని యావేశంబుతో నీవొసం
గిన చక్రంబున నిన్నె వేసితినిసీ! కీడెంచకుండన్ దుదిన్
గనువిప్పయ్యెను నాకుఁ దెల్పి కలుగంగాఁ జేయఁగా నీవు క
ల్పన గావించితి సన్నివేశము నిటుల్ పాపాత్ముఁడన్; నీకు బా
ధను గల్గించితి రాజ్యకాంక్ష వదలెన్ దప్పయ్యె రాజ్యాధినా
థునిగా నీ వసుదానుఁ జేయుమని చేతుల్ మోడ్చి ప్రార్థింపఁ బ
ల్కెనిటుల్ వసుదానుఁడున్ వగపుతో లేదింక రాజ్యాశ నా
కనఁగా వారల వాక్యముల్విని మహాహ్లాదంబుతోఁ బల్కెని
ట్లనియా శ్రీహరి మీరలిర్వురును రాజ్యంబింక మీఁదన్ సగం
బును నొక్కండు, సగంబొకండుఁ గొనియే పొచ్చెమ్ములున్ లేక పా
లన చేయుండని, వారలం బనిచి, శ్రీలక్ష్మీసతీనాథుఁ డం
తనె చేయంగఁ దపం బగస్త్యముని రాద్ధన్యాశ్రమస్థానమే
గెను; భక్తుండగు తొండమానుఁ డనురక్తిన్ బాసి రాజ్యంబుపై
వనజాతాక్షుని వేంకటేశ్వర పరబ్రహ్మంబుపైఁ జక్రమే 17
సిన దుష్టాత్ముఁడ ముక్తిఁ గోరుకొనన కిస్సీ! రాజ్యముం గోరుకొం
టిని నాకంటెను బుద్ధిహీనుఁడు కలఁడే! శాశ్వత-బానె యీ

తను? వేనాఁటికినంచు వేంకట నగాధ్యక్షున్ గనంగా నగ
స్త్యుని దివ్యాశ్రమ సీమ కేగి కనెనందున్ విశ్వరూపంబుతో
డను గన్పట్టిన వేంకటేశ్వరుని; వేడ్కన్ భక్తుఁడా తొండమా
నునితో నిట్లనెఁ గట్టఁజేయవలె నిందున్ నీవు దేవాలయం
బును; ప్రాకారములెన్న మూఁడు వరుసల్ పొల్పారుచుండన్వలెన్
ఘనమారీతిని గోపురద్వయమటం గల్పింపనా నెంతయున్
గనుపింౘాగతి ద్వారసప్తక మెసంగంగావలెన్ వాస్తుశా
స్త్ర నిరూఢంబుగఁ జేయఁగావలెఁ బ్రతిష్ఠన్ వేదమార్గంబునన్
వినుమా! యచ్చటనున్న బావి మఱినీవే బాగుచేయన్వలెన్
జనముల్మెచ్చఁగఁ బూలమొక్కలను బెంచంగావలెన్ నిల్చుఁ గాఁ
డను నీకట్టెడు దేవళంబునను వేడ్కన్ నిక్కమౌనన్న; ని
ట్లనె నాతండు మహాత్మ! నేనెఱుఁగనయ్యా! బావిత్రవ్వంగ న
న్నను నీపూర్వభవంబు వింతు నవధానంబొప్పఁగా విన్నటం
చును శ్రీశుండిటు తొండమానునకు నచ్చోఁ దెల్పె సంప్రీతితో.

...o...

తొండమానుని పూర్వ చరిత్ర

వినుపింతున్ తొలి నీ చరిత్రమును; గోపీనాథనాముండు పా
వన గోవిందుని భక్తుఁడై సుజనుఁడై వర్తించు శాంతంబుతో
విను శ్రీనాథు పవిత్ర సచ్చరితలన్ వేనోళ్లఁ గీర్తించుచున్
మనియెన్ జోళపవిత్రభూమికిని సమ్మానంబుతో నేగి చూ
చెను నాతండు "కుశస్థలం"బచటఁ జేసెన్ నిష్ఠతోడన్ దపం
బును; నామీఁదట వేంకటాద్రికిని సమ్మోదంబుతో నేగి, య

విను తాద్రిన్‌గల రంగదాసచతుఁ డ్రవ్వెన్ బావియొక్కండు; పెం
చెను దానెన్నియొ పూలమొక్కలను వాసిన్ వాఁడు, తోమాలెలన్
బెను రక్తిన్ విరచించి యీయఁగను గోపీనాథుఁడా దండల 1725
ర్పణ గావించును నాతు; నొక్కదినమా రంగండు పూదండగోం
చును నేతేరఁగ స్వామిపుష్కరిణిలోఁజూపట్టె రజ్జాక్షులా
తనికిన్ మోహము పెల్లుగాఁగలిగి రేతఃపాతమయ్యెన్ గదున్
వినుమా! దీనిని దివ్యదృష్టిఁగని గోపీనాథుఁడున్ బూజయె
ల్లను బాడయ్యెను నీయతిక్రమము వల్లన్ మృత్యువుంగాంచుమా
యనుచున్ శాపమొసంగె వింటివిగదా! యారంగదాసుండ వీ
వని నీచిత్తము నందలంపు; మటుపై నాబావిపూడెన్; భవ
జ్జని సాఫల్యమునంద బావిని నుదంచత్ప్రీతితో బాగుచే
సిన నీ జన్మతరించు నేగుమని రాజీవాక్షుఁడా తొండమా
నునకుం జెప్పె యదృశ్యమయ్యెః నతఁడు నేఁగెన్నిజావాసమున్.

తొండమానుడు స్వామివారి దేవాలయము నిర్మించుట

చనీమోదంబునఁ దొండమానుఁడు నుదంచత్ప్రీతి రప్పించి శి
ల్పినికాయంబుల, వేంకటాచలముపై వే వేగ దేవాలయం
బును నిర్మింపఁడు శిల్పచాతురి జగంబుల్ మెచ్చఁగానంచుఁ బం
చెను శిల్పీంద్రుల రెండు గోపురములన్ జెన్నొందు ద్వారంబులే
డును; ప్రాకారములొప్పు మీఱగను మూఁడున్; మండపంబొందు ని
మ్మనగోశాలను, ధ్యానమందిరము సొంపుల్మీఱఁగట్టంగఁ ద
త్కనకాద్రి ప్రతిమాన హర్మ్యములు, శుద్ధాంతంబులున్, సౌధముల్
ప్రణుతింబా గతిఁగట్ట నాజ్ఞనిడెః నాపైనిన్ దటాకాదులన్

ఘనతన్ ద్రవ్యఁగఁబంచె, నాటుటకు మొక్కల్ పెక్కు తెప్పించె; సీ
పను లెల్లన్ నెఱవేర్పఁగాఁబడియె భూపాలాజ్ఞచేతన్ ద్వరన్
ఘనుఁడాతండు ప్రతిష్ఠ చేయ సకలత్మాన్మదేవతల్మెచ్చ శి
ల్పి నికాయంబటనాగమోక్తముగ సంప్రీతిన్ దగన్ జెక్కఁ తె
చ్చిన దివ్యాద్భుత విగ్రహంబులను జేజేయంచుఁ గీర్తించి నె
మ్మనమానందము జెందఁగా వికృతినామఖ్యాత సంవత్సరం
బున శ్రీమార్గశిరంబునం బ్రథమమై పాల్పొందు నయ్యశ్వినిన్
బ్రణుతంబౌ గురువాసరంబుననునా రాజేంద్రుఁడుర్వీసురా 1750
గ్రణు లెన్నంగఁ బ్రతిష్ఠ చేసెను జగత్కల్యాణముం గూర్పఁగన్.
చనియెన్ కాలముఁ గొంత; వేంకటగిరిన్ సద్భక్త సంసేవ్యుఁ డా
చును బద్మావతిఁ గూడియున్న జలజాక్షుండాత్మలో వేగుచుం
డెను లక్ష్మీవిరహార్తితోడఁ గని పెట్టెన్ దాని బద్మావతీ
వనజాతేక్షణ యింగితజ్ఞ యయి; యీ వైకుంఠునిన్ మాధవుం
డనుచుం జెప్పను సంహితల్ సవతినై యాలక్ష్మికిన్ విష్ణుదే
వునగున్ నేనెడఁ బాటు చేసిన జగంబుల్ మెచ్చునే? యంచుఁ దా
వనె నీరీతిని వేంకటేశ్వరునితో "నాలక్ష్మి మాయక్క యా
మెను వక్షంబునఁ దాల్పకుంటతగునే? మేల్మేలు మీ చేత"ల
న్నను బద్మావతి మాటలం దనిసి" కాంతా! ధర్మబద్ధంబుగా
ననినావిప్పుడు లక్ష్మికై తపము చేయంబోదు నంచున్ సుప
ర్ణునిమీఁదన్ గరవీరమన్న ఘనమౌ ప్రోల్ చేరె నచ్చోటఁ జే
సెను ఘోరంపుఁ దపంబు దీక్షఁగను లక్ష్మీదేవికై యంతటన్
జనులున్, మానులు, సర్వదేవతలు, రక్షస్సంతతుల్, లోకముల్
ఘనమౌ శ్రీశతపోమహాగ్నిఁ బడి క్రుంగన్; నారదుండంత దా
నినివారింపఁగ నెంచి శ్రీ కపిల మౌనిం జేరి ప్రార్థింప నా
మునియున్ లక్ష్మినిగూర్చిఁ బల్కెనిటులన్ బ్రోవంగదే లోకముల్

జననీ నీవెఱుగంగ లేనిదెచటన్ జర్చింపఁగా గల్గునే!
మును సీతాసతివై ననాఁటి చరితంబున్ జ్ఞప్తికిం దెచ్చుకొ
మ్మన లేదా కడు వేడ్క వేదవతితో నానాఁడు శ్రీ వేంకటే
శునిగా నేనవతారమెత్తుదు నటంచున్నాఁడు పద్మావతీ
వనితారత్నమవైన నిన్నుఁగొనెదన్ వాల్లభ్యమేపార నం
చును; బద్మావతి నీదు నంశయెకదా! శోధింప నన్నన్ రమా
వనజాతేక్షణ వేంకటేశ్వరు తపోవాటంబు చేరంజనన్
గని బ్రహ్మాదులు లోకమాతకు నమస్కారంబులం జేసి యో
జననీ! నీవు ప్రసన్నురాలవయి కంజాతాక్షుఁడై త్రిలోక్య భీ
జనకంబైన తపంబు మాన్పుమిఁక నీర్ష్యన్ గాంచఁగా నేలకే నీ
వనఁ బద్మావతి యన్న నొక్కరె యనం బాటించి యా మాటలన్
వనజాక్షుం దపమాఁపఁ గోరుటయు, సంభావించి యియ్యబ్ధి నం
దన వక్షంబున నిల్పి, యాపయిఁదగన్ బద్మావతిన్ బార్యనీ
మను నిల్పెన్; వెస వెంకటేశ్వరుఁడు సన్మానంబుతోఁబల్కె నె
మ్మన మొప్పంగఁగ నిట్లు వేడ్క "నలవేల్ మంగాఖ్యతో నింకనొ
ప్పును బద్మావతి పద్మజాత యనుచున్ బూఁబోఁడి" యీ లక్ష్మియున్
గనఁగాఁ బద్మనివాసయే కద! జగత్కల్యాణ సంధాత్రనై
వినుతింగాంతును వేంకటాఖ్యమగు పృథ్వీభృచ్ఛిరోగ్రంబుపై
ననుచున్ భార్యలతోడ నేగహరి యత్యంతంబు హర్షించుచున్
వనజాక్షుండగు వేంకటేశ్వరుని భవ్యంబైన చారిత్రమూ
ని, నవంబౌగతి మాలికాకృతిగ "శాంతిశ్రీ" సమాఖ్యన్ ధరిం
చిన శ్రీ రాజమహేంద్రవాసి, విబుధాశీర్వాదముల్ గోరు స
ద్వినయాంచద్గుణభాసి "బాత్సకవి" యెంతే భక్తి నిద్దాని వ్రా
సెను; దీనిం బఠియించినన్, వినిన నా శ్రీశుండు ప్రోచుంగృపన్.

శ్రీ రాజమహేంద్రపుర వాసులు, "శాంతిశ్రీ" బాత్సకవిగారు ప॥గో॥ జిల్లా "నరసాపురం" శ్రీ కపిల మల్లేశ్వరస్వామివారి ఆలయప్రాంగణమున సుమారు ఒక నెలరోజులు "దశావతార పౌరాణికోపన్యాసములు" చెప్పగా వారికి పౌరసన్మానము జరుగు సమయమున సమర్పించిన

—: ప్రశంసా ప్రసూనాంజలి :—

మందార కుందారవిందోదరస్యంది
మారంద భాసిత మందరముల
గంభీరలపిత విజృంభణారంభ శుం
భచ్చూర్ణికా దండకోచ్చయముల
నాకర్ణనోత్కర్ష హర్షణోద్ధర్ష చి
క్కీర్షిత వర్ణనా శీర్షములను
మానితానూన సమ్మాన విజ్ఞాన దో
న్మోషణా గాన ధునీవ్రజముల

నతుల శ్రుతిహిత మత వితతాఖిల విల
సత్పురాణేతిహాస కథోత్సల చయ
జాత ఘుంఘుమోత్పన్న ప్రసంగములను
భాసిలును "బాత్సకవి" యుపన్యాస మదిర!

సరసకవిత్వ తత్త్వ పరిసర్పిత చిత్తసరోరుహుండు, సుం
దర హృదయానురంజక కథాకథన ప్రతిభావిభాసి, భ
క్తి, రమ సముత్థితాంశ సముదీర్ణుడు; శ్రోతృజనప్రమోదదూం
దురవడి "బాత్సకవి" సమున్నతినంది వెలుంగుగావుతన్॥

అపశబ్దం; బపపారం;
బపభాషణ బాత్సకవి యుపన్యాసకథా
సుపథంబునఁ గనరాదన
నుపగీతముగాఁ దలంచు టొప్పదుసుజనుల్॥

సంగీతంబును, సాహితీపటిమయున్ సౌజన్య సద్భావముల్
రంగత్తుంగ సుభావసంఘఘటిత ప్రాచీన విద్వన్మృగేం
ద్రాంగీకార్యమనోజ్ఞ పద్యములు హృద్యంబౌనటుల్ పాడ: స
ర్వాంగీణం బొనరింతు మోదమును; దీర్ఘాయుస్సునీకయ్యెడిన్।

నేనే వ్రాసినదిది యని
తానే వచియింపఁ దెలియఁదఁగుగాకే ప్రా
చీన కవిదోయనిఁ దోచును
వీని కవితాదృశమయి వెలయుటచేతన్॥

ఇట్లు,

నరసాపురం | కవిభూషణ, కవిశేఖర, కవితావతంస, కవిర
తే24-10-70 | శిష్టా వేంకటసుబ్బయ్య (సం)

—0—

శ్రీమద్రాజమహేంద్రవర పురవాసులు, స్వర్ణ సింహాలలాట ఘంటా కంకణహస్తులు, "శాంతిశ్రీ" బాత్సకవిగారు మాపాలకొల్లు పురమున గల శ్రీక్షీరారామలింగేశ్వరస్వామివారి ఆలయప్రాంగణమున తే. 11-1-1970 నుండి తే. 14-12-1970 వరకు "దశావతార పౌరాణికోపన్యాసములు" చెప్పి మా పురజనుల మానసము లుత్తూ తలూగించుట పురజనులు వారికి పదునెనిమిది సింహములు గల స్వర్ణసింహాలలాట ఘంటాకంకణమును పౌరసన్మానము జరిపించును సమయమున వారి కర్పించిన

—: అభినందన :—

శ్రీ మద్భాగవతోత్తమమ్ గుణమణిం స్నిగ్ధప్రపత్యాత్మకం
గీర్వాణాంధ్ర మనోజ్ఞ వాఙ్మయచణం కీర్తిప్రభారాజితమ్
శ్రీ నారాయణ దాసవర్య మహదాశీర్వాద సంపన్నిధిం
పాయాద్బాత్సకవీంద్రచంద్రమనిశం భక్తప్రియో రాఘవః॥

మును నీకీర్తి నివింటి, నేడిచట నీమూర్తిం గనుంగొంటి; స
జ్జనతామాన సుధీప్రచోదిత సదస్యవ్రాత మోహాహోయన్
వినుపంజాలి "దశావతారచరితన్" వీన్విందుఁ గావించి నా
వనఘా! బాత్సకవీంద్రచంద్ర! గొనుమయ్యా! మా నమోవాకముల్

హంగులు లేకొక్కండవై
సంగీతముతోడ సరళసాహితి మేళం
బుంగనమాహ్లాదయముల
పొంగించిన నీదు పేరు పున్నెనుతింతున్॥

సమర్పణ
చోడిసెట్టి సూర్యారావు
మున్సిపలు చైర్మను-పాలకొల్లు
తే, 14-12-2970

రచన:
కథా కళాప్రపూర్ణ - మహాకవి -
పెద్దింటి దీక్షితదాసు, (సం)
నరసాపురం.

శ్రీమద్రాజమహేంద్రపురవాసులు "శాంతిశ్రీ" బాత్సకవిగారు శ్రీఉమామార్కండేయేశ్వరస్వామివారి ఆలయమున సుమారు డెబ్బదియైదు రోజులు "దశావతార పౌరాణికోపన్యాసములు" చెప్పగా వారికి పౌరసన్మానము గావించి స్వర్ణసింహలలాట ఘంటా కంకణము సమర్పించు సమయమున సమర్పించిన

—: స్వర్ణ కిరీటము :—

అందము చిందుచుం జిగురుటాకులు కుల్కెడి విశ్వసౌఖ్యకా
వ్యేందిరయై, ప్రభాతపరమేశ్వరియై, నవయౌవనాంగియై।
యందరముందు బాత్సకవితార్య కవిత్వపటుత్వకాంత మి
న్నందుచు గౌరవింపఁబడె హాయిగఁ దీయఁగ మేలు మేల్భళీ!

సౌందర్య సౌఖ్య నిష్యందామృతోత్సవ
కంపాలతలతోడ సౌఖ్యమంది
మధుర మోహనకళా మందారపుష్ప వి
శ్వవిలాసినీ భాగ్యపట్టమంది
యానందవాక్యనాట్యసుమనోహారసరో
వరజలకాలలో పరవశించి
యౌదార్యధుర్య ధైర్యస్థైర్య గాంభీర్య
సద్యశోప్సరసతో సఖ్యమూని

యంచిత పురాణకథల నుయ్యాలలూగి
నవనవోన్మేషభావ విన్యాసమొప్ప
బ్రహ్మపట్టమ్మునందెనీ పట్టణమున
బాత్స సుకవి సమ్మానాబ్జముఖి బలారె! ॥

ఆశాలతా స్వర్ణహారసౌదామనీ
జయజయ ధ్వానముల్ ప్రియములయ్యె
జలదగంభీర నిస్వన విధానముతోన
పౌరుషమ్ములు జయభేరులయ్యె
బృందావనోత్సవ మందారపుష్ప వి
తానమ్ములు జయపతాకలయ్యె
రసవిలాసధునీ తరంగమ్ములు తురంగ
మాతంగ చతురంగ జాతులయ్యె

గగనమండలి మార్మ్రోగ నిగమనాద
రోదసీ గహ్వరమ్ము సుశ్లోకమెసగ
నీకవిత్వ పటుత్వ వినీతితోడ
బుణ్యపురుషుండవార! శ్రీ బొత్సుకవి॥

సమర్పణ :
పోతుల వీరభద్రరావు
మున్సిపల్ చైర్మను
బండి రామమోహనరావు
జిల్లా జడ్జి
రాజమండ్రి.
తే. 24-3-1963

రచన :
ఆంధ్ర బెర్నాల్డుషా - జగజ్జనని
వేదాంతకవి

—0—

ప్రశంసలు

ఓమ్ ఆంజనేయాయ నమః

శ్రీః

యోఽయం రాజమహేంద్ర నామకపురే రాజత్ప్రతిష్ఠాయుతై
ర్విద్వద్భిః కమనీయ కావ్యకలనాదక్షైః కవీంద్రైస్స్తుతే
"గీతా మందిర" నామ సద్మనివహేరాఖ్యానకాన్యన్వహమ్
మోచాపన్నిభ వాగ్భరస్సకథయన్ మోదం దిశన్ శృణ్వతామ్।

ఏతత్పత్తన సంస్థితాస్సుమనసః శుత్వాయదీయాగిరః
మృద్వీకామధుమాధురీ మదహరీవ ర్తీశ్చ శర్మ ప్రదాః
ప్రీతిం, శ్రీశపదాబ్జయో రతితమాంభక్తించ సంప్రాప్నువన్
సోఽయం "బొత్సకవి" స్సుధీర్విజయతాం శ్రీశస్య కారుణ్యతః॥

కేచిత్సన్తి పురాణబోధనచణాః. కేచిత్కవిత్వాదరాః
కేచి ద్వీణవదానగాననిపుణాః, కేచిచ్చ భక్త్యన్వితాః
ఏత "ద్బొత్సకవిః" పురాణకవితాగానేష్వముష్మిన్ పురే
విద్వత్ప్రస్తుతి యోగ్యతా మధిజగే యాదృజ్ఞసందృశ్యతే॥

ఖ్యాతః కవిత్వే, భగవత్కథా యా
స్సంకీర్తనే పుణ్యపురాణబోధే
సౌజన్య సౌశీల్య శమాది యుక్తః
జేజీయతాం బొత్సకవిర్మహాత్మా॥

ఏవమాశాస్తే
జి.వి వి. తాతాచార్యః
సాహిత్య విద్యాప్రవీణః, భాషాప్రవీణశ్చ
రాజమహేంద్రవరమ్
తే. 3-12-1967.

బొత్సకవి సృష్టించిన నూతన రికార్డు

ప్రముఖ దినపత్రిక కోస్తావాణి

రాజమండ్రి. ఆగస్టు 28 : మాలికా రచనలో శ్రీ బొత్సకవి పాత రికార్డును బద్దలుకొట్టారని ప్రముఖ కవి కళాప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. శ్రీ బొత్సకవి వ్రాసిన శ్రీ వెంకటేశ్వర మత్తేభమాలిక కావ్య గాన సభకు శ్రీ మధునాపంతుల అధ్యక్షత వహించారు.

తెలుగు సాహిత్యంలో అరుదుగా కానవచ్చే ప్రక్రియ మాలిక. పూర్వం అల్లసాని పెద్దన, రామరాజభూషణుడు ఈ ప్రక్రియలో కవిత వ్రాశారని శ్రీ మధునాపంతుల తెలియజేశారు. అదే విధంగా ఆధునిక కాలంలో రామకృష్ణ కవులు, విజయనగరం కవులు ఈ ప్రక్రియలో తమ ప్రతిభ చూపించారు. కాగా శ్రీ బొత్సకవివలె పూర్వపు కవులెవరు ఇంత సుదీర్ఘమైన మాలికను వ్రాయలేదని శ్రీ మధునాపంతుల చెప్పారు, విజయనగర కవులు ఆరుగురు ఈ మాలికా రామాయణాన్ని ఆరు కాండలుగా వ్రాశారు. అయితే ఈ మాలికలలో ఏ ఒక్కటీ 1500 చరణాలకు మించలేదు. కాగా శ్రీ బొత్సకవి వ్రాసిన శ్రీ వెంకటేశ్వర మత్తేభమాలిక మాత్రం 2500 చరణాల వరకు విస్తరించి ఉన్నదని ఆయన వివరించారు. ఇంతటి సుదీర్ఘ మాలికను వ్రాయటంద్వారా బొత్సకవి తెలుగు సాహిత్యంలో ఒక కొత్త రికార్డును సృష్టించారని ఆయన ప్రశంసించారు. ప్రవాహంవలె సాగే ఈ మాలిక బొత్సకవి కవితా ప్రతిభకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

రాజరాజ నరేంద్రునికి పట్టాభిషేకం జరిగిన శ్రావణ బహుళ విదియనాడు ఈ సభ జరగటం ఒక విశేషమని శ్రీ శాస్త్రి చెప్పారు. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం ఇదే రోజున ఈ మహాపట్టణంలో రాజరాజ నరేంద్రునికి పట్టాభిషేకం జరిగిందనే విషయాన్ని గుర్తించుకోవాలని ఆయన అన్నారు. శ్రీ బొత్సకవి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డు ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ శ్రీ పానుగంటి శ్రీరామమూర్తి తెలియజేశారు. శ్రీ బొత్సకవి ఈతిబాధలు తీర్చడానికి ఆర్థిక సహాయం చేయవలసిందిగా శ్రీ పానుగంటి చాంబర్ ఆఫ్ కామర్స్

నుకోరారు. ఇట్టి మహాకవికి సహాయం అందించినట్లయితే సాహిత్యానికి సేవ చేసినట్టు కాగలదని ఆయన అన్నారు. అయితే, కవులకు సహాయం చేయగల ఆర్థిక స్తోమత తమ సంస్థకులేదని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీ బొమ్మన సుబ్బారావు తెలియజేశారు. తాము ఇదివరలో శ్రీ బొత్సకవికి కొంత ఆర్థిక సహాయం చేసినట్టు ఆయన చెప్పారు శ్రీ బొత్సకవి వ్రాసిన ఈ కావ్యంముద్రణకు వెంకటేశ్వర స్వామి సహకరించగలడన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. శ్రీ వెంకటేశ్వర మత్తేభ మాలిక కావ్యాన్ని పెద్దాపురం కళాశాల తెలుగు లెక్చరర్ శ్రీ పంపన సూర్యనారాయణ మధురంగా గానం చేశారు. కవి ప్రతిభను కూడా ఆయన మధ్య మధ్య ప్రశంసించారు.

పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ ముప్పన రామారావు పంపిన 116 రూపాయలను శ్రీ పంపన కవికి అందజేశారు చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి శ్రీ రౌతు సూర్య ప్రకాశరావు మరో 116 రూపాయలను శ్రీ బొత్సకవికి అందజేశారు. శ్రీ సూరపరెడ్డి దొరయ్యకవి గారికి 200 రూపాయలను బహూకరించారు. శ్రీ బొత్సకవి స్వయంకృషితో వృద్ధిలోకి వచ్చారని డాక్టరు జొన్నలగడ్డ మృత్యుంజయరావు చెప్పారు. శ్రీ బొత్సకవి చెక్కు పద్యాలను కంఠస్థం చేశారని ఆయన అన్నారు. సర్కస్ ఫీటు వంటి ఈ మాలికా ప్రక్రియలో శ్రీ బొత్సకవి ప్రౌఢిని, వర్ణనా నైపుణ్యాన్ని ప్రదర్శించటం మెచ్చుకోదగిన విషయమని ఆయన అన్నారు. శ్రీ బొత్సకవి వ్రాసిన ఈ కావ్యంఅచ్చులో వెలువడగలదన్న ఆశాభావాన్ని ప్రముఖ న్యాయవాది శ్రీ పొతుకూచి సూర్యనారాయణమూర్తి వ్యక్తం చేశారు.

తన చిన్నతనంలో శ్రీ నారాయణమూర్తి మత్తేభమాలికలో వ్రాసిన యుద్ధ కాండను చూశానని, ఇటువంటి కావ్యం వ్రాయాలన్న కోరిక తనకు ఆనాడే కలిగిందని శ్రీ బొత్సకవి చెప్పారు. శ్రీ మధునాపంతులవారు ఈ కావ్యం వ్రాయటానికి తనకు ప్రేరణ కలిగించారని ఆయన అన్నారు, భగవంతుని దయవల్ల తనకు ఎటువంటి లోటు లేదని శ్రీ బొత్సకవి చెప్పారు. బొత్సకవిదంపతులను శ్రీ రెడ్డి సూర్యారావు దంపతులు సన్మానించారు. ప్రముఖన్యాయవాది శ్రీ సాధనాల నరసింహమూర్తి ప్రభృతులు ప్రసంగించారు. శ్రీ సన్నిధానం నరసింహశర్మ స్వాగతం పలుకగా, శ్రీ వల్లూరి రఘునాథశర్మ వందన సమర్పణ చేశారు.